ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూరి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
ఖమ్మం
: fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
30-10-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 268 పేజీలు: 8+16 వెల: 6.50

ఓట్ల కోసం డాన్స్‌కైనా మోడీ రెడీ: రాహుల్
ట్రంప్‌కు దక్షిణ కొరియా అత్యున్నత పురస్కారం
5

## అజారుద్దీన్‌కు మంత్రి పదవి?

**రేపే కేబినెట్ విస్తరణ!**

**ఏఐసిసి పచ్చజెండా**



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు29:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ఏఐసీసీ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర మంత్రి వర్గంలో మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు అవకాశం కల్పించనుంది. శుక్రవారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ కార్యక్రమం ఉంటుందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు వెల్లడించాయి. అజారుద్దీన్‌తో గవర్నర్ మంత్రిగా ప్రమాణం చేయించనున్నట్లు తెలుస్తోంది. అజారుద్దీన్‌కి హోం, మైనారిటీ మంత్రిత్వ శాఖ ఇచ్చే అవకాశం ఉందని ప్రచారం అవుతోంది. తెలంగాణలో మంత్రివర్గ విస్తరణపై గత కొన్ని రోజులుగా ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ)లో కసరత్తు జరుగుతోంది. ప్రస్తుతం రాష్ట్ర కేబినెట్‌లో 15 మంది ఉండగా, మరో ముగ్గురిని మంత్రి వర్గంలోకి తీసుకునే అవకాశముంది. అయితే ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన

>>2



బుధవారం సూర్యాపేటలో వరద నీటిలో వరిచేలు



బుధవారం వరంగల్‌లో ఏరులై పారుతున్న వరద మధ్య రోడ్డును దాటుతున్న వాహనదారులు



బుధవారం సూర్యాపేటలో కల్లాల్లో నిండిన వరద నీటిని తొలగిస్తున్న రైతు

### తెలంగాణకూ

# 'మొంథా' గండం

## ప్రాణ, ఆస్తి నష్టం రానీయొద్దు

**ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు చేయండి**

**అధికారులు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలి**

**తుఫాన్ ప్రభావంపై సమీక్ష జరిపిన సిఎం రేవంత్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు29:** మొంథా తుపాన్ ప్రభావంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను బుధవారం ఆరా తీశారు. వరి కోతల సమయం కావడం.. పలు చోట్ల కళ్లాల్లో ధాన్యం ఆరబోసిన నేపథ్యంలో ఎటువంటి నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లోనూ తగిన ఏర్పాట్లు చేయాలని సీఎం సూచించారు. మొంథా తుపాను

>>2



## జల దిగ్బంధంలో వరంగల్లు, హన్మకొండ

**8 జిల్లాలకు అతిభారీ వర్ష సూచన**

**పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్ జారీ**

**పలు ప్రాంతాల మధ్య స్తంభించిన రాకపోకలు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు29:** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుపాను మొంథా వాయుగుండంగా బలహీనపడింది. ఆరుగంటలుగా 12 కిలోమీటర్ల వేగంతో వాయుగుండం కదులుతున్నది. భద్రాచలానికి 50 కిలోమీటర్లు, ఖమ్మంకు 100 కిలోమీటర్లు, ఒడిశా మల్కాన్‌గిరికి 130 కిలోమీటర్ల దూరంలో వాయుగుండం కేంద్రీకృతమైంది. ఉత్తర వాయువ్య దిశగా కదిలి క్రమంగా తుపాను బలహీనపడుతుందని వాతావరణశాఖ అంచనా వేసింది. వాయుగుండం నేపథ్యంలో రాగల 12 గంటల్లో తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది.తెలంగాణలో ఒకటిరెండు ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని పేర్కొంది. పలు ప్రాంతాల్లో 35-45 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని చెప్పింది. మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణలోని పలుజిల్లాల్లో ఎడతెరిపి లేకుండా భారీవర్షం కురుస్తోంది. దీంతో హన్మకొండ,

>>2

## రాఫెల్‌లో రాష్ట్రపతి ముర్ము



**యుద్ధవిమానంలో ప్రెసిడెంట్ విహారం**

**న్యూఢిల్లీ, అక్టోబరు 29:** భారత దేశ ప్రథమ పౌరురాలు రాష్ట్రపతి ద్రౌపదిముర్ము శక్తిమంతమైన రఫేల్ యుద్ధ విమానంలో విహరించారు. హరియాణాలోని అంబాలా వైమానిక స్థావరం నుంచి ఆమె ప్రయాణించారు. ఎయిర్‌ఫోర్స్ అధిపతి మార్షల్ ఏపీ సింగ్ ప్రత్యక్షంగా వీక్షించారు. రఫేల్ జెట్‌లోకి ఎక్కేముందు ఆమె జీ సూట్‌ధరించారు. చేతిలో హెల్మెట్ పట్టుకుని, సన్‌గ్లాసెస్ ధరించిన ముర్ము, పైలట్‌తో

>>2



పట్టాలపైకి వరద నీరు చేరడంతో డోర్నకల్‌స్టేషన్‌లో ఆగిన గోల్కొండ ఎక్స్‌ప్రెస్

## 137 రైళ్లు రద్దు

**కొన్ని రైళ్లు దారి మళ్లింపు**

**హైదరాబాద్ (తార్నాక), అక్టోబర్ 29 ప్రభాతవార్త:** మొంథా తుఫాన్ కారణంగా తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. తీర ప్రాంతాల జిల్లాలో విధ్వంసం సృష్టించింది మొంథా తుఫాన్. మిగతా జిల్లాల్లోనూ తీవ్ర పంట నష్టాన్ని మిగిల్చింది. ఇక తుఫాన్ ప్రభావంతో ఈస్ట్ కోస్ట్,

>>2

## ఆరేళ్లలో నాలుగుకోట్ల కొలువుల సృష్టి

**పట్టణ ప్రాంతంలో 60% వర్కర్లు సేవల రంగంలోనే**

**తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకలో సేవల రంగ హబ్‌లు**

**నీతి ఆయోగ్ నివేదిక విడుదల**




**న్యూఢిల్లీ,అక్టోబరు 29:** సేవలరంగంలో భారత్ మొత్తం 30శాతం వాటాతో ఉందని,ప్రపంచ సగటు 50శాతంతోపోలిస్తే కొంత తక్కువే అయినప్పటికీ ఇటీవలి కాలంలో గణనీయమైన వృద్ధిని నమోదు చేస్తోందని నీతి ఆయోగ్ నివేదిక విడుదలచేసింది. 2023-24 సంవత్సరంలో సేవలరంగంలో ఉపాధి 29.7శాతానికి పెరిగిందని, అంతకుముందు 2011-12లో కేవలం 26.9శాతం మాత్రమే ఉందని గడచిన ఆరు సంవత్సరాల కాలంలో నాలుగు కోట్ల ఉద్యోగాలను సృష్టించినట్లు నివేదిక ప్రస్తావించింది. ఉపాధి ధోరణులు, ప్రభుత్వస్థాయిలో కసరత్తులు అన్న శీర్షికతో విడుదలచేసిన నివేదికలో సేవలరంగం దేశ ఉపాధి వృద్ధికి గణనీయమైన భూమిక పోషిస్తోందని కరోనా మహమ్మారి తర్వాత పూర్తిగా రికవరీ అయిందని,అయితే సవాళ్లు మాత్రం ఎదురవుతూనే ఉన్నాయని నీతి ఆయోగ్ నివేదికలో స్పష్టంచేసింది. ప్రపంచ సగటు 50శాతంతో పోలిస్తే తక్కువేనని, నిర్మాణాత్మక పరివర్తన దశలో ఉందని వివరించింది. కొన్ని సంస్కరణలు కూడా అవసరమని, ఫాస్ట్ ట్రాకింగ్‌లో సామాజికభద్రత ఉండాలని, సంఘటిత కార్మికుల రిజిస్ట్రేషన్ డిజిటైజేషన్ జరగాలని సూచించింది. అలాగే కార్మికుల భద్రత సంరక్షణ కార్యాచరణ సేవలు కూడా పెరగాల్సి ఉందని వీటిసాయంతో సేవలరంగంలో మంచి వృద్ధిని సాధించగలమని వివరించింది. స్థూల దేశీయోత్పత్తిలో 50శాతం వరకూ సేవలరంగంనుంచే వస్తోందని వివరించింది. పట్టణప్రాంత వర్కర్లు 60శాతంమందిసేవలరంగంలోనే ఉన్నారని, గ్రామీణ ప్రాంతాల్లో 20శాతం మాత్రమే

>>2



బుధవారం హైదరాబాద్‌లో డి.సిఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమైన మెక్‌డొనాల్డ్ సంస్థ ప్రతినిధులు

## జిసిసిలకు రాజధాని హైదరాబాద్

**పాలనపై నమ్మకానికి ప్రతీక మెక్‌డొనాల్డ్ గ్లోబల్ ఆఫీసు**

**మినార్లు, సరస్సుల నుంచి గ్లోబల్ స్థాయికి ఎదిగిన సిటీ**

**జిసిసిలు హైదరాబాద్‌ను ప్రపంచ కమాండ్ సెంటర్ చేస్తున్నాయి: డిసిఎం భట్టి, మంత్రి శ్రీధర్ బాబు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు29:** తెలంగాణ ప్రతిభ పై విశ్వాసం పరిపాలనపై నమ్మకానికి మెక్‌డొనాల్డ్ గ్లోబల్ ఆఫీస్ ఒక ప్రతీక అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం ఆయన పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి టీహబ్ సమీపంలో మెక్‌డొనాల్డ్ గ్లోబల్ ఆఫీస్‌ను ప్రారంభించిన అనంతరం ప్రసంగించారు. తెలంగాణ అద్భుత ప్రతిభకు మెక్‌డొనాల్డ్ గ్లోబల్ ఆఫీస్‌కోసం హైదరాబాదును కేంద్రంగా ఎంచుకోవడం ఒక నిదర్శనం అన్నారు. జిసిసి(గ్లోబల్ కేపబులిటీ సెంటర్స్)లకు రాజధానిగా హైదరాబాద్ నిలిచిందని డిప్యూటీ సీఎం తెలిపారు. మాజీ ప్రధాని నెహ్రూ మొదలుకొని ఆ తర్వాత పీవీ నరసింహారావు, మన్మోహన్‌సింగ్ వంటి మహా నేతలు దూరదృష్టితో చేపట్టిన చర్యల మూలంగా హైదరాబాద్‌కు మరింత బలం చేకూరిందని డిప్యూటీ సీఎం వివరించారు.1940లలో మ్యాక్‌డొనాల్డ్స్ ప్రారంభమైనప్పుడు, అది

>>2



**తడిసిన ధాన్యం కొనుగోలుపై**

## త్వరలో నిర్ణయం

**మంత్రి పొన్నంతో చర్చించిన మంత్రి ఉత్తమ్**

**హైదరాబాద్, అక్టోబర్ 29,ప్రభాతవార్త:** తడిసిన ధాన్యం కొనుగోలు అంశం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి విధానపరమైన నిర్ణయం ప్రకటిస్తామని పౌరసఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. మొంథా" తుఫాను ప్రభావంతో రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో సివిల్ సప్లయ్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో మంత్రి పొన్నం ప్రభాకర్,ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సమావేశమై వర్షంతో రైతులకు కలుగుతున్న నష్టాలను తెలిపారు. భారీ వర్షాలతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ,సిద్దిపేట జిల్లా,హనుమకొండ జిల్లా లో భారీగా పంట నష్టం జరిగిందని

>>2

## జల దిగ్బంధంలో గ్రామాలు

నాగర్ కర్నూలు జిల్లాలో బుధవారం నీట మునిగిన వరి పంట




**ఆరెంజ్ జోన్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా**

**పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు**

ఎపి తుఫాన్ ప్రాంతాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఏరియల్ సర్వే 7

**మహబూబ్‌నగర్ బ్యూరో,అక్టోబరు 29 ప్రభాతవార్త:** మొంథా తూఫాన్ ఎఫెక్ట్ ఉమ్మడి పాలమూరుపై పడింది. పలుచట్లో ఈదురుగాలులతో కూడిన మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉప్పునుంతల మండలంలో అత్యధికంగా 19 సెంటి మీటర్ల వర్షపాతం నమోదైంది. ఉప్పునుంతల జలదిగ్బంధంలో నిలిచిపోగా 14గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఉప్పునుంతల నుంచి అచ్చంపేటకు వెళ్లే మార్గంలో మల్లప్ప వాగు, ఉప్పునుంతల నుంచి కంసానిపల్లి మీదుగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి

>>2



**మరో 72 మంది నక్సల్స్**

## లొంగుబాటు

**బీజాపూర్‌లో 51, సుకుమాలో 21మంది**

**చర్ల, అక్టోబర్ 29, (ప్రభాతవార్త):** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల లొంగుబాటు పరంపర కొనసాగుతుంది. ఆపరేషన్ కగార్ తో ప్రాణాలు పోగొట్టుకోవడం కన్నా జన స్రవంతిలో కలిసి జీవించడమే ఉత్తమమైన మార్గం అని భావించిన మావోయిస్టులు అడవిబాట వీడుతున్నారు.తాజా భుదవారం సుకుమా జిల్లాలో ఆయుధాలతో సహ 21 మంది మావోయిస్టులు లొంగిపోగా బీజాపూర్ జిల్లాలో 51 మంది మావోయిస్టులు లొంగిపోయారు. చత్తీస్‌గఢ్ ప్రభుత్వం చేపడుతున్న పునరావాసం పునరుజ్జీవనం విధానం క్రింద ఈ లొంగుబాట్లు జరుగుతున్నాయని బస్తర్ ఐజీ సుందర్ రాజ్ బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్‌లు తెలిపారు. మావోయిస్టులు కార్యకర్తలు హింస మార్గాన్ని విడాలని అన్నారు.అజ్ఞాతంలో ఉన్న వారు ఇదే మార్గాన్ని ఎంచుకొని ప్రజా జీవనంలో కలవాలని సూచించారు.బీజాపూర్ లోలొంగిపోయిన వారిలో 9 మంది మహిళలు మ 42 మంది పురుషులు ఉన్నారు, వీరిపై 66 లక్షల రివార్డు ఉందని ప్రకటించారు.పిఎల్ జిఏ బెటాలియన్, కంపెనీ 1, 2 మరియు 5 సభ్యులు, ఏరియా కమిటీ పార్టీ, ప్లాటూన్ మరియు శిశిది జనతా సర్కార్‌తో అనుబంధించబడిన వారని తెలిపారు.

>>2



వరంగల్‌లో బుధవారం మోకాలిలోతు నీటిలో ప్రజల అవస్థలు



ఖమ్మం జిల్లా జన్నారం వాగులో కొట్టుకుపోతున్న లారీ



శ్రీశైలం-హైదరాబాద్ హైవేపై గండిపడిన దృశ్యం



హైదరాబాద్‌లో వర్షం

## జల దిగ్బంధంలో గ్రామాలు

>> స్వగ్రామం కొండా రెడ్డిపల్లికి వెళ్లే మార్గంలో గట్టుకాడి పల్లి వద్ద కల్వర్టులో ఉధృతంగా వర్షపు నీరు వెళ్లడం, ఉప్పునుంతల నుంచి సదగోడు వెళ్లే మార్గంలో ఉన్నా కల్వర్టులో భారీ ఎత్తున వరద ప్రభావం వెళ్లడంతో, ఉప్పునుంతల నుంచి మర్రిపల్లి, ఉప్పరి పల్లి మీదుగా వెళ్లే మార్గం గుండా ఉన్న కల్వర్టుల వద్ద వరద ఉధృతి అధికంగా ఉండడంతో పూర్తిగా ఉప్పునుంతలకు ఇతర ప్రాంతాలకు సత్సంబంధాలు లేకుండా పోయాయి. మండలంలోని మొల్గర వద్ద దుందుభి వాగు ఉదృతంగా ప్రవహిస్తుంది. అచ్చంపేట నియోజకవర్గంలోని ఉమామహేశ్వర క్షేత్రం వద్ద కొండ చరియలు విరిగిపడ్డాయి. మండలంలోని పూర్య నాయక్ తాండ వద్ద ప్రవహిస్తున్న చంద్రసాగర్ దిగువ ప్రాంతంలో మూగ జీవాలు వరదలో ఇరుక్కుపోయాయి. చింతపల్లి నుంచి హాజీపూర్ వెళ్లే మార్గంలో కంసానిపల్లి చీకటి వాగు ఉధృతి అధికంగా ఉండడంతో ఆ ప్రాంతం గుండా రాకపోకలు నిలిపివేశారు. ఉప్పునుంతల మండలంలోని లత్తిపూర్ గ్రామ శివారు ప్రాంతంలో డిండి ప్రాజెక్టుకు కుడివైపున ప్రవహించే డిండి అలుగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద నీరు శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిపై నిర్మించిన బ్రిడ్జిని తాకుతూ ప్రవహించడంతో స్థానిక ప్రజల్లో భయం నెలకొంది. దీంతో శ్రీశైలం హైదరాబాద్ రాకపోకలు నిలిచిపోయాయి. అదేవిధంగా బిజినేపల్లి మండలంలో వరి పంటకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. వంగూరు మండలంలో వర్షపు నీరు ఇండ్లలోకి చేరుకోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మహబూబ్‌నగర్ జిల్లాలోని దుందుభీ నదీ ఉధృతంగా ప్రవహిస్తున్నది. ప్రజలు వాగును దాటే ప్రయత్నాలు చేయొద్దని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.

## అజారుద్దీన్‌కు మంత్రి పదవి?

>> అజారుద్దీన్‌కు మాత్రమే ప్రస్తుతానికి మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించినట్టుగా తెలుస్తోంది. రాష్ట్రంలో ఎప్పుడు మంత్రివర్గ విస్తరణ జరిగినా, ముస్లిం మైనార్టీకి ఒక మంత్రి పదవి కేటాయించడం ఆనవాయితీగా వస్తుంది. కాంగ్రెస్ పార్టీ తరఫున చాలా మంది ముస్లిం మైనార్టీలు ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఎక్కడా విజయం సాధించలేదు. నాంపల్లి నుంచి ఫిరోజ్‌ఖాన్, నిజామాబాద్ అర్బన్ నుంచి షబ్బీర్ అలీ, జూబ్లీహిల్స్ నుంచి అజారుద్దీన్ వంటి వారు పోటీ చేసి ఓటమి చెందారు. దీంతో ఆ వర్గానికి కేబినెట్‌లో అవకాశం కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీకి సాధ్యపడలేదు. ముస్లిం మైనార్టీ వర్గానికి ఏదో విధంగా మంత్రివర్గంలో స్థానం కల్పించాలనే ఆలోచనతో కాంగ్రెస్ హైకమాండ్ ఉంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అజారుద్దీన్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజాగా జరుగుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు సైతం సిద్ధపడ్డారు. అయితే, ఆయనకు కాంగ్రెస్ అధిష్ఠానం ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టాలని నిర్ణయం తీసుకుంది. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌ను కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. అయితే, వీరిద్దరి నియామకానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఇంకా ఆమోదం తెలుపలేదు. ఎమ్మెల్సీ నియామక ప్రక్రియ పూర్తికాకపోయినప్పటికీ అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేసేందుకు ఏఐసీసీ ఆమోదం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మంత్రి వర్గ విస్తరణపై గత రెండ్రోజులుగా ఏఐసీసీలో విస్తృతంగా చర్చ జరిగినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. మొదటి సారి సీఎం రేవంత్ రెడ్డితో పాటు 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో ముగ్గురు మంత్రులుగా ప్రమాణం చేశారు. ప్రస్తుతం మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశం ఉండటంతో కాంగ్రెస్ అధిష్ఠానం ముస్లిం మైనారిటీకి అవకాశం కల్పించింది. ఒక వేళ గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అజారుద్దీన్‌కు అవకాశం దక్కని పక్షంలో త్వరలో కొన్ని శాసన మండలి స్థానాలు ఖాళీ కానున్నాయి. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత 6 నెలల లోపు అజారుద్దీన్‌ను ఎమ్మెల్సీని చేసే అవకాశముందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఇంకా మిగిలి ఉన్న రెండు మంత్రి పదవులు ఏయే సామాజిక వర్గానికి ఇవ్వాలనే దానిపై ఏఐసీసీ కసరత్తు కొనసాగుతున్నట్టు తెలుస్తోంది.

## కొనుగోలుపై త్వరలో నిర్ణయం

>> మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే అధికారులతో నష్టాన్ని అంచనావేసి రైతులకు సహకారం అందేలా చూడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తిచేశారు. పంట నష్టం జరిగిన రైతులను ఆదుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి మంత్రి పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో జిల్లాలో భారీగా పంట నష్టం జరిగిందని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిందనీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సూచనమేరకు కరీంనగర్ , సిద్దిపేట, హనుమకొండ జిల్లాలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలపై ఆయా జిల్లాల కలెక్టర్ లు పమేలా సత్పతి, హైమవతి , స్నేహ శబరిష్ లతో టెలికాన్ఫరెన్స్ లో మాట్లాడారు.

## నాలుగుకోట్ల కొలువుల సృష్టి

>> వర్కర్లు సేవలరంగంలో కొలువులు అందుకుంటున్నట్లు ప్రస్తావించింది. గ్రామీణప్రాంతాల్లో సేవలరంగానికి సంబంధించి కేవలం 10.5శాతం మంది మాత్రమే ఉంటున్నారని, అదే పట్టణప్రాంతాల్లో 60శాతం మంది ఉద్యోగాలు పొందగలుగుతున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల మహిళలు తక్కువ విలువలున్న కార్యక్రమాలకే పరిమితం అవుతున్నట్లు వెల్లడించారు. సేవలరంగంలో అత్యధికరాష్ట్రాల్లో రిటైల్‌ట్రేడ్, రవాణా రంగాలు ఎక్కువ ఉపాధిని అందిస్తున్నాయి. ఆధునిక సేవలపరంగా అంటే ఐటి, ఫైనాన్స్, ప్రొఫెషనల్ సేవలు వంటివి దక్షిణాది ద్రపాంతాలు, పశ్చిమ పట్టణ కేంద్రాల్లోను కొంతమేర వృద్ధిలో ఉన్నా కొద్దిమందికి మాత్రమే ఉపాధి లభిస్తోంది. మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు గణనీయంగా సేవలరంగ హబ్స్ ఏర్పాటుచేసాయి. బీహార్, మధ్యప్రదేశ్ ఇతర రాష్ట్రాలు తక్కువ విలువలున్న, సాంప్రదాయ బద్ధమైన విభాగాలకే పరిమితం అవుతున్నట్లు నీతి ఆయోగ్ గుర్తించింది. ఉత్పత్తి వృద్ధికంటే ఉద్యోగుల్లో ప్రమాణాలు, ప్రతిభ తక్కువగానే ఉందని అంచనావేసింది. గిగ్, స్వయం ఉపాధి, ఎంఎస్ఎంఇ వర్కర్లకు సామాజిక భద్రత పెరగాలని సూచించింది.

## 137 రైళ్లు రద్దు

>> సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలో పెద్ద సంఖ్యలో రైళ్లను పూర్తిగా రద్దు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. 137 రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఏడు గూడ్స్ రైళ్లను రద్దు చేయగా 29 రైళ్లను దారి మళ్లించింది, మరో 29 రైళ్లను రీడ్ షెడ్యూల్డ్ చేసింది. కోస్తా ప్రాంతాలైన విజయవాడ మీదుగా నడవాల్సిన చాలా రైళ్లను రద్దు చేశారు. సికింద్రాబాద్ డివిజన్ లోని తెలంగాణ ప్రాంతంలోనున్న మహబూబాబాద్ డోర్నకల్ ఖమ్మం సెక్షన్ల మధ్యభారీ వర్షాల కారణంగా కొన్ని స్టేషన్లలో నీరు నిలిచిపోవడం వల్ల పలు రైళ్లను రద్దు చేశామని ప్రకటించారు. మరికొన్ని రైళ్లను దారి మళ్లించడం, కొన్ని రైళ్లను రీ షెడ్యూల్ చేసినట్టు రైల్వేశాఖ వెల్లడించింది. సికింద్రాబాద్ టూ విజయవాడ వెళ్లే రూట్లలో పలు రైళ్లను రద్దు చేశారు. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే గరీబ్ రథ్ ట్రైన్‌ను రద్దు చేశారు. ఇంటర్‌సిటీ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు వరంగల్ రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయాయి. ఫలక్‌నూమా, ఈస్ట్‌కోస్ట్, గోదావరి, విశాఖ, నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని మహబూబాబాద్ జిల్లా గుండ్రాతిమడుగులో కోణార్క్ ఎక్స్‌ప్రెస్, డోర్నకల్ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయాయి. ఏపీలోని కృష్ణా జిల్లా కొండపల్లిలో సాయినగర్ షిర్డి ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయింది. రాబోవు పరిస్థితులను బట్టి జోన్ మీదుగా నడపాల్సిన రైలు సర్వీసులు మళ్లీ మారవచ్చని, పరిస్థితికి అనుగుణంగా వాటిని రద్దు చేయడం, దారి మళ్లించవచ్చు అన్నారు. రీషెడ్యూల్ చేయవచ్చు లేదా పాక్షికంగా రద్దు చేయవచ్చని పేర్కొంది. పలు రైళ్లు రద్దు కావడంతో రైల్వే స్టేషన్లలోనే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రధాన రైల్వే స్టేషన్లలో హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేసినట్ల రైల్వే అధికారులు వెల్లడించారు. పూర్తి వివరాల కోసం రైల్వే అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

### వారం - వర్జ్యం

30-10-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
అష్టమి ఉ.10.03
శ్రవణ సా.6.28
వర్జ్యం : రా.10.31-12.05
దు.ఉ.9.56-10.42, 2) మ.2.34-3.20
రాహుకాలం - మ.1.30-3.00

### వార్తాఫలం

**మేషం :** సంఘంలో పలుకూడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.

**వృషభం:** చేపట్టిన కార్యక్రమాలలో స్వల్ప ఆటంకాలు కలిగినా ఎట్టకేలకు పూర్తి చేస్తారు.

**మిథునం:** పొదుపు పథకాలు అవలంభిస్తారు. ఓర్పు, నేర్పు, నైపుణ్యం అవసరమవుతాయి.

**కర్కాటకం :** మీ తొందరపాటుతనం వల్ల కాంట్రాక్టులు చేజారిపోయే పరిస్థితి ఏర్పడుతుంది.

**సింహం:** ముఖ్యమైన వ్యవహారాలలో ఎదురైన ఆటంకాలు తొలుగుతాయి.

**కన్య :** దూర ప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**తుల :** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. స్పెక్యులేషన్ లాభిస్తుంది.

**వృశ్చికం:** దైవ సంబంధ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**ధనుస్సు:** ఒకానొక బాధ్యతను పూర్తి చేసి బరువు దించుకుంటారు.

**మకరం:** అప్పు చేయడం, అప్పు ఇవ్వడం రెండు చేయకండి. ఇంటా బయటా ప్రోత్సాహం.

**కుంభం:** కార్యాలయంలో పనిభారం పెరిగినప్పటికి సమర్ధతతో నిర్వహిస్తారు.

**మీనం :** ఆర్థికంగా లాభ పడకపోయినా మీ శ్రమను అధికారులు గుర్తిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 'మొంథా' గండం

>> వరంగల్, మహబూబాబాద్, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తాజాగా రెడ్ అలర్ట్ జారీ చేసింది. వరంగల్ నగరంలో భారీ వర్షం పడటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. హన్మకొండ పూర్తిగా జలదిగ్బంధం అయింది. స్థానికంగా అపార్ట్‌మెంట్‌లలో చిక్కుకున్న వారిని రిస్క్ ఆపరేషన్ ద్వారా ఎస్టీఆర్ఎఫ్ బృందాలు బయటకు తరలించారు, ఆదిలాబాద్, నిర్మల్, సూర్యాపేట, జగిత్యాల, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. కుండపోత వర్షాల కారణంగా పలు ప్రాంతాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్లు తెగిపోవడం, వంతెనలపై నుంచి నీరు పోవడం, రోడ్లపై నీరు నిలవడం వంటి కారణాలతో పలు రహదారులు తాత్కాలికంగా మూతబడ్డాయి. భారీ వర్షాలకు వరంగల్-ఖమ్మం ప్రధాన రహదారిపై భారీగా వరద నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నా రు. ఆ రహదారిని పోలీసులు తాత్కాలికంగా మూసివేశారు. వరంగల్ నగరంలో పలు కాలనీలు నీట మునిగాయి. వరంగల్ బస్టాండ్ చెరువును తలపిస్తోంది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల మధ్య వాల్యాతండా సమీపంలోని వంతెనకు ఆనుకుని ఆకేరు వాగు ప్రవహిస్తోంది. దీంతో సాయంత్రం నుంచి రెండు జిల్లాల మధ్య రాకపోకలను నిలిపివేశారు. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం వీరిశెట్టిపల్లి గ్రామ సమీపంలోని కాగ్నా నదిలో ఒక వ్యక్తి కొట్టుకు వచ్చాడు. యాలాల మండలం ఆగనూరు గ్రామానికి చెందిన నర్సింహులు ప్రమాదవశాత్తూ నదీ ప్రవాహంలో చిక్కుకున్నాడు. అతడు నదిలో కొట్టుకురావడాన్ని గమనించిన వీరిశెట్టిపల్లి యువకులు హరీశ్, శ్రవణ్ కుమార్, శంకర్ అతనిని రక్షించారు. శ్రవణ్, హరీశ్ ఈదుకుంటూ వెళ్లి నర్సింహులు కాపాడి ముందుకు తీసుకురాగా, అనంతరం శంకర్ తాడు విసరడంతో దాని సాయంతో అందరూ ఒడ్డుకు చేరుకున్నారు. మొంథా తుఫాను తెలంగాణపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రాష్ట్రవ్యాప్తంగా గత అర్ధరాత్రి నుంచి భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో గురువారం పలు జిల్లాల్లోని విద్యాసంస్థలకు అధికారులు సెలవులు ప్రకటించారు. ములుగు, భూపాలపల్లి, హన్మకొండ, వరంగల్, యాదాద్రి భువనగిరి, సిద్ధిపేట జిల్లాలోని స్కూళ్లకు సెలవు ప్రకటించారు. మరోవైపు, కరీంనగర్, నల్గొండ, ఖమ్మం, హైదరాబాద్ లలో కూడా కుండపోత వాన పడుతుండటంతో ఆయా జిల్లాల్లో కూడా సెలవు ప్రకటించాలని స్టూడెంట్స్, పేరెంట్స్ కోరుతున్నారు. ఇక రానున్న 24 గంటల్లో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఇదిలా ఉండగా లోతట్టు ప్రాంతాలను తరలించేందుకు పలు జిల్లాల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి, కాగా, వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల్లోని కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించినట్లు సమాచారం. నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని, నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సీఎం సూచించారు. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని అన్నారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లో లెవల్ బ్రిడ్జిలు, కాజ్ వేలపై నుంచి రాకపోకలు పూర్తిగా నిషేధించాలని తెలిపారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి తెలిపారు. వర్షం నీరు నిల్వ ఉండి దోమలు, ఇతర క్రిమి కీటకాలు విజృంభించి అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. వైద్యారోగ్య శాఖ తగినంత మందులు అందుబాటులో ఉంచుకోవాలని, అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రాణ, ఆస్తి, పశు నష్టం లేకండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం సూచించారు. రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, వైద్యారోగ్య, పోలీసు, అగ్నిమాపక శాఖలు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సమన్వయంతో సాగాలని సీఎం తెలిపారు. హైదరాబాద్‌లో ప్రజల నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులపై జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్టీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది వెంటనే స్పందించాలని సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశించినట్లు సమాచార.

## అజారుద్దీన్‌కు మంత్రి పదవిపై బిజెపి అభ్యంతరం!

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు29:** అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఖాయమని జరుగుతున్న ప్రచారంపై రాష్ట్ర బిజెపి అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి క్లారిటీ వచ్చాక ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసేందుకు సిద్దమైనట్లు సమాచారం. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ముందు రాజకీయ లబ్ది పొందేందుకు కాంగ్రెస్ ఈ నిర్ణయం తీసుకుందని బిజెపి వర్గాలు ఆరోపిస్తున్నాయి.

## జిసిసిలకు రాజధాని హైదరాబాద్

>> కేవలం ఆహారం గురించి మాత్రమే కాదు అది పరిమాణం, సామర్థ్యం, అనుసంధానమైన ప్రపంచం అనే భావనకు ప్రతీకగా నిలిచింది అన్నారు. దశాబ్దాల క్రమంలో ఆ బంగారు చిహ్నాలు ప్రపంచవ్యాప్తంగా ప్రతిరోజూ కోట్లాది మందికి సేవలు అందించే విధంగా ఆవిష్కరణ, నిర్వహణ కలయికకు చిహ్నామయ్యాయి అని డిప్యూటీ సీఎం వివరించారు. మార్క్ నాప్లర్ రాసిన బూమ్ లైక్ దట్ పాటలో మ్యాక్‌డొనాల్డ్స్ వ్యవస్థాపకుడు రే క్రాక్ కథకు ప్రేరణగా చెప్పినట్లుగా, మ్యాక్‌డొనాల్డ్స్ కథ అనేది ధైర్యవంతమైన ఆలోచనలు ఒకేసారి ఒక పల్లెలో ప్రపంచమంతా వ్యాపించిన గాథ అన్నారు. ఒక రకంగా చెప్పాలంటే, హైదరాబాద్ కూడా అలాంటి ప్రయాణమే చేసింది అన్నారు. మినార్లు, సరస్సులతో ఉన్న చారిత్రక నగరం నుండి, డేటా, డిజైన్, నిర్ణయాల గ్లోబల్ హబ్‌గా ఎదిగింది అన్నారు. స్పష్టమైన లక్ష్యం ఉంటే, కేవలం ఒక నగరానికో, దేశానికో కాదు, ప్రపంచానికి సేవ చేయవచ్చు అని హైదరాబాదు నగరం, మాక్ డోనాల్డ్ రెండు నిరూపించాయి అన్నారు. భారతదేశ అభివృద్ధి క్రమాన్ని పరిశీలిస్తే పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ దూరదృష్టిని మరవలేము అన్నారు. ఆయన ఆధునిక భారతదేశానికి పునాదులు వేశారు, వారి దూరదృష్టి పెట్టుబడి వల్లే హైదరాబాద్‌కు స్థిరమైన బలం వచ్చింది చేకూరింది అన్నారు. సిసిఎంబీ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, బిహెచ్ఈఎల్, ఇసిఐఎల్, ఇతర పబ్లిక్ సెక్టర్ సంస్థలు అన్నీ కూడా నెహ్రూ స్ఫూర్తి నుండి పుట్టినవే అని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. వారి తర్వాత ప్రధానిగా పనిచేసి పీవీ నరసింహారావు, వారి క్యాబినెట్లో డాక్టర్ మన్మోహన్ సింగ్, ఆర్థిక మంత్రిగా నెహ్రూ దూరదృష్టిని మరింత బలంగా తీసుకెళ్లారు అన్నారు. భారతదేశాన్ని ప్రపంచంతో ఆత్మవిశ్వాసంగా, జాగ్రత్తగా, కరుణతో అనుసంధానించారు అని వివరించారు. ఆర్థిక సంస్కరణ అంటే కేవలం మార్కెట్ గురించి కాదు, గౌరవంతో కూడిన అవకాశాలను సృష్టించడం అని తెలిపారు. ఆలోచనలో భాగంగానే సమానత్వంతో కూడిన వృద్ధి, సమిష్టి అభివృద్ధి అనే అంశాలు ఈరోజు తెలంగాణ ప్రభుత్వానికి మార్గదర్శక సూత్రాలు అని తెలిపారు. మ్యాక్‌డొనాల్డ్స్ గ్లోబల్ ఆఫీస్ ఈ నూతన కేంద్రం కూడా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మిస్తున్న కొత్త పరిణామంలో కీలక అధ్యాయం అని అభివర్ణించారు. గత రెండు దశాబ్దాల్లో హైదరాబాద్ ఇటువంటి సెంటర్లకు రాజధానిగా మారింది, వందలాది గ్లోబల్ కెపబిలిటీ హబ్‌లు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి అని వివరించారు. ఇవి అన్నీ మన ప్రతిభపై విశ్వాసం, మన పాలనపై నమ్మకం, మన భవిష్యత్తుపై ఆశకు ప్రతీకలు అన్నారు. ఇవి కేవలం బ్యాక్ ఆఫీసులు కావు, ఇవి ప్రపంచ ఆవిష్కరణకు నాడులు అన్నారు. హైదరాబాదులోని జీసీసీ సెంటర్లు చికాగోను చార్మినార్‌తో, బోస్టన్‌ను బంజారాహిల్స్‌తో, లండన్‌ను లింగంపల్లితో కలుపుతున్నాయి, హైదరాబాద్‌ను ప్రపంచ కమాండ్ సెంటర్‌గా మార్చుతున్నాయి, అక్కడ మార్కెట్లను, అనుభవాలను తీర్చిదిద్దే నిర్ణయాలు తీసుకోబడుతున్నాయన్నారు. మ్యాక్‌డొనాల్డ్స్ ఇక నుంచీ ఒక వ్యాపార సంస్థకన్నా ఎక్కువ. అది ఆశ, మానవ అనుభూతి, ఒకే భోజనంపై కలిసే మనుషుల బంధానికి ప్రతీక అని అభివర్ణించారు. ఈ కొత్త గ్లోబల్ ఆఫీస్ ద్వారా ఆ స్ఫూర్తి కొత్త రూపంలో వెలుగులోకి వస్తోంది, హైదరాబాద్ ఇంజినీర్లు, విశ్లేషకులు, ఆవిష్కర్తల చేతుల్లో రూపుదిద్దుకుంటోంది. మ్యాక్‌డొనాల్డ్స్ తన సప్లై చైన్స్, సస్టైనబిలిటీ, డిజిటల్ అనుభవాలను పునర్‌నిర్మించినట్లే, హైదరాబాద్ కూడా టెక్నాలజీ, మానవతా విలువలు కలిసిన నగరంగా మళ్లీ తనను పునర్నిర్వచిస్తోంది అన్నారు. మ్యాక్‌డొనాల్డ్స్ తెలంగాణ యువత కోసం నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలపై భాగస్వామి కాబోతుందన్న కాబోతుంది అన్న విషయం తెలంగాణ ప్రజానీకానికి ఆనందంగా ఉంది అన్నారు. దాతృత్వ కార్యక్రమాలు ఆలోచన తెలంగాణ ప్రభుత్వ తత్వశాస్త్రాన్ని ప్రతిబింబిస్తుంది అన్నారు. అభివృద్ధికి మానవీయ కోణం ఉండాలి అని తెలిపారు. ఈ కొత్త మ్యాక్‌డొనాల్డ్స్ సెంటర్ కేవలం హైదరాబాద్ ఆకాశహర్మ్యాలలో మరో భవనం కాదు. ఇది భారత విశ్వాసానికి, తెలంగాణ ప్రతిభకు, గ్లోబల్ సంస్థలు, స్థానిక ప్రతిభ కలయికతో సృష్టించగల అద్భుతానికి ప్రతీక అని వివరించారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణలో ఉన్న అనువైన ఎకో సిస్టం, ఇన్ఫ్రాస్ట్రక్చర్, టాలెంట్ పూల్, పటిష్ఠమైన ప్రభుత్వం, సమర్థవంతమైన నాయకత్వంపై ఉన్న నమ్మకం, విశ్వాసానికి గొప్ప నిదర్శనం అని చెప్పారు. మా ప్రభుత్వ పనితీరుకు సజీవ సాక్ష్యం. మెక్ డొనాల్డ్స్ అంటే గ్లోబలైజేషన్‌కు నిలువెత్తు నిదర్శనం అని చెప్పారు. ముందు చూపుతో 1991లో అప్పటి ప్రధాని పీవీ నర్సింహారావు అమలు చేసిన ఎల్పీజీ సంస్కరణల వల్ల "మెక్ డొనాల్డ్స్" లాంటి ఎన్నో అంతర్జాతీయ కంపెనీలు మన దేశంలోకి అడుగు పెట్టాయని చెప్పారు. ఇక్కడ కార్యకలాపాలు ప్రారంభించి మన ఆర్థిక వ్యవస్థలో భాగస్వామ్యమయ్యాయని పేర్కొన్నారు. హైదరాబాద్ "గ్లోబల్ జీసీసీ" హబ్ యావత్తు ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోందన్నారు. ఇక్కడ కేవలం టెక్నాలజీకి సంబంధించిన జీసీసీలు మాత్రమే ఏర్పాటు కావడం లేదు. అన్ని రంగాలకు చెందిన జీసీసీలను హైదరాబాద్ లో ఏర్పాటు చేసేందుకు అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ సంస్థలు "తెలంగాణ"వైపు చూస్తున్నాయని పేర్కొన్నారు. హాస్పిటాలిటీ రంగ దిగ్గజ సంస్థ "మారియట్" తన మొదటి జీసీసీని ప్రారంభించేందుకు హైదరాబాద్‌ను ఎంచుకుందని, "రైజింగ్ తెలంగాణ" లక్ష్య సాధనకు మా ప్రభుత్వం మెక్ డొనాల్డ్స్ లాంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థలతో కలిసి పని చేసేందుకు ప్రాధాన్యమిస్తోందన్నారు.

## రానీయొద్దు

>> ప్రభావం ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్, ఉమ్మడి నల్గొండ జిల్లాల్లో అధికంగా ఉండడం.. హైదరాబాద్ సహా ఇతర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తుండడంతో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జంక్షన్‌లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్, గుండ్రాతిమడుగు స్టేషన్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లు నిలిచిపోవడం.. పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు దారి మళ్లించిన నేపథ్యంలో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. మొంథా తుపాన్ ప్రభావం అధికంగా ఉన్న జిల్లాల్లో ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు సమన్వయం చేసుకోవాలని.. జిల్లా కలెక్టర్లు ఆయా బృందాలకు తగిన మార్గదర్శకత్వం వహించాలని సీఎం సూచించారు. వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల్లోని కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని సీఎం సూచించారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లోలెవల్ బ్రిడ్జిలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలు పూర్తిగా నిషేధించాలన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలని సీఎం ఆదేశించారు. తుపాను ప్రభావంతో వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభించి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున నగర, పురపాలక, గ్రామ పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని సీఎం సూచించారు. వైద్యారోగ్య శాఖ తగినంత మందులు అందుబాటులో ఉంచుకోవాలని, అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశు నష్టం చోటుచేసుకోకుండా జాగ్రత్తలు వహించాలని సీఎం సూచించారు. రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, వైద్యారోగ్య, పోలీస్, అగ్నిమాపక శాఖలు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సమన్వయంతో సాగాలని సీఎం సూచించారు. హైదరాబాద్ నగరంలో ప్రజల నుంచి వచ్చే వినతులకు జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే స్పందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## ట్రిబ్యునల్ విచారణ వాయిదా

**హైదరాబాద్, అక్టోబరు 29,ప్రభాతవార్త:** కృష్ణా నది వివాదాల పరిష్కార ట్రిబ్యునల్ విచారణ నవంబర్ 25 నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తామని పేర్కొంటూ జస్టిస్ బచావత్ వాయిదా వేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీ పంచాయితీ నడుస్తున్నది. గత నెల తెలంగాణ సహజన్యాయ సూత్రాలకు అనుగుణంగా 900 టిఎంసి నీటిని కేటాయించాలని కోరుతూ వాదన చేసింది. అయితే ఢిల్లీలో బుధవారం కృష్ణా ట్రైబ్యునల్లో ఏపీ ప్రభుత్వం వాదనలు వినిపించింది. కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి ట్రిబ్యునల్ ఏర్పాటు చేయడాన్ని తప్పుబట్టింది. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ మధ్య నీటి పంపిణీకి ట్రిబ్యునల్ ఏర్పాటు చట్ట విరుద్ధమంటూ వాదనలు వినిపించింది. జలాల పంపిణీకిసంబంధించి సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్ పెండింగ్లో ఉందని గుర్తు చేసింది. బచావత్ ట్రిబ్యునల్ నుంచి ఇప్పటి వరకూ పరిణామాలను ప్రభుత్వం వివరించింది. దీంతో తదుపరి విచారణను నవంబర్ 25, 26, 27 తేదీలకు వాయిదా వేసింది.

## నక్సల్స్ లొంగుబాటు

>> సుకుమా జిల్లా పోలీస్ అధికారుల ఎదుట 21 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా లొంగిపోయారు. పోలీసుల కథనం ప్రకారం, 2025 సంవత్సరంలో ఇప్పటివరకు, 461 మంది మావోయిస్టులు ప్రధాన స్రవంతిలోకి తిరిగి వచ్చారని, 138 మంది మావోయిస్టులు మరణించారని మరియు 485 మందిని అరెస్టు అయినట్లు ఘనాంకాలు తెలుపుతున్నాయి.

## రాఫెల్‌లో రాష్ట్రపతి ముర్ము

>> ఫొటో దిగారు. గగనవిహారం అనంతరం కొద్దిసేపటి తర్వాత ముర్ము యథాస్థానానికి క్షేమంగా చేరుకున్నారు. రఫేల్‌లో గగనవిహారం మరపురాని అనుభవమని ముర్ము తెలిపారు. శక్తివంతమైన రఫేల్‌లో ప్రయాణించడం, దేశ రక్షణ సామర్థ్యాలపై నూతన గర్వాన్ని నింపిందని ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ విన్యాసాన్ని విజయవంతంగా నిర్వహించిన భారత వైమానిక దళం బృందాన్ని రాష్ట్రపతి అభినందించారు. ఈ ఏడాది పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌పై భారత్ జరిపిన దాడుల్లో(ఆపరేషన్ సిందూర్) రఫేల్ జెట్లు కీలక పాత్ర పోషించాయి. ఈ జెట్‌లు అత్యంత కచ్చితత్వంతో పాక్‌లోని ఉగ్రస్థావరాలను మట్టికరిపించాయి.

## సుప్రీంకోర్టు ఆదేశాలతో బాబ్లీ గేట్లు మూసివేత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు29:** గోదావరి నదిపై మహారాష్ట్రలో నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఇరు రాష్ట్రాలకు చెందిన ఇరిగేషన్ అధికారులు మూసివేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేశాయి. గోదావరి నదిలోకి ఎగువ భారీ ప్రవాహం కొనసాగుతుండడంతో మూసివేసిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను కొంతమేర తెరిచి ఉంచినట్లుగా ఇరిగేషన్ అధికారులు పేర్కొన్నారు. తిరిగి వేసవికాలం ప్రారంభంలో తాగునీటి అవసరాల కోసం బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తనున్నారు.

### ఎఐతో ఫొటోల మార్ఫింగ్‌పై

## సైబర్ క్రైం పోలీసులకు చిరంజీవి ఫిర్యాదు

**హైదరాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త:** మెగా స్టార్ చిరంజీవి మరోసారి సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. ఏఐ టెక్నాలజీతో తన ఫొటోల ను కొందరు వ్యక్తులు, కొన్ని వెబ్‌సైట్లు ఇష్టానుసారం మార్ఫింగ్ చేసి అభ్యంతకరంగా వాడుతుండడంపై ఇప్పటికే హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించిన చిరంజీవి ఈ విషయంలో తనకు అనుకూలంగా ఉత్తర్వులు పొందడం తెలిసిందే. అయినప్పటికీ తన ఫొటోలను కొందరు అభ్యంతకరంగా వాడు తుండడంపై బుధవారం సిటీ సైబర్ క్రైం పోలీసులకు మరోసారి ఫిర్యాదు చేశారు. తాజా ఫిర్యాదులో దయా చౌదరి అనే వ్యక్తి తన వెబ్‌సైట్‌లో ఈ ఫొటోలను మార్ఫింగ్ చేసినట్లు,తన గొంతును కూడా మెమెక్రి ద్వారా వాడినట్లు చిరంజీవి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేబట్టారు.

## మొంథా తుఫాన్‌లో చెట్టు కూలి వ్యక్తి మృతి

**మద్దిరాల, అక్టోబరు 29 ప్రభాతవార్త:** మొంథా తుఫాన్ ప్రభావంతో చెట్టు కూలి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చందుపట్ల గ్రామంలో చోటుచేసుకుంది.గ్రామస్తులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహబూబాద్‌జిల్లా మరిపెడ మండలం తానంచర్ల గ్రామానికి చెందిన కోట లక్ష్మీనారాయణ(45) మద్దిరాల మండల కేంద్రంలో వ్యవసాయ పనుల నిమిత్తం బుధవారం తానంచర్ల నుండి మద్దిరాలకు వెళ్తున్నక్రమంలో చందుపట్ల గ్రామం కొత్త స్కూల్ వద్ద వర్షం వస్తుండడంతో రోడ్ సైడ్ ఉన్న చెట్టు కూలి బైక్ పై వెళుతున్న వ్యక్తిపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ వీరన్న పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ఏరియా హాస్పిటల్‌కు డెడ్ బాడీని తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## సింగరేణిలో నిలిచిపోయిన బొగ్గు ఉత్పత్తి

### 28వేల టన్నుల ఉత్పత్తికి, లక్షా 80 క్యూమీ ఓబికి అంతరాయం

**సత్తుపల్లి, అక్టోబరు 29, ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన తుఫాన్ ప్రభావం వల్ల గత రాత్రి నుంచి ఎడతెరప లేకుండా కురుస్తున్న వర్షం ప్రభావంతో సత్తుపల్లి సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి, ఓవర్ బర్డెన్(ఓబి)కి తీవ్ర అంతరాయం ఏర్పడింది. జలగం వెంగళరావు ఓపెన్ కాస్ట్, కిస్తారం, ఓపెన్ కాస్ట్‌గనులలో మంగళవారం రాత్రి కురిసిన వర్షం ప్రభావం మూలంగా అధికంగా వర్షపు నీరు గనుల్లోకి చేరటంతో రోజువారి జేవిఆర్‌ఓసీలో తీసే 20వేల టన్నులు బొగ్గు, లక్షా ఇరవై వేల క్యూబిక్ మీటర్ల ఓబికి, అలాగే కిష్టారం ఓసీలో రోజువారి తీసే 8,000 టన్నుల బొగ్గు, 60 వేల క్యూబిక్ మీటర్ల ఓబికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. పై రెండు ఓసిల్లో తుఫాను ప్రభావం వలన 28 వేల టన్నుల బొగ్గుకు, లక్ష, 80వేల క్యూబెక్ మీటర్ల ఓవర్ బర్డెన్ కు బ్రేక్ పడినట్లు అధికారులు తెలిపారు. ఓసిల్లో వర్షపు నీరు చేరడంతో ప్రతిరోజు బొగ్గు రవాణాచేసే వాహనాలు సైతం ఎక్కడకక్కడ నిలిచిపోయాయి. గనుల్లోకి చేరిన నీరును పైపులుద్వారా నీటిని బయటకు పంపేందుకు ప్రాజెక్టు అధికారులు ఎన్వీఆర్ ప్రహ్లాదు. ఎంవీ నరసింహారావులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## నిమ్మ వాగులో కొట్టుకుపోయిన డిసిఎం: డ్రైవర్ గల్లంతు

### కళ్ల ముందే కొట్టుకొని పోతున్నా కాపాడలేని హృదయ విదారకం

### మృతుడు అశ్వారావుపేటకు చెందిన మురళిగా గుర్తింపు

### మొంథా తుఫాన్ విషాదం

**కొణిజర్ల అక్టోబరు 29 ప్రభాతవార్త :**మొంథా తుఫాను ప్రభావం కొణిజర్ల మండలంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఓ లారీ డ్రైవర్ నిర్లక్ష్యమే తన ప్రాణం పోయేలా చేసుకోవడమే కాక, అది చూసిన ప్రజలు సైతం కాపాడలేని హృదయ విధారక ఘటన కొణిజర్ల మండలంతత, అంజనాపురం గ్రామం వద్ద నిమ్మ వాగు వరద ఉదృతికి ఓ డీసీఎం వ్యాన్ లారీతో సహా డ్రైవర్ గల్లంతైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం జూలూరుపాడు గ్రామంలో పత్తిలోడు కిరాయి నిమిత్తం అశ్వారావుపేటకు చెందిన ఓ డీసీఎం వ్యాన్ లారీ, డ్రైవర్ బుధవారం ఉదయం బయలుదేరి వైరా, పల్లిపాడు ఏన్కూర్ రహదారి రోడ్డు మార్గం మీదుగా వస్తున్నా క్రమంలో మార్గమధ్యంలో అంజనాపురం గ్రామ సమీపంలో గల నిమ్మవాగు మొంథా తుఫాన్ ప్రభావంతో గతరాత్రి నుండి కురుస్తున్న వర్షానికి ఉధృతంగా ప్రవహిస్తూ ఉండడంతో పల్లిపాడు-ఏన్కూర్ హైవే రహదారి మధ్య రాకపోకలు నిలిచిపోయినాయి. కాగా అది గమనించిన సదరు డీసీఎం వ్యాన్ లారీడ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించి వాగు ప్రవాహంగుండా దాటించే ప్రయత్నం చేయగా కొద్ది దూరం వెళ్లే సరికి వరద ఉదృతికి కొంత భాగం నీటిలోకి మునగ సాగింది. అయినా కూడా వెనక్కి పోనిద్దామనే ప్రయత్నం చేస్తుండగా, గమనించిన గ్రామస్తులు లారీ వదిలేసి బయటికిరమ్మని కేకలు వేసి వారించినా రాకపోవడతో అందరూ చూస్తుండగానే ఒక్కసారిగా డీసీఎం వ్యాన్‌తో సహా డ్రైవర్ కొట్టుకొనిపోయి గల్లంతయ్యాడు. లారీ డ్రైవర్ అశ్వారావుపేటకు చెందిన మురళి(30)గా గుర్తించడం జరిగింది.పోలీసులు గాలింపు చెర్యలు చేపట్టి కొనసాగిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## సంక్షేమంలో ఓవర్సీ స్కారల్‌షిప్‌కు రూ.303 కోట్లు

### డిప్యూటీ సిఎం విక్రమార్క

**హైదరాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త:** ఓవర్సీ స్కాలర్షిప్ నిమిత్తం పెండింగ్ లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసి, మైనారిటీ విద్యార్థుల బకాయిలు 303 కోట్ల రూపాయలు విడుదల చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో 2022 నుంచి పెండింగ్ లో ఉన్న స్కాలర్‌షిప్ మొత్తాన్ని ఒకేసారి క్లియర్ చేయాలన్నారు. ఆర్థిక స్తోమత లేకపోయినప్పటికీ విదేశాల్లో ఉన్నత చదువులు చదివి, ఉద్యోగాలు సాధించి ఆర్థికంగా ఉన్నత స్థితికి ఎదగాలని ఆలోచనతో వేలాది మంది పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పై విదేశాలకు వెళ్లారని చెప్పారు. గత ప్రభుత్వ కాలం నుంచి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ సొమ్ము అందకపోవడంతో విదేశాల్లో ఉన్న విద్యార్థులు, రాష్ట్రంలో ఉన్న తల్లిదండ్రులు మానసికంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఓవైపు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ అందక పోగా, మరోవైపు అమెరికా, యూకే వంటి దేశంలో కొత్త కొత్త ఆంక్షలతో విద్యార్థులపై మానసిక ఒత్తిడి తీవ్రమైందని వెల్లడించారు. ఆయా దేశాల్లో గతంలో మాదిరిగా చదువుకుంటూ ఉద్యోగాలు చేసుకునే పరిస్థితి లేదని, అక్కడ రోజురోజుకు ఆర్థిక భారం పెరిగిపోతుందని వివరించారు. దీనికి తగినట్లుగా విద్య నిమిత్తం బ్యాంకుల్లో తీసుకున్న రుణ భారం పెరుగుతోందని వీటన్నింటి దృష్ట్యా ఓవర్సీస్ స్కాలర్‌షిప్ మొత్తాన్ని ఒకేసారి క్లియర్ చేయాలని ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో కష్టకాలంలో ప్రతి విద్యార్థి సుమారు 20 లక్షల ఆర్థిక సహాయం అందించడంతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోనున్నారు.

# అన్నదాత ఆశలు ఆర్పిన వర్షం

### కల్లెడ, బీమదేవరపల్లిలో 37 సెం.మి అత్యధిక వర్షం

### జనగామ జిల్లా సగటు వర్షపాతంలో 16సెం.మి టాప్



**హైదరాబాద్, అక్టోబరు 29,ప్రభాతవార్త:** ఆరుగాలం కష్టపడి పండించిన పంట వర్షార్పణమైంది. మొంథా తుఫాను ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా కురిసిన భారీవర్షాలు అన్నదాద ఆశలు ఆర్పేశాయి. మొంథా తుఫాను దారి మార్చుకొని ఉత్తర వాయువ్య దిశగా కదిలి బుధవారం మధ్యాహ్నం భద్రాచలంకు 53కిమిటర్ల ధూరంలో ఖమ్మంకు 113 కి.మి దూరంలో కేంద్రీకృతం కావడంతో ఉమ్మడివరంగల్,నల్లగొండ, కరీంనగర్ జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసాయి. వరంగల్, జనగామా, హనుకొండ,సిద్దిపేట, మహబూబాబాద్, యాదాద్రీభువనగిరి, కరీంనగర్, సూర్యాపేట రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలో అత్యధిక అతిభారీ వర్షాలు కురవడంతో అన్ని పంటలకు తీవ్ర నష్టం కలిగించింది. బుధావారం రాత్రి ఏడున్నరవరకు తెలంగాణలో నమోదైన వర్షాపాత గణాంకాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ,హనుమకొండ మండలం భీమదేవరపల్లిలో 37.5 సెం.మి అత్యధిక వర్షాపాతం నమోదైంది. నెక్కొండ రెడ్లవాడలో 32.8సెం.మి,హనుమకొండ జిల్లా సంగెం మండలం కాపులకనపర్తిలో 31.03 సెం.మి, వర్ధనపేట మండల కేంద్రంలో 29.6.2 సెం.మి,వరంగల్‌జిల్లా సంగెం మం దంకేంద్రంలో 25.18సెం.మి,జనగామా జిల్లా పాలకుర్తి మండలం గూడురులో 26.06సెం.మి,వరంగల్ జిల్లా ఉర్సులో 30సెం.మి, నెక్కొండ మండల కేంద్రంలో 21.6సెం.మి, సిద్దపేట జిల్లా హుస్నాబాద్‌లో 21.3,కరీంనగర్‌జిల్లా హుజురాబాద్ మండలం బొంపల్లిలో 21.15సెం.మి,సిద్దపేట మండలం అక్కన్నపేట మండలం కట్కూర్ 20.7 సెం.మి వర్షం కురిసింది. రాత్రి ఏడుగంటల వరకు అత్యధిక అతి భారీ వర్షం తెలంగాణలో 26కేంద్రాలలో నమోదు కాగా, 18 కేంద్రాలలో అతిభారీ వర్షం నమోదైంది. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలో 21.6సెం.మి, వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలకేంద్రం, వరంగల్‌పైడిపల్లి ఎఆర్ఎస్, రాయపర్తిమండలకేంద్రం, గీసుకొండ మండలకేంద్రం జనగామా జిల్లా పాలకుర్తి మండల కేంద్రం చిల్పూరు మండలం మల్కపురం,హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలకేంద్రం జనగామా జిల్లా నర్మెట్టలో 21.6సెం.మి వర్షం కురిసింది. హనుమకొండ హసన్‌పర్తి చింతగట్టు,గీసుకొండ మండలం గొర్రెకుంటలో 25.5సెం.మివర్షం కురిసింది,పర్వతగిరి మండలం ఎనగల్,దామెర, జఫర్‌గడ్ వరంగల్ కాశిబుగ్గ, సిద్దిపేట జిల్లా మద్దురు మండలం రేబర్తి 24.3సెం.మి వర్షం కురిసింది. యాదాద్రి జిల్లా ఆత్మకూర్ ఎం మండలంలో, మోతుకూరు బిజాపూర్‌లో 17.05సెంమి వర్షం కురిసింది. ఐనవోలు కొండపర్తిలో 18సెం.మి, అక్కన్నపేట మండలం గండిపల్లిలో 21సెం.మివర్షం కురిసింది. మడికొండలో 20సెం.మి, జనగామా జిల్లా సగటు వర్షాపాతం 14.2గా ప్రథమస్థానంలో ఉండగా వరంగల్ 13.2జిల్లా సగటు వర్షంతో రెండో స్థానం ఉంది. మొత్తం 18 జిల్లాలో వర్షం రైతులకు కడగండ్లు మిగిల్చింది. పత్తి పంట పూర్తిగా ధ్వంసమైంది. వరి నేలవారింది.మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణలో ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కరీంనగర్, సిద్దిపేట, వరంగల్, జనగామ, యాదాద్రి భువనగిరి, హనుమకొండ, మహబూబాబాద్, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, పెద్దపల్లి జిల్లాలకు వరద ముప్పు ఉన్నట్లు పేర్కొంది. వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాలకు వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్, సిద్దిపేట, జనగామ, యాదాద్రి భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, సూర్యాపేట జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. కుమురం భీం ఆసిఫాబాద్. నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, రంగారెడ్డి, నల్గొండ, ములుగు. భద్రాద్రి కొత్త గూడెం, ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

# గ్రీన్ ఎనర్జీ, గ్లోబల్ సంస్థగా సింగరేణి

### విజిలెన్స్ వారోత్సవాల్లో సిఎండి బలరామ్

**హైదరాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త:** బహుముఖ వ్యాపార విస్తరణ చర్యలతో సింగరేణి గ్రీన్ ఎనర్జీ, సింగరేణి గ్లోబల్ లిమిటెడ్ గాను విస్తరించనుందని ఆ సిఎండి ఎన్.బలరామ్ తెలిపారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో బుధవారం నిర్వహించిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాల కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా ఒడిశా రాష్ట్రంలో బొగ్గు బ్లాక్ ను ప్రారంభించిందన్నారు. అలాగే రాజస్థాన్ రాష్ట్రంతో కలిసి సోలార్, థర్మల్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తుందని చెప్పారు. ఇదే సమయంలో కర్ణాటకలో బంగారం, రాగి అన్వేషణ జరుపుతోందని వివరించారు. 1998 ప్రాంతంలో మూసివేతకు చేరువగా వెళ్ళిన సింగరేణి సంస్థకు మాజీ సిఎండి శర్మ ప్రాణప్రతిష్ట చేశారని ప్రశంసించారు. గ్రీన్ ఎనర్జీలో సింగరేణి ముందుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ సిఎండి ఎ.పి.వి. ఎన్.శర్మ మాట్లాడుతూ ప్రతి పని, ప్రక్రియలో పారదర్శకత ఉన్నప్పుడు విజిలెన్స్ అవసరం అంతగా ఉండదన్నారు. లోప భూయిష్టంగా వ్యవస్థ ఉన్నప్పుడు అక్రమాలకు, అవినీతికి ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు. సింగరేణి ప్రస్తుతం బొగ్గు ఉత్పత్తి చేస్తున్నప్పటికీ వ్యాపార విస్తరణ చర్యలు చేపట్టడం మంచి పరిణామమన్నారు. రానున్న కాలంలో బొగ్గుకు ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్యం తగ్గిపోతుందని, ఇప్పటికే కొన్ని విదేశాల్లో బొగ్గ తవ్వకాన్ని నిలిపివేశారని పేర్కొన్నారు. సింగరేణి ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు విస్తరించడం హర్షించదగిన విషయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె వెంకటేశ్వర్లు, గ్రౌతమ్, తిరుమల రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# సేవల రంగ ఆదాయంలో తెలంగాణది అగ్రస్థానం

### నీతి ఆయోగ్ నివేదికలో వెల్లడి

**హైదరాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త:** సేవల రంగం నుండి వస్తున్న ఆదాయంలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. తెలంగాణ స్థూల రాష్ట్ర విలువ జోడింపు (జీఎస్‌డీపీ)లో సేవల వాటా 2011-12 ఆర్థిక సంవత్సరలో 52.8 శాతం ఉండగా, 2023-24 నాటికి అది 62.4 శాతానికి పెరుగుదల నమోదైంది. ఈ విషయాన్ని నీతి ఆయోగ్ నివేదిక రాష్ట్రస్థాయి డైనమిక్స్‌లో వెల్లడించింది. ఈ పెరుగుదల జాతీయ సగటు 54.5 శాతం కంటే అధికంగా ఉండటం విశేషం. మొత్తంగా తెలంగాణ సగటు సేవల రంగం వాటా 60.3 శాతంగా ఉంది.

హైదరాబాద్ కేంద్రంగా అభివృద్ధి చెందిన ఐటీ, స్టార్టప్‌ల వ్యవస్థ, రియల్ ఎస్టేట్, వృత్తిపరమైన సేవలు, ఆర్థిక సేవలు ఈ వృద్ధికి కారణమని నీతి ఆయోగ్ స్పష్టం చేసింది. ఇక ఉపాధి కల్పనకు సంబంధించి 2023-24 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ శ్రామిక శక్తిలో 24.8 శాతం చొప్పున 62 లక్షల మంది సేవల రంగంలో పనిచేస్తున్నట్లు పేర్కొంది. ప్రధానంగా ఐటీ రంగం నుండి 12 శాతం వాటాతో ఉపాధిల గణనీయ పాత్ర వహిస్తోందని తెలిపింది.

## వాట్సాప్ ఛానల్‌ను ప్రారంభించిన సిటీ కొత్వాల్ సజ్జన్నార్

**హైదరాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త:** సిటీ పోలీసు కమిషనర్ వి.సి సజ్జన్నార్ తన సెల్‌ఫోన్ ద్వారా వాట్సాప్ ఛానల్‌ను బుధవారం ప్రారంభి ంచారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్‌లో గల తన కార్యాలయంలో దీనిని ప్రారంభించారు. నగర పౌరులకు ఎప్పటికపుడు అప్‌డేట్లు అంది ంచేందుకు దీనిని ప్రారంభించినట్లు సజ్జన్నార్ ఈ సందర్భంగా తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నుంచి ముఖ్యమైన సమాచారాన్ని తాజా అప్‌డేట్లను మిస్ కాకుండా ఈ ఛానల్‌ను వెంటనే ఫాలో కావాలంటూ ఆయన కోరారు.డిజిటల్ యుగంలో సైబర్ మోసాలు అధికమ య్యాయని, ఏఐ,డీప్‌ఫేక్ క్లోనింగ్‌లతో ఆధునిక తరహా మోసాలు జరుగుతున్నాయని, వీటి నివారణకు సేఫ్ వర్డ్‌తో రక్షణ పొందాలని ఆయన కోరారు. ముఖ్యంగా డీప్ ఫేక్ మోసాలను అరికట్టేందుకు సేఫ్ వర్డ్‌ను కచ్చితంగావాడాలని ఆయన సూచించారు.

## ఢిల్లీలో అణు గూఢచర్యం గుట్టురట్టు చేసిన ఐఎస్ఐతో సంబంధాలు కలిగిన ఇద్దరి అరెస్టు

**హైదరాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త:** ఢిల్లీలో అణు గూఢచర్యం గుట్టును స్పెషల్ పోలీసులు రట్టు చేశారు. ఈ సందర్భంగా పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థ ఐఎస్ఐతో సంబంధాలున్న ఇద్దరు నేరగాళ్లను అరెస్టు చేశారు. పట్టుబడ్డ నిందితుల్లో ఒకరికి ఇరాన్, రష్యాకు చెందిన అణు శాస్త్రవేత్తలతో సం బంధాలున్నట్లుగా ఢిల్లీ పోలీసుల విచారణలో తేలింది.ఢిల్లీలో ఝుర్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌కు చెందిన మహమ్మద్ ఆదిల్ హుస్సేన్ని (59),అతని సోదరుడు నసీముద్దీన్ (55) అనే ఇద్దరు నకిలీ పాస్‌పోర్టుల కేసులో అనుమానితులుగా పట్టుబడగా వీరిని విచారించారు.

## సైబర్ క్రైం మోసం కాగజ్‌నగర్‌లో వరుస కేసులు నమోదు

### మధ్యప్రదేశ్ నిందితుడి అరెస్టు

### ఒక కేసులో స్టాక్స్ పేరుతో రూ. 76 లక్షలు

### మరో కేసులో రూ. 45,790

**కాగజ్‌నగర్,అక్టోబర్ 29 ప్రభాతవార్త :** కుమ్రం భీం



వివరాలు వెల్లడిస్తున్న కాగజ్‌నగర్ డీఎస్పి వహిదుద్దీన్

ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ పట్టణం, గ్రామీణ పోలీస్ స్టేషన్‌లలో సైబర్ క్రైం వరుస కేసులు నమోదు కావడం జరిగింది. మంగళవారం రోజున కాగజ్‌నగర్ డీఎస్పీ వహిదుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ బాధిత మహిళ ఫిర్యాదు మేరకు రూ. 76 లక్షలు ఆన్‌లైన్‌లో మోసం జరిగిందని గుర్తించినట్లు తెలిపారు.

ఈ డబ్బు గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల బ్యాంకు ఖాతాలకు జమ అయినట్లు ఆన్‌లైన్‌లో సూచిస్తుందని తెలిపారు. ఇదిలా ఉంటే బుధవారం రోజున గ్రామీణ ప్రాంత సీఐ కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం ఓ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదులో 45.790 రూపాయలు మోసంపోయినట్లు పేర్కొన్నారు. దర్యాప్తులో భాగంగా మధ్యప్రదేశ్‌కు చెందిన ఆశీష్‌కుమార్ దోహార్‌ను అరెస్టు చేసి

రూ. 34537.38 ఫ్రిజ్ చేసినట్లు కాగజ్‌నగర్ రూరల్ సిఐ కుమారస్వామి తెలిపారు. ఫిర్యాదు స్వీకరించిన వెంటనే కాగజ్‌నగర్ రూరల్ ఎస్ఐ సందీప్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా డబ్బులు ఏ అకౌంట్‌కు వెళ్లాయో డిఫోర్‌సి బృందంతో సాంకేతిక ఆధారాలు సేకరించి ట్రేస్ చేయగా ఆ అకౌంట్ మధ్యప్రదేశ్ రాష్ట్రం సాత్నా జిల్లాకు చెందిన ఆశిష్ కుమార్ దోహార్ వాడుతున్నట్లు నిర్ధారించారు. అకౌంటు పేరును ఆశిష్ కిరాణా స్టోర్ అనిమార్పు చేసి ఉపయోగించాడు. జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ రూరల్ ఎస్ఐ సందీప్ కుమార్ డిఫోర్‌సి బృందం సమన్వయంతో మధ్యప్రదేశ్ రాష్ట్రంకు వెళ్లి నిందితుడిని తేదీ: 27.10.2025 రోజున సాత్నా ప్రాంతంలో పట్టుకున్నారు.

అనంతరం ట్రాన్సిట్ వారెంట్ తీసుకొని అక్కడి న్యాయస్థానం ముందు ప్రొడ్యూస్ చేసి, తేదీ: 28.10.2025న కాగజ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

దర్యాప్తులో నిందితుడు ఒప్పుకున్న వివరాల ప్రకారం తాను టీ స్టాల్‌లో పని చేస్తూ జీవిస్తున్న సమయంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ఆకాశ్ వద్వాని అనే వ్యక్తితో పరిచయం ఏర్పడిందని, అతను తనకు నీ ఏటీఎం, ఆధార్, మొబైల్ లింక్‌డ్ అకౌంట్ ఇస్తే నెలకు రూ. 10,000 ఇస్తా" అని చెప్పడంతో తన పంజాబ్ సింధ్ బ్యాంక్ అకౌంట్ వివరాలు ఇచ్చినట్లు తెలిపాడు. ఆకాశ్ వద్వాని ఆశిష్ కిరాణా స్టోర్స్ పేరుతో అకౌంట్‌ను వాడుతూ వేరువేరు వ్యక్తులను ఆన్లైన్‌లో మోసంచేసి వచ్చిన డబ్బులు తన అకౌంట్‌లో జమ చేసేవాడని నిందితుడు వెల్లడించాడు. పిర్యాదుదారుని అకౌంట్ నుండి మోసపోయిన మొత్తం 45,790 రూపాయలలో రూ.34,537.38 రూపాయలు ఫ్రీజ్ చేసినట్లు తెలిపారు. ప్రజలు తెలియని వ్యక్తులకి ఆధార్ పాన్ కార్డ్ అకౌంట్ డీటెయిల్స్ తెలియపరచవద్దు అని హెచ్చరించారు.

## రెండోఘాట్‌లో ద్విచక్రవాహనాలు ఢీ

**తిరుమల,అక్టోబర్ 29ప్రభాతవార్తప్రతినిధి:** అసలే బలమైన వర్షాలు కురిసి రోడ్డు పటిష్టత లేకపోయినసమయంలో తిరుపతి నుండి తిరుమలకు వచ్చే రెండోఘాట్‌లో బుధవారం ఉదయం ద్విచక్రవాహనాలు అదుపుతప్పి ఒకదానికొకటి ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురు ద్విచక్రవాహనదారులు గాయపడ్డారు. తిరుపతికి చెందిన చంద్రమౌళి, చంద్ర ఇద్దరూ తిరుమలలో వ్యాపారాలు చేసుకుని జీవనంసాగిస్తున్నారు. బుధవారం ఉదయం తిరుమలకు వస్తుండగా వినాయకుని గుడి దాటిన తరువాత ఘాట్‌లో మలుపువద్ద అదుపుతప్పి తొలుత చంద్రమౌళి పడ్డాడు. ఆ వెనుకనే వచ్చిన చంద్ర ద్విచక్రవాహానాన్ని ఢీ కొని క్రిందపడ్డాడు.

# రాష్ట్రంలో మేలు రకాల చేపలపై పరిశోధనలు

**హైదరాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త:** చేపల సాగులో పెట్టుబడులను తగ్గించి అధిక దిగుబడులను ఇచ్చే మేలురకం చేపల రకాలను అభివృద్ధి చేయడంపై శాస్త్రవేత్తలు దృష్టిసారించారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని పాలేరు మత్స్య పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు తక్కువ కాలంలో మేలైన దిగుబడి వచ్చే రకాలపై పరిశోధనలు చేస్తున్నారు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని మత్స్య పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ఈ పరిశోధనలకు సహకరిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఆధునిక పద్ధతులపై చేపల పెంపకంలో మెరుగైన జీవనోపాధి కల్పించేందుకు ఖమ్మం జిల్లా పాలేరు మత్స్య పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ప్రయత్నిస్తున్నారు. చెరువుల్లో పెంచుతున్న చేపలకు రోగాలు రావడం, వాటి ఎదుగుదలలో లోపం వంటి సమస్యలతో దిగుబడులు తగ్గి మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ సమస్యను ఎదుర్కొనేందుకు జన్యువరంగా అభివృద్ధి చేసిన అమూర్ కామన్ కార్స్ (బంగారు తీగ), జయంతి రోహో (రవ్వ), జీఐఐ కట్ల (బొచ్చు), జీఐ ఎఫ్‌టీ తిలాపియా, జీఐఐ స్కాంపి ప్రత్యామ్నాయ జాతులైన రావ్ చంద్, పెరల్‌స్పాట్, మంచినీటి పండుగప్ప, రెటతిలావియా రకాలపై పాలేరులో శాస్త్రవేత్తలు నిరంతరం పరిశోధనలు జరుపుతున్నారు. ఈ చేపలు ఇక్కడి వాతావరణానికి తట్టుకుంటాయా లేదా వ్యాధి నిరోధకశక్తి, మేత విధానం, పోషకాలు, అధికదిగుబడులు.


తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూసేకరణ) శాఖ

**ఫారం-7**

(చట్టం-30/2013 లోని సెక్షన్ 19(1)లోని సబ్ రూల్-(1) రూల్ 25 ప్రకారం)
కలెక్టర్/సంయుక్త కలెక్టర్/స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ)/
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ)

**రూఢీ ప్రకటన**

గెజిట్ నెం. 95/2025 తేది: 18.10.2025
జిల్లా కలెక్టరు యాదాద్రి భువనగిరి ఫైలు నెం. G4/3327/2025 తేది: 13.10.2025
ప్రత్యేక ఉప కలెక్టరు (భూ.సే), యాదాద్రి భువనగిరి ఫైల్ నెం. సి/385/1/2017 తేది: 06.10.2025

తెలంగాణ ప్రభుత్వము/జిల్లా కలెక్టరు యాదాద్రి - భువనగిరి గారి ఆదేశానుసారం ఈ దిగువ నిర్దిష్ట పరిచిన యాదాద్రి-భువనగిరి జిల్లాలో గుండాల మండలం గంగాపూర్ గ్రామములో విస్తీర్ణం ఎ.0.27 గుంటల భూమి ప్రజా ప్రయోజనార్థం దేవాదుల ప్రాజెక్టు నిర్మాణములో భాగముగా JCRGLIP-Phase-III 18R of L2 of Main Canal Package-7 Nawabpeta Reservoir నిర్మాణములో భాగముగా దిగువ చూపిన భూమి అవసరమైయున్నదని నిర్ణయించినారు.

కావున యాదాద్రి-భువనగిరి జిల్లాలో గుండాల మండలం, గంగాపూర్ గ్రామములో విస్తీర్ణం ఎ.0.27 గుంటల భూమి ప్రజా ప్రయోజనార్థం దేవాదుల ప్రాజెక్టు నిర్మాణములో భాగముగా JCRGLIP-Phase-III 18R of L2 of Main Canal Package-7 Nawabpeta Reservoir నిర్మాణములో భాగముగా దిగువ చూపిన భూమి అవసరమైనందున ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రకటన (డిక్లరేషన్) జారీచేయనైనది.

**షెడ్యూల్**

గ్రామము : గంగాపూర్ మండలం : గుండాల జిల్లా : యాదాద్రి-భువనగిరి

| సర్వే నెం. విస్తీర్ణం | భూమి రకం (ఖుష్కి/తరి) (పట్టా/ ప్రభుత్వ /ఇనాం) | పట్టాదారుని పేరు తండ్రి/భర్త పేరు | అనుభవదారుని పేరు తండ్రి/భర్త పేరు | భూసేకరణ చేయు విస్తీర్ణము | చెట్లు రకం/ నిర్మాణం రకం |
|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 40/ 0.07 | ఖుష్కి/ పట్టా | జిట్టా చంద్రయ్య తండ్రి : బెరు మల్లయ్య | జిట్టా చంద్రయ్య తండ్రి : బెరు మల్లయ్య | 0.05 | -- |
| | | జిట్టా యాదయ్య తండ్రి : బెరు మల్లయ్య | జిట్టా యాదయ్య తండ్రి : బెరు మల్లయ్య | 0.02 | -- |
| 44/ 0.20 | ఖుష్కి/ పట్టా | బజ్జూరి గోపయ్య తండ్రి : రామస్వామి | బజ్జూరి గోపయ్య తండ్రి : రామస్వామి | 0.08 | -- |
| | | బజ్జూరి అశోక్ తండ్రి : రామస్వామి | బజ్జూరి అశోక్ తండ్రి : రామస్వామి | 0.06 | -- |
| | | బజ్జూరి యాదయ్య తండ్రి : రామస్వామి | బజ్జూరి యాదయ్య తండ్రి : రామస్వామి | 0.06 | -- |
| | | | మొత్తం | 0.27 | |

సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013) క్రింద భూసేకరణ పై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది. ఈ భూసేకరణవలన నిర్వాసితులు కానందున పునరావాసం కల్పించబడు విస్తీర్ణము శూన్యం.

భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

పైన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క నమూనా ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ), యాదాద్రి-భువనగిరి జిల్లా నందు కార్యాలయపు పనివేళలందు చూసుకొనవచ్చును.

సం/-. ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), ఆర్ అండ్ ఆర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా. సం/- అదనపు కలెక్టర్, యాదాద్రి భువనగిరి సం/-. జిల్లా కలెక్టర్ యాదాద్రి భువనగిరి

DIPR RO.NO: 773/LA/PP/Advt/Pub/2025-26



**GOVERNMENT OF INDIA**
**DEPARTMENT OF ATOMIC ENERGY**
**HEAVY WATER PLANT (MANUGURU)**
**NOTICE INVITING e-TENDERS**

The General Manager, Heavy Water Plant (Manuguru), Department of Atomic Energy, Government of India, Aswapuram, Bhadradri kothagudem Dist. 507 116 [T.S] invites on behalf of President of India online item rate tender(s), for the following work (s).

**NIT No: HWPM/I-P/DMP/2025/01**

Name of the work: "Cable Tray Re Routing and Junction Boxes repair and Maintenance at DM Plant".
Estimated cost: Rs. 4,81,000/-
Earnest Money: Rs 9,620/-
Period of completion: 6 Months
Dates of availability of Tender Documents for view and download: 30-10-2025 (10.00 Hrs) onwards
Last date and time of closing of online submission of tenders: 10-11-2025(16.00 Hrs)
Last date for submission of contractor credentials (hard copies i.e. attested copies of certificates): On or before 13-11-2025 (14.00 Hrs.)
Date and time of online opening of Technical Bid (Part A): 13-11-2025 (14.30 Hrs)

The bid forms and other details can be obtained from the website https://eprocure.gov.in/eprocure/app
Detailed NIT can be viewed at www.hwb.gov.in

Sd/- (Signature of tender inviting authority)

CBC 48115/12/0016/2526



**// ప్రకటన //**

39వ Bn ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ ఉద్యోగి, Regtl. నం. 070370338 హెడ్ కానిస్టేబుల్ (GD) నార్లపాటి రమేష్ S/o శ్రీ నార్లపాటి వెంకటేశ్ రావు, గ్రామం/Po/PS/Teh- అశ్వారావుపేట, ఖమ్మం జిల్లా (తెలంగాణ), పిన్-570301 సమర్థ ప్రాధికారి యొక్క ముందస్తు అనుమతి/సమాచారం లేకుండా, బదిలీపై అతనికి ఇచ్చిన నిర్దేశిత ప్రయాణ కాలం నుండి గైర్హాజరు అవుతున్నారు.

2. హెడ్ కానిస్టేబుల్ (GD) నార్లపాటి రమేష్ S/o శ్రీ నార్లపాటి వెంకటేశ్‌రావుకు పలుమార్లు రిజిస్టర్డ్ ఉత్తరాలు పంపినప్పటికీ, గ్రేటర్ నోయిడా (UP) వద్ద ITBP, 39వ Bn యొక్క హెడ్ క్వార్టర్స్‌లో అతడు రిపోర్ట్ చేయలేదు లేదా అతని అనుజ్ఞలేని గైర్హాజరు గురించి ఎటువంటి సమాచారం ఇంతవరకు అందలేదు. ITBPF చట్టం, 1992 మరియు నిబంధనలు. 1994లో వున్నటువంటి ఏర్పాట్లుకు మరియు కోర్ట్ ఆఫ్ ఇన్క్వైరీ యొక్క సిఫార్సులను బట్టి 39వ Bn ఉత్తర్వు నం. 7810-19 తేదీ 22.09.2025, ప్రకారం 22.05.2025 నుండి అతన్ని "Deserter"గా ఇప్పటికే ప్రకటించడమైనది. ఈ పైన పేర్కొన్నవే కాకుండా, 39వ Bn షో కాజ్ నోటీస్ నం. 7955-58 తేదీ: 25.09.2025 ప్రకారం 15 రోజులలోపుగా 39వ Bn, ITBPలో రిపోర్టుకు, 15 రోజుల యొక్క టైమ్‌లైన్ అతనికి ఇవ్వబడింది. కాని ఇంకా రిపోర్టు చేయలేదు.

3. అందువలన, హెడ్ కానిస్టేబుల్ (GD) నార్లపాటి రమేష్ S/o శ్రీ నార్లపాటి వెంకటేశ్‌రావుకు ఇందుమూలముగా ఈ ప్రకటన ద్వారా తెలియచేయునది ఏమనగా ఈ యూనిట్ యొక్క ప్రచురణ తేదీ నుండి 15 రోజులలోపుగా 39వ Bnలో రిపోర్ట్ చేయవలసినదిగా ఆదేశించడమైనది. నిర్దేశిత టైమ్‌లైన్స్‌లో అతడు రిపోర్ట్ చేయడంలో విఫలమైతే, సర్వీస్ నుండి అతడు తొలగించబడతాడు.

సం/-
కమాండెంట్
39వ Bn, ITB పోలీస్

CBC 19112/11/0131/2526


వార్త

మనం స్వీకరించే ఆనందం కన్నా మరొకరికి ఆనందం పంచడం వల్ల మనకు మరింత ఆనందం లభిస్తుంది.

-ఎ.బెర్గ్

# మరో అగ్ని పరీక్ష!

ప్రత్యేక ఓటర్ల ముమ్మర సవరణ అంశంల అపప్రథ మూటగట్టుకున్న ఎన్నికల సంఘంఅన్ని ఆటంకాలు, అనుమానాలను, అవమానాలను తట్టుకొని తాము నడిచే దారే అన్ని రాష్ట్రాలకు శ్రీరామరక్షగా నిరూపించుకోబోతోంది. దీనిపై విపక్షాలు సుప్రీంకోర్టు కెక్కడం, దానాదీనా అన్ని సలహాలు సూచనలను మార్గదర్శకాలను అనుసంధానం చేసుకుంటూ బీహార్‌లో 65 లక్షల మంది అన్య ఓటర్లను జాబితా నుంచి తొలగించడంలో ఎన్నికల సంఘం కృతకృత్యురాలైంది. నవంబరు 4 నుంచి దేశంలోని 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత రాష్ట్రాల్లో ఓటర్ల ముమ్మర జాబితా సవరణ (ఎస్‌ఐఆర్) చేయనున్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ వెల్లడించారు. ఆయన నేతృత్వంలో ఇది అతికీలక నిర్ణయం తీసుకున్నారు. ఇలా జాబితా సర్వే వెనుక ప్రత్యేక అజెండా ఉంటుంది. కనుక అలాంటి సర్వేను తాము అంగీకరించబోమని,కాంగ్రెస్ తృణమూల్ కాంగ్రెస్ తమిళనాడులోని డిఎంకె పార్టీలు పూర్తిగా నిషేధించాయి. ఇప్పటికిప్పుడు అత్యవసరంగా ప్రత్యేక ముమ్మర సర్వే చేపట్టాల్సిన అవశ్యకత ఏముందని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రజల హక్కులను దోపిడీ చేసే ప్రయత్నమే ఇదని,ఇప్పటికే బీహార్‌లో విస్తృత జాబితా సవరణ కార్యక్రమాన్ని అసంబద్ధంగా చేసిందని వాపోయింది.తుది జాబితా కూర్పులో పారదర్శకత పాటించలేకపోయిందని విపక్షాలు ఎద్దేవా చేశాయి. ఎన్నికల కమిషన్ ఈ కార్యక్రమాన్ని చేపట్టే ముందు రాజకీయ పార్టీలను చర్చలకు పిలవాల్సి ఉందని అలా చేయకపోవడం వల్లనే అపోహలు తలెత్తాయని సుప్రీంకోర్టు కూడా గట్టిగాచెప్పిచూసింది. అనంతరం సజావుగానే జరిగిందని చెప్పాలి. విమర్శల దాడినుంచి బయటపడిన ఎన్నికల కమిషనర్‘ఎస్‌ఐఆర్–2’ కార్యక్రమాన్ని ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు పుదుచ్చేరి, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలే కాకుండా అండమాన్ నికోబార్ దీవులలో కూడా ఓటర్ల ముమ్మర సవరణ చేపట్టనున్నారు. ఈసారి గతంలో ఉన్నటువంటి గత అనుభవాలతో ముందుకెళ్లేందుకు ఇ.సి సిద్ధమైంది. మునుపటి మాటేమో కాని సుప్రీంకోర్టు మందలింపులు విన్నాకఎన్నికల కమిషన్ మరింత జాగ్రత్తగా వ్యవహరించినట్లు నిరూపితమైంది. అయినా ఎందుకో విపక్షాలకు శంక వదల్లేదు. ప్రధానంగా బిజెపియేతర పార్టీల పాలనలో ఉన్నతమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని అంగీకరించే పరిస్థితిలో లేవు. రెండో విడత సజావుగా జరిపేందుకు ఎన్నికల కమిషన్ ప్రతి ఇంటికీ తనిఖీకి బూత్ లెవెల్ అధికారులను ప్రత్యేకంగా ఏర్పాటుచేసింది. కనీసం మూడుసార్లు ఈ పరిశీలన ఉంటుంది కనుక సందేహించాల్సిన అవసరం ఉండదు. నవంబరు, డిసెంబరులలో నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేసేందుకు యంత్రాంగాన్ని సన్నద్ధం చేశారు. తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్, అసోంలలో వచ్చే యేడాది శాసన సభ ఎన్నికల జరగుతున్నాయి. ఇదే సమయంలో అసోంలో విడిగా జాబితాల ముమ్మర సవరణ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఇసి ప్రకటించడాన్ని చూసే మరోకొత్త అనుమానం రాకతప్పదు. ఎందుకంటే దక్షిణాది రాష్ట్రాలు పశ్చిమ బెంగాల్‌లో కేంద్రంలోని ఎన్డీయేయేతర పార్టీల పాలనలో ఉన్నాయి. ఆది నుంచి కేంద్రప్రభుత్వం ఏకార్యక్రమాన్ని చేపట్టినా సహకరించని రాష్ట్రాలుగాపేరుబడ్డాయి. అదే విధంగా కేంద్రం కూడా ఆయా రాష్ట్రాలమాట వినేందుకు సిద్ధంగా లేదనే ఆరోపణలున్నాయి. ప్రధానంగా తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ హిందీని తమ విద్యా విధానంలో చూపిస్తున్నారనే ఆరోపణతో కేంద్రం చర్యలను వ్యతిరేకిస్తున్నారు. ఇక అసోం విషయంలోపౌరసత్వం వంటి సమస్యలు ఉన్నాయి.అయినప్పటికీ ఆ విషయాన్ని ఇ.సి తమ తలకెత్తుకోవడం లేదు. పౌరసత్వం చట్టంలో విడిగాఉండే నిబంధనమాత్రమే అసోం రాష్ట్రానికి వర్తింపు చేయనున్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ వివరించారు. కనుక ఈ అంశంలో పెద్ద అపోహాలు తలెత్తారు. అసోం ఎన్డీఏ పాలనలో ఉన్నా అక్కడున్న పౌరసత్వ సమస్యలు వేరు. దేశానికి స్వాతంత్య్రం వచ్చాక ఇంతవరకు 8సార్లు ఎస్‌ఐఆర్ చేపట్టగా ప్రస్తుతం9సవరణ జరుగుతోంది.ఇంత క్రితం బీహార్ జాబితా విషయంలో తప్పులు,లోపాలులేని జాబితాను రూపొందించగలిగామన్న సంతృప్తిని కమిషన్ వ్యక్తంచేసింది. అర్హుడైన ఏ ఒక్క ఓటరునూ వదులుకోమనీ, అనర్హులైన వారిని వదిలిపెట్టబోమని ఎన్నికల కమిషన్ నిర్ధారిత లక్ష్యంతో ముందుకు కదలడం ఇకపై ఎలాంటి బేషజాలకు పోకుండా వ్యహరించడం వలనఎన్నికల కమిషన్‌కు అభినందనలు పొందే అవకాశం ఉంది. ఎస్‌ఐఆర్ నిర్ణయం ప్రజాస్వామ్యానికి వ్యతిరేక కుట్రగా తమిలనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అభివర్ణించారు. ఎన్నో మార్పులు చేర్పులతో చేప్టిన జాబితా సవరణను కూడా ఆయన అంగీకరించినట్లు లేదు. కేవలం పరస్పర అనుమానాల కారణంగానే విపక్షాలు, ఎన్నికల కమిషన్ ఏకాభిప్రాయానికి రావడం లేదని సుప్రీంకోర్టు ఏనాడో అభిప్రాయపడింది. ఇంతపెద్ద కార్యక్రమాన్ని నిర్వహించదలచినప్పుడు విపక్షాలను విశ్వాసంలోఎకి తీసుకోవాల్సిన ఆవశ్యకత,బాధ్యతను ఎన్నికల కమిషన్ గుర్తించాలి.రాజ్యాంగబద్ధమైన బాటలో తమవిధులు తాము నిర్వహిస్తున్నట్లు ఎన్నికల కమిషనర్ ఆత్మ విశాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. లోపభూయిష్ట విధానాలుంటే సరైన సమయంలో సరైన విధానంలో ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లడంలో విపక్షాలు చొరవతీసుకోవాలే తప్ప అయినదానికీ, కాని దానికీ ఒంటికాలి మీదలేవటం సరైనపద్ధతికాదని తెలుసుకోవాలి.



ఎక్కువ గమనించడం, ఎక్కువ బాధలను అనుభవించడం, ఎక్కువ అధ్యయనం చేయడం ఇవి అభ్యాసనకు మూడు ముఖ్య స్తంభాలు.

ఎమర్సన్



ఇతరుల్ని కష్టపెడుతూ నువ్వు కష్టపడకపోవచ్చు. కానీ సంతోష పెట్టేటప్పుడు మాత్రం నువ్వు తప్పక సంతోషంగా ఉంటావు.

సిసిరో

## ప్రజావాక్కు



### డిఏ బకాయిల ఉత్తర్వులను సవరించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం ఉద్యోగులకు 2024 జనవరి 1 నుంచి ఇవ్వాల్సిన డిఏను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఈరోజు ఉత్తర్వులు జి.వో.ఎంఎస్.నెం.60జారీ చేసింది. అయితే ఈ ఉత్తర్వుల్లో పెరిగిన 3.64శాతం కొత్త డిఏను అక్టోబర్ 2025 జీతంతో కలిపి చెల్లిస్తారు. జనవరి 2024 నుంచి సెప్టెంబర్ 2025 వరకు ఇవ్వాల్సిన డిఏ బకాయిలను సదరు ఉద్యోగిపదవీ విరమణ సమయంలో చెల్లిస్తారు. ఈ కొత్త డిఏతో కలిపి ఉద్యోగుల మొత్తం డిఏ 37.31శాతం అవుతుంది. మొత్తం నాలుగు డిఏ బకాయిలు ఉండగా ప్రభుత్వం ఒక్క డిఏ మాత్రమే ఇచ్చింది. ఆ ఒక్క డిఏ బకాయిలు జనవరి 24 నుంచి సెప్టెంబర్ 25 వరకు చెల్లించాల్సినవి పదవీవిరమణ అనంతరం చెల్లిస్తామని చెప్పడందారుణం.చనిపోయినఉద్యోగికిఅయితే వారసులకు ఇస్తామని ఉత్తర్వుల్లో పేర్కొనడం మరీ దారుణం.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### యువతకు రాజకీయ అవకాశాలు

ఎంఎల్ఏ ఎన్నికల్లో పోటీ చేయడానికి కనీస వయసు పరిమితిని 25నుండి 21సంవత్సరాలకు తగ్గించే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదన ఎంతో సరికొత్త ఆలోచన. ఇది యువతను రాజకీయాల్లోకి ఆహ్వానించే దిశగా తీసుకున్న ప్రగతిశీలమైన అడుగు. నేటి యువత సమాజంపై అవగాహన కలిగిన వారు, సాంకేతికంగా నైపుణ్యం ఉన్న వారు. వారికి ప్రజాప్రాతినిధ్యం లభిస్తే, ప్రభుత్వ వ్యవస్థలో కొత్త ఉత్సాహం, సృజనాత్మకత, పారదర్శకతను తీసుకురాగలరు.ఈప్రతిపాదన అమలులోకి వస్తే, భారత దేశ రాజకీయ వ్యవస్థలో యువతకు విస్తృత అవకాశాలు లభిస్తాయి. ఇప్పటికే అనేక దేశాల్లో యువతను శాసనసభల్లోకి ప్రవేశపెట్టే విధానాలు ఉన్నాయి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### రక్షణ మార్గాలను ఏర్పాటు చేయాలి

తిరుపతి తిరుమల ఘాట్ రోడ్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పైనుండి పెద్ద బండ రాళ్ళు కిందికి పడినవి.ఈఘాట్ రోడ్‌లో రోజూ బస్సులు లక్షల ప్రయాణీకుల్నితీసుకువెళ్తాయి. ఏడాది పాటు ట్రాఫిక్ ఉంటుంది. దేశంలోని అత్యంత ప్రతిష్టాత్మక సాంకేతిక పరిజ్ఞానం ఉన్న నిపుణుల అభిప్రాయం ప్రకారం చర్యలు చేపట్టాలి.

- బొల్లోజు మేఘానథం, విశాఖపట్నం

### ట్రంప్‌కు వ్యతిరేకంగా నిరసనలు

అమెరికాలో నున్న 50రాష్ట్రాలలో అక్కడిప్రజలు లక్షల సంఖ్యలో వీధులలోకి వచ్చి అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను విమర్శిస్తూ తమ నిరసనను తెలియజేయడం బహుశ అమెరికాచరిత్రలో ఇంతకు ముందెప్పుడు జరిగి ఉండదేమో.దాదాపు ఏడినిమిది యుద్ధాలను నివారించి శాంతిని నెలకొల్పానని తనకు తానే ప్రశంసలు చేసుకుంటున్న ఆ పెద్దమనిషి తన దేశంలో తనకు వ్యతిరేకంగా జరుగుతున్న అలజడులను నివారించక లేకపోవడం ఆశ్చర్యకరం. ఇజ్రాయెల్ గాజా, ఉక్రెయిన్ రష్యాల మధ్య యుద్ధాలు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. రష్యా నుండి భారత్‌కు వచ్చే చమురు దిగుమతులనుఆపేశానన్నాడు. దీనిని భారత్ ధృవీకరించలేదు. ఇదొక అబద్ధం. అమెరికన్ కాంగ్రెసులో ఆయనపై అభిశంసన తీర్మానం పెట్టవచ్చును కదా. తగినంత సంఖ్యాబలం కన్సర్వేటివ్ పార్టీకి ఉన్నదేమో. చరిత్రలో నిలచిపోయేది చరిత్రకారులే కాదు, చరిత్ర హీనులు కూడా ఉంటారు.

- డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### సాదాబైనామా వర్తింప చెయ్యాలి

2015లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 42 గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనంచేయడం జరిగింది.2020 అక్టోబర్, నవంబర్ నెలలో భూమి పాస్ బుక్ కానీ రైతులు, సదబైనామా ద్వారా కొనుగోలు చేసిన వారికీ, పాస్‌బుక్‌ల కోసం అప్లై చేసుకోమని అప్పటి ప్రభుత్వం చెపితే,మీ సేవలో కొన్నివేలమంది రైతులు, కొన్ని వేలఎకరాల భూమి పాస్‌బుక్‌లకోసం అప్లై చేసుకున్నారు. భూ భారతి వెబ్సైటులో అట్టి వివరాలు కూడా, ల్యాండ్ స్టేటస్‌లో నమోదు అయి ఉన్నవి.ఇప్పుడు కోర్టు స్టే ఎత్తి వేసిన పిదపెమో 42 గ్రామాల రైతులకు వర్తించదు, అని రెవిన్యూ అధికారులు చెప్పుతున్నారు. విలీనం ఐనా 42 గ్రామాలలోని, రైతుల వ్యవసాయ భూములకు కూడా సాధాబైనామా వర్తింపా చేయాలి.

-బీరం రాములు, వరంగల్

### నిప్పులేనిదే పొగ రాదు

నేపాల్,బంగ్లా, శ్రీలంకలో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన ప్రజలు ప్రధాని రాజీనామా దాకా తీసుకొచ్చారు. నిప్పు లేనిదే పొగ రాదు అన్నట్టు ప్రభుత్వం అనుసరించిన అవినీతి విధానాలు ఒకవైపు వలసీకరణ ఒకవైపు విద్యార్థుల ఉద్యమం ఒకవైపు ఈజెన్‌జీ ఉద్యమాన్ని ఫలవంతం చేసాయి.

- భారత అవినాష్, జనగామ

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్


(e-mail: editpage@vaartha.com)

# ప్రమాదపు అంచున ప్రభుత్వ విద్య!

**తనిఖీ కమిటీల ఏర్పాటుకై ఆసక్తి గల పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు, డైట్‌అధ్యాపకుల సేవలను వినియోగించుకుంటే పాఠశాలల్లో బోధనకుంటు పడదు. అందువల్ల కొంతమంది మనోభావాలు కూడా దెబ్బ తినవచ్చు. తనిఖీ చేసే ఉపాధ్యాయుల బోధనవారి సొంత బడులలో దెబ్బతింటుంది. అక్కడి విద్యార్థులకు అన్యాయం జరుగుతుంది. బోధన క్రమం తప్పుతుంది. పర్యవేక్షణకు తని ఖీలకుతగిన ప్రత్యేక సిబ్బందిని నియమించుకోవడం శ్రేయస్కరం. ప్రభుత్వపాఠశాలల్లో చదివే విద్యార్థిని విద్యార్థులకు ఉచితరవాణా సౌకర్యం కల్పించాలి. గతంలో మాదిరిగా అల్పాహార పథకం మళ్లీ ప్రవేశపెట్టాలి. వారికి, వారి తల్లిదండ్రులకు ప్రభుత్వపరంగా అనేకరకాలైన ప్రోత్సాహకాలు కల్పిం చాలి. సాధ్యమైతే ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు ఉద్యోగాలలో కూడా రిజర్వేషన్ కల్పించవచ్చు. విద్యార్థుల ఆరోగ్యానికి ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి. ఉపా ధ్యాయులను పూర్తిగా బోధనకు పరిమితం చేయాలి.**

శ్రీశ్రీ కుమార్

ఒకప్పుడు బడి అంటే ప్రభుత్వ బడి, చదువు అంటే ప్రభుత్వ బడులలో చెప్పేదే చదువు. గత నాలుగు దశాబ్దాలలో ప్రభుత్వ రంగానికి సమాంతరంగా ప్రైవేట్, కార్పొరేట్ రంగాలలో పాఠశాలలు వెలిశాయి. అంతకు ముందు ప్రైవేటు పాఠశాలలను సేవా భావంతో నెలకొల్పితే తర్వాత రోజుల్లో స్థాపించడం వ్యాపారాత్మకమైనది. నేడు అది లాభసాటి వ్యాపారాల్లో ఒకటిగా వెలుగొందుతున్నది. దినదిన ప్రవర్ధమానమై ప్రభుత్వం ఇచ్చే ఉచిత చదువును కబళించింది. సంఖ్యాపరంగా చూస్తే ప్రభుత్వ బడుల సంఖ్యలో (24997) ప్రైవేట్ పాఠశాలలు సగానికి కూడా తక్కువ (11407) కానీ అడ్మిషన్ల పరంగా ప్రైవేటులో 60 శాతం విద్యార్థులు చదువుకొంటుండగా, ప్రభుత్వ బడులలో కేవలం 31 శాతం మంది చదువు నేర్చుకోవడం ప్రమాదకర సంకేతాలను ఇస్తున్నది. గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్‌లో మిగిలిన శాతం విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల పరిస్థితి నానాటికి తీసికట్టు నాగంబొట్టు లాగుంది. ప్రభుత్వ పాఠశాలల ఉనికికి, మనుగడకు వాటి భవిష్యత్తుకు ప్రమాద ఘంటికలు మోగిస్తున్న పరిస్థితి నెలకొన్నది. అసలు జీరో అడ్మిషన్లున్న 1897 పాఠశాలలను గుర్తిందారు. పదిమందికన్నా తక్కువ విద్యార్థులను పాఠశాలలు 4325 ఉన్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. 250 నుండి 1000 లోపు విద్యార్థులు అడ్మిషన్ పొందిన పాఠశాలలు 2261 ఉండటం, వెయ్యికిపైగా విద్యార్థులున్న బడులు 26 ఉండడం ప్రభుత్వ విద్యకు ఆశా కిరణాలుగా ఉన్నాయి. ఒక రకంగా చెప్తే ఇవి ప్రభుత్వ విద్యకు ప్రాణం పోస్తున్నాయి అనవచ్చు. దాదాపు మూడున్నర లక్షలకు పైగా ప్రభుత్వ ప్రైవేటు ఉపాధ్యాయులు పనిచేస్తుండగా ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి సమర్పించే న్యాస్ (నేషనల్ అచీవ్మెంట్స్ సర్వే) నివేదిక ప్రకారం 2021 లో 36వ స్థానంలో ఉండగా 2024లో అది 26వ స్థానానికి చేరింది. అంటే కొంత పురోగతి సాధించింది. అది విద్యార్థుల అభ్యసన స్థాయికి సంబంధించినవి. అంటే ఇంకా విద్యార్థుల్లో చదవడం రాయడం మామూలు లెక్కలు సాధించే స్థాయికి చేరలేకపోతున్నారు. చాలా దురదృష్టం ఏమంటే విద్యాశాఖ మంత్రులు కానీ సంబంధిత అధికారులు కానీ రాష్ట్రస్థాయిలో ఈ విషయమై సమీక్ష జరిపిన దాఖలాలు లేవు. చాలా తరచుగా డీఎస్సీలు, మెగా డీఎస్సీలు నిర్వహించి ఉపాధ్యాయుల నియామకాలు చేస్తున్నామని ప్రభుత్వం గర్వంగా ప్రకటిస్తున్నా క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు కాదు కదా కనీస స్థాయిలో కూడా లేకపోవడం దారుణం. ఇంకా 20 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. ప్రతి సంవత్సరం వేల మంది టీచర్ల పదవీ విరమణ జరుగుతుండగా వారి స్థానాల్లో తిరిగి నియామకాలు జరగడం లేదు. దీంతో విద్యార్థులకు ఎంతో అన్యాయం జరుగుతున్నది. అదే ప్రైవేటు వ్యవస్థలో లేదా కార్పోరేట్ పాఠశాలల్లో ఎవరైనా రాజీనామా చేసినా మరి ఏ ఇతర కారణాలకైనా పాఠశాలకు హాజరు కాకపోతే వారి స్థానంలో కొత్తగా టీచర్లను తక్షణమే నియమించుకుంటారు. తద్వారా విద్యార్థులు ఆ సబ్జెక్టులో వెనుకపడకుండా యాజమాన్యాలు జాగ్రత్త వహిస్తాయి.ప్రభుత్వాలు ఈవిషయమై తమ క్యాలెండర్ లేదా తమప్రణాళిక, రాబోయే ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని నియామకాలు చేస్తాయి. అయ్యవార్ల కోసం అమావాస్య ఆగదు. జరగవలసిన నష్టం అధికారులు అరికట్టలేరు. ఉచితంగా పుస్తకాలు అందజేసినా,యూనిఫామ్స్ ఇచ్చినా, మధ్యాహ్న భోజనం కల్పించినా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరగడంలేదు. అభ్యసన స్థాయిలు కూడా రోజు రోజుకు తీసికట్టుగానే ఉంటున్నాయి. వీటిలో చదివే విద్యార్థులు బడుగు బలహీన వర్గా



లకు చెందిన వారు. వారికి మరింత చేయూతనివ్వవలసిన బాధ్యత అందరి మీదఉంది. మొదట్లో సర్వశిక్ష అభియాన్, ఆ తర్వాత రాజీవ్ విద్యా మిషన్ ద్వారా చాలా బడులకు భవనాలు సమకూరినాయి. కానీ మరుగుదొడ్లు, మంచినీరు, విద్యుత్ సరఫరా నేడు అత్యవసరమైనాయి. ప్రభుత్వాలు ఎప్పుడు విద్య గురించి మాట్లాడినా ఒకాయన కంప్యూటర్ లిటరసీ, మరొకాయన డిజిటల్ ఎడ్యుకేషన్, ఇంకొకరు స్మార్ట్ బోర్డులు స్మార్ట్ తరగతి గదులు అంటూ ఊదరగొడుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో విద్యుత్ సరఫరాలేని పాఠశాలలు ఎన్నో ఉన్నాయి. వీటి గురించి ఎవరూ పట్టించుకోరు. డిజిటల్ విద్య గురించి పెద్ద పెద్ద కంపెనీలతో ఎంఓయూలు కుదుర్చుకుంటున్నారు. మౌలిక వసతుల గురించి ఎట్టి ఎంఓయూలు ఉండవు. అంటే ఇవన్నీ కేవలంప్రచార ఆర్భాటాలు మాత్రమే అనేది స్పష్టం. ఇక మూడవ తరగతినుండి ఏఐ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లేదా కృత్రిమ మేధ నేర్పుతామంటున్నారు. ఎందుకు దానిపై ఇంత మోజు? కేవలం సాంకేతికత మీదనే ఆధారపడతారా? భవిష్యత్తులో సాంకేతికత అవసరబోయే సవాళ్లను ఎదుర్కోవడానికి విద్యాశాఖ సిద్ధంగా ఉందా అనేది చర్చించుకోవాలి, సమీక్షించుకోవాలి. అందుకు తగిన వనరులను ఏర్పాటు చేసుకోవాలి. అదే నిజమైతే ఉపాధ్యాయ నియామకాలు ఎందుకుజరుపుతున్నట్లు? సిలబస్ పూర్తి చేయాల్సిన సమయంలో ఉపాధ్యాయులకు శిక్షణల శిక్ష ఎందుకు? మంచి విద్యార్హతలు కలిగివున్న ఉపాధ్యాయులు పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితి రోజురోజుకు విషమించడంపై తగిన సమీక్ష జరిగిదిద్దుబాటు చర్యలకు ఉపక్రమించాలి. రోబోలు తరగతి గదిని నియంత్రించలేవు. కంప్యూటర్లు పాఠం బోధించలేవు. అవి కేవలం బోధనోపకరణాలు మాత్రమేనని గుర్తించనంతకాలం మన విద్యా విధానం మెరుగుపడదు. సాంకేతికతను విచక్షణతో ఉపయోగించుకోవాలి. అంతేకానీ దానికి బానిస కాకూడదు. దానిపైనే పూర్తిగా ఆధారపడితే ఉపయోగం శూన్యం. సాంకేతిక పరిజ్ఞానం కేవలం సమాచార సేకరణకు సమీక్షలకు పనికి వస్తుంది కానీ తరగతి గదిలో ఉపాధ్యాయుడి బోధనను ప్రభావితం చేయలేదు. సాంకేతిక పరికరాల కొనుగోళ్ల మీద చేసే ఖర్చుపాఠశాలల్లో ప్రయోగశాలలు, గ్రంథాలయాలపై చేస్తే విద్యార్థులకు మరింత ప్రయోజనంచేకూరుతుంది. ఇక అనేక జిల్లాల్లో విద్యాశాఖ అధికారులు లేరు. మండల శాఖ అధికారి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డైట్ కళాశాలలో అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇవన్నీ పదోన్నతి ద్వారా నింపితే ఉపాధ్యాయులు మరింత బాధ్యతతో ఉత్సాహంగా పనిచేసే అవకాశం ఉంది. పాఠశాలల పైన ఆజమాయిషి లోపించింది. తనిఖీలు జరగడం లేదు. వృత్యంతర శిక్షణలు మొక్కుబడిగా సాగుతున్నాయి. నూతన విద్యా విదానంలో చేరుతున్నామో లేదో స్పష్టం చేయకపోగా మనకు ఒక విలక్షణమైన విద్యా విధానాన్ని రూపొందించబోతున్నట్లు ప్రకటించి ఉపాధ్యాయ లోకాన్ని ప్రభుత్వం మరింత గందరగోళంలో పడవేయడం జరిగింది. బోధన ప్రభావవంతంగా జరగడంలేదని, అరకొరగా సాగుతున్నదని అధికారుల అభిప్రాయం. అందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఆశ్చర్యం కలిగిస్తాయి. 20 వేల పోస్టులు ఖాళీగా ఉండగా, ఉన్న వారిలో చాలామందిని తనిఖీల పేరుతో కమిటీల ఏర్పాటు చేసి వారిని బోధనకు దూరం చేస్తున్నారు. 168 కమిటీలు రాష్ట్రంలోని 16,474ప్రాథమిక పాఠశాలలో తనిఖీలుచేయాలట.అదేవిధంగా 300ప్రాథమిక ఉన్నత పాఠశాలల తనిఖీకి 35కమిటీలు, 4672 సెకండరీ పాఠశాలలకు 96 కమిటీలు తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ అయినాయి. ఈ కమిటీలలో ముగ్గురు లేదా నలుగురు ఉపాధ్యాయ సభ్యులుంటారు. ఈ కమిటీల ఏర్పాటులో జూనియర్లు కొన్నిచోట్ల సీనియర్ల బోధనను పరిశీలించడం, సలహాలు సూచనలు ఇచ్చి నివేదిక సమర్పించడం ఏమాత్రంఆమోదయోగ్యంకాదు. అసంబద్ధంగా ఉంటుంది. తనిఖీ కమిటీల ఏర్పాటుకై ఆసక్తి గల పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు, డైట్‌అధ్యాపకుల సేవలను వినియోగించుకుంటే పాఠశాలల్లో బోధనకుంటు పడదు. అందువల్ల కొంతమంది మనోభావాలు కూడా దెబ్బ తినవచ్చు. తనిఖీ చేసే ఉపాధ్యాయుల బోధనవారి సొంత బడులలో దెబ్బతింటుంది. అక్కడి విద్యార్థులకు అన్యాయం జరుగుతుంది.బోధన క్రమం తప్పుతుంది. పర్యవేక్షణకు తనిఖీలకుతగిన ప్రత్యేక సిబ్బందిని నియమించుకోవడం శ్రేయస్కరం. ప్రభుత్వపాఠశాలల్లో చదివే విద్యార్థిని విద్యార్థులకు ఉచితరవాణా సౌకర్యంకల్పించాలి.గతంలో మాదిరిగా అల్పాహార పథకం మళ్లీ ప్రవేశపెట్టాలి. వారికి,వారి తల్లిదండ్రులకు ప్రభుత్వపరంగా అనేకరకాలైన ప్రోత్సాహకాలు కల్పించాలి. సాధ్యమైతే ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు ఉద్యోగాలలో కూడా రిజర్వేషన్ కల్పించవచ్చు. విద్యార్థుల ఆరోగ్యానికి ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి. ఉపాధ్యాయులను పూర్తిగా బోధనకు పరిమితం చేయాలి. ●

# అప్పులతోనే అభివృద్ధి.. ఆనందమెలా?


ప్రసాద రావు

ఒకప్పుడు అప్పు అంటే భయం. నేడు ప్రియంగా మారింది అంటే అతిశయోక్తికాదు. దేశ జి.డి.పి 2023 24లో 173.82 లక్షల కోట్లు కాగా, దాదాపు దీంట్లో సగ సమానమైన మొత్తం అప్పులు రూపంలోవివిధ బ్యాంకులు, వాణిజ్య సంస్థలు, ఫైనాన్స్ సంస్థలు నుంచి మనదేశ ప్రజలు వ్యక్తిగతంగా అప్పులు తీసుకున్నట్లు కేంద్ర గణాంక శాఖ నివేదిక పేర్కొంది. ఈ అప్పుల్లో మన తెలుగు రాష్ట్రాలు మొదటి రెండు స్థానాల్లో నిలువుగా,ఒక అడుగు ముందుకేసి ఆంధ్రప్రదేశ్ 43.7 శాతంతో మొదటి వరుసలో నిలబడింది. రెండో స్థానంలో 37.2 శాతంతో తెలంగాణా ఉంది. పూర్వం అనగా ఒక రెండు దశాబ్దాల క్రితం వరకూ, డబ్బులు ఉంటేనే ఏవస్తువు అయినా కొనడం, ఇల్లు కట్టుకోవడం వంటి కార్యక్రమాలు చేపట్టడం జరిగేది. అయితే ఇటీవల కాలంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకున్న ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలు వచ్చే ఆదాయం కన్నా ఎక్కువ ఖర్చు చేయడానికి అలవాటు పడ్డారు. దీనికి తోడు, బ్యాంకులు, ఇతర ఫైనాన్స్ సంస్థలు అప్పులు ఇవ్వడానికి ముందుకు వచ్చాయి. ఇక ప్రైవేటు బ్యాంకులు, సంస్థలు నియమనిబంధనలు సరళీకృతం చేసి మరీ ఇంటి వద్దకే అప్పులు ఇచ్చే సదావకాశం కల్పించాయి. ఆన్లైన్ సిస్టం ద్వారా, వ్యక్తిగత గ్యారంటీ ద్వారా ఋణాలు ఇవ్వడం ద్వారా అప్పులేని వ్యక్తి లేడు అన్నట్లు అయిపోయింది. గృహాలు, కార్లు, స్థలాలు, పొలాలు, గ్రహోపకరణాలు, గోల్డ్ వంటివి కొనడానికి సుముఖంగా ఉంటే చాలు.ఋణాలు సులభంగా అందిస్తున్నారు. కొంతమంది వాస్తవంగా ఈ ఋణాలు ద్వారా అభివృద్ధి చెందుతుంటే, మరెందరో ఋణగ్రస్థులుగా మారిపోతున్నారు. ఆదాయానికి మించి అప్పులు చేయడంతో చాలా మంది ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారు. ఇక పెళ్ళిల్లు, బర్తడే వేడుకలు, ఇంట్లో జరిగే అనేక వేడుకలు, విందులు వినోదాలు కోసం అప్పులు చేయడంతో చాలా కుటుంబాల్లో చీకటి అలుముకుంటున్న పరిస్థితి. ‘క్రెడిట్ కార్డు’ అందుబాటులోకి రావడంతో ఎక్కువ మంది అనవసరమైన ఖర్చులు చేయడం జరుగుతుంది. ఇక జీవితం అంతా అప్పులు, వడ్డీలు కట్టడం సరిపోతుంది. ఆన్లైన్ షాపింగ్, అమెజాన్, ఫ్లిప్ కార్ట్, మీసో, జొమోటో, స్విగ్గీ, బ్లింకిట్ ఇలా వివిధ రకాల సంస్థలు ఆన్లైన్ ద్వారా వస్తువులు, సరుకులు ఇంటి వద్దకే అందిస్తుంటే, చాలా మంది సుఖజీవులుగా మారి అనవసరమైన ఖర్చులు చేయడం జరుగుతుంది. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. తద్వారా ఆర్థికంగా, ఆరోగ్య పరంగా నశిస్తున్న పరిస్థితి. “ వినిమయతత్వం ( కన్జురిజం) నిత్యజీవితంలో భాగం అయింది. దీంతో ఎంత సంపాదించినా, సరిపోని పరిస్థితి నెలకొంది. విలాసాలు, వినోదాలు, పార్టీలు, గెట్ టుగెదర్, వీకెండ్ పార్టీలు, రకరకాల టూరిజం పర్యటనలు చేస్తూ అనవసరమైన ఖర్చులతో అప్పుల ఊబిలో చిక్కుకుంటున్న పరిస్థితి. మరోవైపు పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్, డి మార్ట్, రిలయన్స్, విజేత, మోర్, విశాల్, డిపార్ట్మెంట్ స్టోర్స్, వస్త్ర వ్యాపార సంస్థలు, లూలు మాల్స్, రెడిమేడ్ వస్త్రాలు,అలంకరణలు, లగ్జరీ బైక్,కార్లు, పెర్ఫ్యూమ్ అందుబాటులోకి రావడంతో అవసరానికి మించి కొనడం,అన్నిటికీ మించి ‘ సెల్‌ఫోన్లు, టీ.వీలు, ఫ్రిజ్, ఏ.సిలు’ ఇలా అనేక వస్తువులపై ఆకర్షణ ఏర్పడి, ఆదాయంతో సంబంధం లేకుండా ఖర్చు చేసికొనడంతో దాదాపు అన్ని కుటుంబాలు అప్పులు ఊబిలో కూరుకు పోతున్నారు. ఉత్తరాది రాష్ట్రాల కంటే దక్షిణాది రాష్ట్రాల ప్రజలు అప్పుల్లో మునిగి తేలుతున్న వైనం పట్టణ ప్రజలు కంటే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎక్కువ అప్పుల్లో ఉన్నట్లు సర్వేతెలిపింది. ‘జెన్‌జెడ్‌యువత, ప్రజలు’ అప్పుల్లో ఎక్కువగా ఉంటున్నారు. వివిధ రకాల లగ్జరీ అలవాట్లు కలిగి ఉండటం వల్ల అప్పులు కుప్పలుగా చేయడం జరుగుతుంది. మరి కొందరు‘స్టాక్ మార్కెట్’లో పెట్టుబడులు పెట్టేందుకు అప్పులు చేసిమరీ పెట్టుబడి పెడుతున్న పరిస్థితి.. ఆన్లైన్ గేమ్స్, విలాసవంతమైన ఇళ్ల నిర్మాణాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారం, విలాసవంతమైన జీవితం కోసం ఆదాయానికి మించి ఖర్చు చేయడం, అప్పులు చేయడంతో జీవితాన్ని నరకప్రాయం చేసుకోవడం జరుగుతుంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో అప్పు తక్కువ ఉన్న ప్రజలు ఎక్కువగా ఉండుట గమనించదగిన విషయం. ●

# ప్రజాస్వామ్య ప్రగతికి ప్రశ్నలే పట్టుకొమ్మలు

మేకిరి దామోదర్

సత్యం, అసత్యం మధ్య తేడా మసకబారిన యుగంలో మన ఆలోచన స్వేచ్ఛ అత్యంత విలువైనదిగా మారింది. అబద్ధాలకు శబ్దం ఎక్కువ, కానీ సత్యానికి శక్తి అపారమని తెలుసుకునే బుద్ధి అవసరం. ప్రజాస్వామ్యం కేవలం ఓటు వేయడమే కాదు, ప్రశ్నించే హక్కును వినియోగించడం కూడా. మన ఆలోచనా స్వాతంత్ర్యం క్షీణిస్తే, ప్రజాస్వామ్యం శ్వాస ఆగిపోతుంది. ప్రస్తుత కాలంలో మనం సత్యానంతర సమాజంలో జీవిస్తున్నాం. రాజకీయ, సాంస్కృతిక, చారిత్రక వక్రీకరణలు దైనందిన జీవితంలో మమేకమైపోతున్నాయి. నకిలీ వార్తలు, అబద్ధాలు, పాక్షిక వాస్తవాలు ఇప్పుడు సమాచారం కంటే వేగంగా వ్యాపిస్తున్నాయి. ఒకప్పుడు దౌర్జన్యాలు దైవలీలల పేరుతో జరిగేవి; ఇప్పుడు అవే ‘ఇదే మీకు మంచిది” అంటూ సాంకేతిక ముసుగులో సోషల్ మీడియా ద్వారా ప్రజల మనసుల్లోకి చొరబడుతున్నాయి. ప్రశ్నించని సమాజం మౌనంలో మునిగిపోతుంది. ఆ మౌనం మన ఆలోచనా శక్తిని మంటించిన మంటల్లా దహిస్తుంది. సగటు మనిషి స్వతంత్రంగా ఆలోచించే, వాస్తవాలను విచారించే సామర్థ్యాన్ని కోల్పోతున్నాడు. హేతుబద్ధతకు బదులు భావోద్వేగాలు, శాస్త్రీయ దృష్టికి బదులు ఆరాధనాత్మక దృష్టి చోటు దక్కుతోంది. ఫలితంగా, విలువల వ్యవస్థ పతనమవుతోంది. నీతి, నిజాయితీ, మర్యాదలు అన్నవి ఇప్పుడు ప్రదర్శనాత్మక పదాలుగా మారాయి. సత్యానికి విలువ లేని దేశంలో సత్యవంతుడు సులభంగా దోషిగా మారుతాడు. ఇలాంటి స్థితినే పాశ్చాత్య సమాజంలో ‘పోస్ట్ ట్రూత్” అని పిలుస్తారు. ఇక్కడ వాస్తవాల కంటే వ్యక్తిగత నమ్మకాలు, భావోద్వేగాలే ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేస్తాయి. నకిలీ వార్తల ప్రభావం వల్ల ప్రజలు తమకు నచ్చినది నిజమని నమ్ముతున్నారు. వాస్తవాలను నిర్లక్ష్యం చేయడం అలవాటైపోతోంది. ఫలితంగా సమాజంలో తప్పుడు సమాచారమే ‘ప్రజాజ్ఞానం’గా మారుతోంది. సోషల్ మీడియా వేదికలపై అబద్ధాలకు లైకులు ఎక్కువ, సత్యానికి నిశ్శబ్దం ఎక్కువ. ఆ పరిస్థితి ప్రజాస్వామ్యాన్ని సున్నితంగా, కానీ ఘోరంగా దెబ్బ తీస్తోంది. ప్రశ్నే ప్రగతికి పునాది. ఏ వైజ్ఞానిక ఆవిష్కరణైనా, సామాజిక సంస్కరణైనా, ఆధ్యాత్మిక అన్వేషణైనా ఒక ప్రశ్నతోనే మొదలవుతుంది. కానీ ఆధునిక సమాజంలో విమర్శనాత్మక ఆలోచన శక్తి తగ్గిపోతోంది. విశ్లేషణకు బదులు నమ్మకాలు, విచారణకు బదులు మూస భావాలు, ఆలోచనకు బదులు వ్యక్తి ఆరాధన పెరుగుతోంది.



విమర్శను విరోధంగా చూడటం, భిన్నాభిప్రాయాలను ద్రోహంగా పరిగణించడం – ఇవి ప్రమాదకరమైన ధోరణులు. ప్రభుత్వాల నుండి మీడియా వరకు అన్నీ భావోద్వేగాల ఆధారంగా నడుస్తున్నట్లున్నాయి. సమాచార హక్కు కోసం పోరాడిన ఉద్యమకారులపై దాడులు, వారి హత్యలు – ఇవన్నీ ప్రజాస్వామ్యపు ఆత్మను గాయపరుస్తున్న దృశ్యాలు. సోషల్ మీడియా, యూట్యూబ్, ఫేక్‌న్యూస్ ఛానెల్స్ వల్ల ప్రజల్లో ఆలోచనకంటే ప్రతిస్పందన వేగం పెరిగింది. ఆలోచన తగ్గి,ఆక్రోశం పెరిగింది. భిన్న అభిప్రాయాలపై అసహనం రోజురోజుకూ పెరుగుతోంది. ‘నేను అనుకున్నదే సత్యం’ అనే భావం మన సామాజిక సంభాషణలను విషపూరితం చేస్తోంది. రాజకీయాల్లో వ్యక్తి పూజ పరాకాష్టకు చేరింది.నాయకుడు తప్పుడు నిర్ణయం తీసుకున్నా, ఆయన అభిమానులు దానిని సమర్థించడమే కాదు, దానిని సత్యంగా నిలబెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. విధానాలపై విమర్శలు చేయడం ప్రమాదకరమని భావించే వాతావరణం నెలకొంది. ఈధోరణి ప్రజాస్వామ్య ఆత్మను మెల్లగా హరింపచేస్తోంది. విద్యా వ్యవస్థ కూడా విచారణాత్మక దృష్టిని పెంపొందించడంలో విఫలమవుతోంది.ఎలా ఆలోచించాలి? అన్న ప్రశ్నను ప్రాధాన్యంగా బోధించాల్సిన చోట, కేవలం మార్కులు సాధించే విద్యకే ప్రాధాన్యం ఇచ్చింది. ఐన్‌స్టీన్ చెప్పినట్లుగా విద్య అంటే విషయాలు తెలుసుకోవడం కాదు, ఆలోచించడం నేర్చుకోవడం. అందుకే పాఠశాలల నుంచే క్రిటికల్ థింకింగ్” అనే అంశాన్ని బోధించాలి.పిల్లలు ప్రశ్నించడానికి, విశ్లేషించడానికి, వాస్తవాలను పరిశీలించడానికి ప్రోత్సహించాలి. మూఢనమ్మకాల నిరోధక చట్టాలు, సోషల్ మీడియా నియంత్రణ చట్టాలు వంటి సంస్కరణలు కూడా అవసరం. సమాజంలో ఆలోచనాత్మక దిశను బలోపేతం చేయడం అత్యవసరం. సత్యం కోసం నిలబడే ధైర్యం ప్రజాస్వామ్యానికి ఇప్పుడు అనువార్యం. 2+2=5” అని బలవంతం చేసే ఉపాధ్యాయుడి ముందు నిలబడి ‘అది నాలుగు” అని రాసే విద్యార్థి ధైర్యం అదే విమర్శనాత్మక ఆలోచన జీవచిహ్నం.నియంతృత్వం తుపాకీతో భయపెట్టినా, సత్యం కోసం లేచిన ఆ విద్యార్థి మనసు ప్రతి మనిషిలో ఉండాలి. ఆ ధైర్యం సత్యానికి, ప్రజాస్వామ్యానికి ఆధారం. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించని మనిషి ఓ నిష్క్రియ పౌరుడుమాత్రమే. ఆలోచించని విద్యార్థి భవిష్యత్తుకే ప్రమాదం. విమర్శించని మేధావి జాతి దురదృష్టం. ప్రజాస్వామ్యం అంటే కేవలం పాలకులను ఎంచుకోవడం కాదు, వారి పనిని ప్రశ్నించడం, విశ్లేషించడం, తప్పు అయితే సరిదిద్దమని చెప్పడం కూడా పౌరుని బాధ్యత. సత్యాన్ని తెలుసుకోవడమే కాదు, దాన్ని నిలబెట్టే ధైర్యం చూపడమే ప్రజాస్వామ్యానికి అసలైన గౌరవం. మన సమాజం ప్రగతిపథంలో కొనసాగాలంటే విమర్శనాత్మక ఆలోచన సజీవంగా ఉండాలి. ఎందుకంటే ప్రజాస్వామ్యానికి, ప్రగతికి ప్రశ్నలే పట్టుకొమ్మలు, ఆలోచనే దారి చూపులు, సత్యమే శాశ్వతం. ●

# ఓట్ల కోసం డాన్స్‌కైనా మోడీ రెడీ!

- ట్రంప్ బెదరింపులవల్లే నోరుమెదపడంలేదు
- బిజెపి రిమోట్ కంట్రోల్‌లో నితీశ్ సర్కార్
- బీహార్ ఎన్నికల సభలో రాహుల్



**ముజఫర్‌పూర్, అక్టోబరు 29:** ఓట్ల కోసం ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఏదైనా చేస్తారు, బీహార్‌లోని ప్రజలు అతడిని డ్యాన్స్ చేయమని అడిగితే, ఖచ్చితంగా డ్యాన్స్ చేస్తారని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఎద్దేవా చేశారు. బీహార్‌లో నితీశ్ కుమార్ ప్రభుత్వాన్ని బిజెపి రిమోట్ కంట్రోల్ ద్వారా నడుపుతోందని ఆరోపణలు గుప్పించారు. బుధవారం ముజఫరపూర్‌లో నిర్వహించిన ఎన్నికల సభలో కూటమి సిఎం అభ్యర్థి తేజస్వి యాదవ్‌తో కలిసి రాహుల్‌గాంధీ పాల్గొని ప్రసంగించారు. "నరేంద్రమోడీ అన్ని రకాల డ్రామాలు చేయడానికి సిద్ధంగా ఉన్నారు. మిస్టర్ ప్రైమ్ మినిస్టర్ మీరు డ్యాన్స్ చేస్తే తాము మీకు ఓటేస్తామనండి. ఆ మరుక్షణమే భరత నాట్యం ప్రదర్శిస్తారు" అని ప్రధానిపై రాహుల్ విమర్శలు గుప్పించారు. బీహార్ ప్రజలు ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ప్రభుత్వాన్ని నడుపుతున్నారనే భ్రమలో ఉన్నారు, అదంతా తప్పు బిజెపి రిమోట్ కంట్రోల్‌లో నితీశ్ ఉన్నారనే విషయాన్ని గుర్తించాలన్నారు. నితీశ్ నాయకత్వం కేవలం ఒక ముసుగు మాత్రమే, నిజమైన అధికారం బిజెపి వద్ద ఉందని, అది కూడా ముగ్గురు నలుగురు వ్యక్తుల వద్దే ఉందన్నారు. పాలక ఎన్‌డిఏకు సామాజిక సమానత్వం పట్ల నిబద్ధత లేదని ఆరోపణలను పునరుద్ఘాటించారు. "ట్రంప్‌ను చూసి ప్రధాని మోడీ భయపడుతున్నారు. అమెరికా ఒత్తిడితో ఆపరేషన్ సిందూర్ ఆగిపోయిందన్న ట్రంప్ వాదనపై మోడీ ఇంత వరకు నోరు మెదపలేదు. ఈసారి ఆయన బీహార్ వచ్చినప్పుడు అమెరికా అధ్యక్షుడు భారత్ – పాక్ వివాదాన్ని ఆపడం గురించి ట్రంప్ అబద్ధం చెబుతున్నారని మోడీ చెప్పాలి" అని రాహుల్ గాంధీ ప్రధానికి సవాల్ విసిరారు. 11ఏళ్లలో మోడీ సర్కార్ నోట్ల రద్దు, లోపభూయిష్ట జిఎస్‌టి వంటి ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని రాహుల్ దుయ్యబట్టారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పట్టుబట్టడంతోనే మోడీ ప్రభుత్వం కుల గణనకు అంగీకరించిందన్నారు. మోడీ– నితీశ్ ప్రభుత్వాల దమననీతిని గుర్తెరిగి బీహార్ ప్రజలు ఈసారి స్పష్టమైన తీర్పు ఇవ్వాలని రాహుల్‌గాంధీ పిలుపునిచ్చారు.

# కచ్చాతీవును రాజకీయం చేయొద్దు!

## శ్రీలంక మంత్రి సుందరలింగం ప్రదీప్



**న్యూఢిల్లీ, అక్టోబరు 29:** కచ్చతీవు సమస్యను రాజకీయాలకు అతీతంగా చూడాలని శ్రీలంక మంత్రి సుందరలింగం ప్రదీప్ కోరారు. 1974లో భారత్, శ్రీలంక మధ్య జరిగిన ద్వైపాక్షిక ఒప్పందం ప్రకారం కచ్చతీవును తమ దేశానికి అప్పగించారని గుర్తు చేసుకున్నారు. అంతర్జాతీయ ఒప్పందం ద్వారా చట్టపరంగానే భారత్ తమ దేశానికి కచ్చతీవును అప్పగించిందని పేర్కొన్నారు. భారత్ నుంచి శ్రీలంక కచ్చతీవును బలవంతంగా లాక్కోలేదని వెల్లడించారు. ఎన్నికల సమయంలో కచ్చతీవు సమస్య గురించి మాట్లాడే రాజకీయ నాయకుల ప్రకటనలను ప్రజలు గ్రహించాలని కోరారు. భారత్, శ్రీలంక మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. కచ్చతీవు వంటి సమస్యలు ఇరుదేశాల మధ్య సంబంధాలను దెబ్బతీయకూడదని రెండు దేశాల మత్స్యకారులపై సముద్ర వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. మత్స్యకారుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి భారత్, శ్రీలంక ప్రభుత్వాలు కూర్చొని మాట్లాడుకోవడం ఉత్తమం. మత్స్యకారుల సమస్యను సోదర సమస్యలా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి. శ్రీలంక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు తమకు సహాయం చేసిన తొలి దేశం భారత్. తమ దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నప్పుడు కూడా భారత్ అండగా నిలిచింది. అందుకు భారత్‌కు మేం ఇప్పటికీ కృతజ్ఞులం. చర్చల ద్వారా మనం ఏ సమస్యనైనా పరిష్కరించుకోవచ్చని ప్రదీప్ అన్నారు. తమిళనాడు మత్స్యకారులపై దాడులు, వారి అరెస్టుల గురించి అడిగిన ప్రశ్నకు ప్రదీప్ సమాధానం ఇచ్చారు. రెండు దేశాలు చర్చలు జరిపితేనే ఈ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. భారత్, శ్రీలంక ప్రభుత్వాలు చాలా కాలంగా సరిహద్దు దాటి చేపలు పడుతున్న మత్స్యకారులను అరెస్టు చేస్తున్నాయని గుర్తు చేసుకున్నారు. భారత్, శ్రీలంక మత్స్యకారులు తమ మధ్య అవగాహన కుర్చుకోవాలని వెల్లడించారు.

'రాజకీయ లబ్ధి, ఎన్నికల కోసం మాట్లాడకుండా మత్స్యకారుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి ఏకైక మార్గం రెండు దేశాల ప్రభుత్వాలు చర్చలు జరపడమే. భారత్, శ్రీలంక మధ్య ప్రస్తుతం సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. చర్చల ద్వారా మాత్రమే మత్స్యకారుల సమస్యను పరిష్కరించవచ్చు. సోదరసోదరి సమస్యలానే మత్స్యకారుల సమస్యను కూడా కూర్చుని మాట్లాడుకోవడం ద్వారా పరిష్కరించాలి. బదులుగా, మనం రాజకీయాల కోసం ఏదైనా మాట్లాడితే, అది సమస్యను మరింత జఠిలం చేస్తుంది. "అని ప్రదీప్ పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోపే శబరిమల యాత్రను పవిత్ర యాత్రగా ప్రకటించాం. శబరిమల యాత్రను పవిత్ర యాత్రగా ప్రకటించిన ప్రపంచంలోని ఏకైక దేశం శ్రీలంక. అంతే కాదు, తమిళ ముస్లింల సంస్కృతి, మత స్వేచ్ఛకు ప్రాముఖ్యత ఇస్తున్నామని శ్రీలంక మంత్రి పదీప్ అన్నారు.

# ట్రంప్‌కు దక్షిణకొరియా అత్యున్నత పురస్కారం

## సిల్లా చరిత్రకు ప్రతీకగా నిలిచిన బంగారు కిరీటం బహూకరణ



**సియోల్, అక్టోబరు 29:** స్వదేశంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ వ్యతిరేక పవనాలు ఎదుర్కొంటుంటే విదేశాల్లో మాత్రం ఆయనకు పట్టం కడుతున్నారు. నోకింగ్స్ ఏరిట అమెరికాలో ట్రంప్ నిరసనలు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. అయితే ఆసియా పసిఫిక్ ఆర్థికసహకార సంఘ సమావేశాల్లో పాల్గొనేందుకు దక్షిణకొరియాకు వచ్చిన అమెరికా అధ్యక్షుడికి ఆదేశ అత్యున్నత పురస్కారం అందించింది. దేశ అధ్యక్షుడు లీజాయ్ మ్యూంగ్ అమెరికాతో 350 బిలియన్ డాలర్ల వాణిజ్య డీల్ సక్సెస్ అయిన సందర్భంగా దక్షిణకొరియానేత ఈ అత్యున్నత పురస్కారం అందించారు. అమెరికా, దక్షిణకొరియాలమధ్య సుదీర్ఘ పెట్టుబడులతోకూడిన వాణిజ్య ఒప్పందం కుదిరిందని, పెట్టుబడులు, నౌకా నిర్మాణాలకు డీల్ కుదిరినట్లు దక్షిణకొరియా ప్రకటించింది.

అలాగే అమెరికాకు దక్షిణకొరియా ఆర్థికపరంగా 350 బిలియన్ డాలర్లమేర పెట్టాలని నిర్ణయించింది. 200 బిలియన్ డాలర్లునగదు పెట్టుబడులు, 150 బిలియన్ డాలర్లు నౌకా నిర్మాణంలో సహకారం అందిస్తుందని కిమ్‌జాయే మ్యూన్ తెలిపారు. ప్రస్తుతంఅమెరికా అధ్యక్షుడికి బహూకరించిన కిరీటం గతంలో ప్రాచీన సిల్లా సామ్రాజ్యలో శాంతిస్థాపనకు బహూకరించిన కిరీటానికి ప్రతిరూపంగా ఉంటుంది. ప్రాచీనకాలంలో గ్యాయంగ్‌ఝు రాజధానిగా సిల్లా సామ్రాజ్యం నడిచింది. ఈ కిరీటాన్ని 'గ్రాండ్ ఆర్డర్ ఆఫ్ ముగుంగ్వా'గా అందిస్తారు. కొరియాకు సంబంధించి అత్యున్నత పురస్కారంగా భావిస్తారు. కొరియా అధికారిక పుష్పం ఎర్ర మందారంకూడా ఈ పురస్కారంపై చెక్కుతారు. కొరియా ద్వీపకల్పంలో శాంతిని నెలకొల్పి నందుకుగాను సిల్లా సామ్రాజ్య చరిత్రకాలంలో ఈ పురస్కారం ప్రధానంచేసేవారు. ఎనిమిదియ యుద్ధాలు నివారించానని చెపుతున్న ట్రంప్ శాంతిస్థాపనకు విశేష కృషిచేసారని గుర్తింపుగా ఈ అత్యున్నత కిరీట పురస్కారం ప్రధానంచేస్తున్నట్లు దక్షిణకొరియా ప్రకటించింది. అలాగే అమెరికా అధ్యక్షుడి పర్యటన సందర్భంగా భారీ ఎత్తున విందును కూడా ఏర్పాటుచేసింది.

ఈ విందుకు వియత్నాం, ఆస్ట్రే లియా, న్యూజిలాండ్, కెనడా, థాయిలాండ్, సింగపూర్‌నేతలు కూడా హాజరవుతున్నారు.

# సిఎం, పిఎం పోస్టులు ఖాళీ లేవు

## - సోనియా, లాలూపై అమిత్ షా సెటైర్లు



**దర్భంగా, అక్టోబరు 29:** ఆర్‌జెడి అధినేత లాలూప్రసాద్ యాదవ్, కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ తమ కుమారులను బీహార్ ముఖ్యమంత్రి, ప్రధానమంత్రిని చేయాలని కలలు కంటున్నారని, కానీ ఆ పదవులు ఖాళీగా లేవని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎద్దేవా చేశారు. రాజకీయాల్లో ప్రస్తుతం ఏ సీటు ఖాళీగా లేదని ఆయన స్పష్టం చేశారు. నితీశ్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా కొనసాగుతారని, కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా ఉంటారని తేల్చి చెప్పారు. బీహార్‌లోని దర్భంగాలో బుధవారం నిర్వహించిన ఎన్నికల సభలో అమిత్ షా మాట్లాడుతూ, ఆర్‌జెడి, కాంగ్రెస్ పార్టీలు వారసత్వ రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. లాలూ ప్రసాద్ యాదవ్ తన తనయుడిని ముఖ్యమంత్రిగా చేయాలని చూస్తే, సోనియా గాంధీ తన కొడుకును ప్రధాన మంత్రిని చేయాలనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి చాలా మంది యువకులకు టిక్కెట్లు ఇచ్చింది, కానీ ఆర్‌జెడి, కాంగ్రెస్ ఇవ్వలేదని విమర్శలు గుప్పించారు. అది మహాఘట్ బంధన్ కాదు దొంగ బంధన్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అరెస్ట్ చేసిన పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పిఎఫ్ఐ) సంస్థకు చెందిన కార్యకర్తలను మహాగర్ బంధన్ బీహార్‌లో అధికారంలోకి వస్తే జైలులోనే ఉంటారా? అని ప్రశ్నించారు. పట్నాలోని ఫుల్వారీ షరీఫ్‌లో పిఎఫ్ఐ కార్యకర్తలు చురుకుగా ఉన్నారని ఆరోపించారు. తేజస్వి, రాహుల్ బీహార్‌లో జంగిల్ రాజ్ తిరిగి తీసుకురావడానికి యత్నిస్తున్నారని, ఆ అవకాశం ఇవ్వొద్దని అమిత్ షా పిలుపునిచ్చారు. ఎన్‌డిఏ ప్రభుత్వం బీహార్‌లోని 8.52 కోట్ల మందికి ఉచిత రేషన్ ఇస్తున్నదని, మఖానా బోర్డును ఏర్పాటు చేసిందని అమిత్ షా తెలిపారు. గృహ వినియోగదారులకు 125 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తోందని గుర్తు చేశారు. దర్భాంగాకు త్వరలో మెట్రో రైలు వస్తుందని, ఇప్పటికే విమానాశ్రయం నిర్మితమైందని పేర్కొన్నారు. ఎయిమ్స్ నిర్మాణ దశలో ఉందని వెల్లడించారు. మిథిలాలో సీతాదేవి ఆలయం నిర్మిస్తున్నామని, ఆమె సందర్శించిన అన్ని ప్రదేశాలు రామ్ సర్క్యూట్‌కు అనుసంధానిస్తామని హామీ ఇచ్చారు.

# మాకు డబ్బు ముఖ్యం కాదు

## విజయ్‌కు సొమ్ము తిప్పిపంపిన మృతుని భార్య



**కరూర్, అక్టోబరు 29:** కరూర్ తొక్కిసలాటలో భర్తను కోల్పోయిన ఓ మహిళ టీవీకే అధినేత, నటుడు విజయ్ తీరును తీవ్రంగా తప్పుబట్టింది. తమకు డబ్బు ముఖ్యం కాదని చెబుతూ విజయ్ తమ ఖాతాలో జమ చేసిన రూ.20 లక్షలను తిప్పి పంపించింది. విజయ్ నుంచి తాము ఓదార్పు కోరుకున్నాం తప్ప డబ్బు కాదని చెప్పారు. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం సెప్టెంబర్ 27న కరూర్ లో నిర్వహించిన విజయ్ ర్యాలీలో తొక్కిసలాట జరిగి 41 మంది చనిపోయిన విషయం తెలిసిందే. మరణించిన వారిలో రమేశ్ కూడా ఒకరు. తొక్కిసలాట జరిగిన కొద్ది రోజులకు విజయ్ తమతో వీడియో కాల్ లో మాట్లాడారని రమేశ్ భార్య సంఘవి తెలిపారు. నేరుగా వచ్చి పరామర్శిస్తానని, ముందుగా పరిహారం తీసుకోవాలని విజయ్ కోరారన్నారు. ఈ నెల 18న తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ తరఫున తమ బ్యాంకు ఖాతాలో రూ.20 లక్షలు జమ అయిందని వివరించారు. అయితే, తమకు డబ్బు ముఖ్యం కాదని, విజయ్ పరామర్శ కోసం ఎదురుచూశామని సంఘవి చెప్పారు. తాజాగా కరూర్ తొక్కిసలాట బాధిత కుటుంబాలను విజయ్ చెన్నైకి పిలిపించుకుని ఓ రిసార్ట్ లో సమావేశమయ్యారని సంఘవి గుర్తుచేశారు. ఆ సమావేశానికి తాము వెళ్లలేదని, తమ పేరు చెప్పుకుని తమ బంధువులు వెళ్లారని సంఘవి ఆరోపించారు. విజయ్ పరామర్శిస్తారని భావిస్తే డబ్బు పంపారని, ఆ డబ్బు తమకు అక్కర్లేదని తిప్పి పంపామని సంఘవి వివరించారు. డబ్బు తిప్పి పంపిన రశీదును ఆమె మీడియాకు చూపించారు.

# అబూదాబి లాటరీలో భారతీయుడికి రూ.240 కోట్లు




**అబూదాబి, అక్టోబరు 29:** అబుదాబిలో నివసిస్తున్న ఏపీకి చెందిన ఓ తెలుగు యువకుడిని అదృష్టం వరించింది. అమ్మపై ఉన్న ప్రేమ అతడిని రాత్రికి రాత్రే కోటీశ్వరుణ్ని చేసింది. యూఏఈ లాటరీ చరిత్రలోనే అతిపెద్ద జాక్‌పాట్‌గా నిలిచిన 100 మిలియన్ దిర్హామ్‌లను (సుమారు రూ. 240 కోట్లు) గెలుచుకుని వార్తల్లో నిలిచారు. ఆ అదృష్టవంతుడి పేరు అనిల్‌కుమార్ బోళ్ల (29). చాలాకాలంగా అబుదాబిలో ఉంటున్న అనిల్‌కుమార్‌కు లాటరీ టికెట్లు కొనే అలవాటు ఉంది. ఈ క్రమంలోనే ఈ నెల 18న జరిగిన లక్కీ డే డ్రాలో ఆయన విజేతగా నిలిచారు. తనకు జాక్‌పాట్ తగిలిన విషయాన్ని మొదట నమ్మలేకపోయానని ఆయన తెలిపారు. జాక్‌పాట్ గెలిచారంటూ కాల్ వచ్చినప్పుడు వెంటనే నమ్మలేకపోయాను. ఈ రోజుకూ ఇది నిజమా కాదా అనిపిస్తోంది అని అనిల్ తన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. తన విజయ రహస్యాన్ని పంచుకుంటూ, ఇందులో నా ప్రత్యేకత ఏమీ లేదు. అందరిలానే టికెట్ కొన్నాను. కానీ, అందులో ఆఖరి నంబరు చాలా ప్రత్యేకం. మా అమ్మ పుట్టినరోజునే ఆ నంబరుగా ఎంచుకున్నాను అని చెక్కు అందుకున్న సందర్భంగా అనిల్ వివరించారు. ఈ భారీ మొత్తాన్ని ఏం చేయబోతున్నారని అడగ్గా, తెలివైన పెట్టుబడులు పెట్టడంతో పాటు తన చిరకాల కోరికైన సూపర్ కారు కొంటానని చెప్పారు. కుటుంబసభ్యులను యూఏఈకి తీసుకొచ్చి వారితో కలిసి ఇక్కడే స్థిరపడతానని, వారి కోరికలు తీరుస్తానని తెలిపారు.

అలాగే, గెలిచిన డబ్బులో కొంత భాగాన్ని ఛారిటీలకు విరాళంగా ఇస్తానని తన దాతృత్వాన్ని చాటుకున్నారు. యూఏఈలో లాటరీపై ఎలాంటి ఆదాయపు పన్ను ఉండదు. దీంతో అనిల్ పూర్తి మొత్తాన్ని, అంటే రూ. 240 కోట్లను పన్ను చెల్లించకుండానే అందుకుంటారు. అదే భారత్‌లో ఎవరైనా ఇంత పెద్ద మొత్తం గెలిస్తే, దాదాపు 30 శాతం ఫ్లాట్ పన్ను, సర్‌చార్జ్, సెస్ రూపంలో సుమారు రూ. 86 కోట్లకు పైగా ప్రభుత్వానికి చెల్లించాల్సి వచ్చేది. పన్నులన్నీ పోగా, విజేతకు దాదాపు రూ. 154 కోట్లు మాత్రమే చేతికి అందేవి. కాగా, ఇదే డ్రాలో మరో 10 మంది కూడా తలా 10 వేల దిర్హామ్‌లు (రూ. 24 లక్షలు) గెలుచుకోవడం విశేషం.

# ప్రపంచశాంతికి భారత్, జపాన్ సంబంధాలు కీలకం

## - జపాన్ కొత్త ప్రధాని తకైచితోఫోన్‌లో అభినందనలు తెలిపిన ప్రధాని మోడీ





**న్యూఢిల్లీ, అక్టోబరు 29:** భారత్ –జపాన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య, రక్షణ రంగంలో సహకార సంబంధాలను మెరుగుపరుచుకోవడంపై దృష్టి సారిస్తామని తెలిపారు. భారత్–జపాన్ సంబంధాలు ప్రపంచ శాంతి, స్థిరత్వం, సమృద్ధికి కీలకంగా వ్యవహరిస్తాయని పేర్కొన్నారు. ఈ మేరకు జపాన్ ప్రధాని సనాయి తకైచితో జరిగిన సంభాషణను ఎక్స్ వేదికగా మోడీ పంచుకున్నారు. జపాన్ తొలి మహిళా ప్రధానిగా ఎన్నికై పదవీ బాధ్యతలు చేపట్టిన తకైచికి అభినందనలు తెలియజేశారు. "జపాన్ ప్రధాని సనాయె తకైచితో ఆత్మీయ సంభాషణ జరిగింది. దేశంలో అత్యుననత పదవిని చేపట్టిన తొలి మహిళగా ఆమెకు అభినందనలు తెలియజేశాను. న్యూఢిల్లీ– టోక్యో మధ్య లోతైన భాగస్వామ్యాన్ని నొక్కిచెప్పిన ఈ చర్చ, ఆర్థిక భద్రత, రక్షణ సహకారంపై సాగింది. ప్రపంచ శాంతి, స్థిరత్వం, సమృద్ధి కోసం ఇరుదేశాల సంబంధాలు చాలా ముఖ్యమని అంగీకరించాం" అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎక్స్‌లో రాసుకొచ్చారు. మరోవైపు "జపాన్– భారత్ ప్రత్యేక వ్యూహాత్మక, ప్రపంచ భాగస్వామ్యాన్ని మరింతగా ప్రోత్సహించడం కోసం మీతో కలిసి పని చేయాలని కోరుకుంటున్నాం" అని సనాయె తకైచి పోస్ట్ చేశారు. "భారత ప్రధానమంత్రితో ఆహ్లాదకరమైన సంభాషణ జరిగింది. జపాన్ ప్రధానమంత్రిగా నా నియామకంపై ఆయన అభినందన సందేశానికి చాలా కృతజ్ఞుడను. ఆయనతో కలిసి జపాన్– భారత్ ప్రత్యేక వ్యూహాత్మక, ప్రపంచ బాగస్వామ్యంలో ఒక కొత్త సువర్ణ అధ్యాయాన్ని ప్రారంభించాలని అనుకుంటున్నా" అంటూ తకైసి రాసుకొచ్చారు.

# తప్పుడు అభియోగాలతో శిక్ష అనుభవిస్తే నిర్దోషులకు ప్రభుత్వ పరిహారం

## పరిశీలిస్తున్న సుప్రీం



**న్యూఢిల్లీ, అక్టోబరు 29:** తప్పుడు అభియోగాలతో అన్యాయంగా జైలు శిక్ష అనుభవించిన నిర్దోషులకు నష్టపరిహారం చెల్లించే అంశంపై సుప్రీంకోర్టు తీవ్రంగా దృష్టి సారించింది. వ్యవస్థ తప్పిదాల వల్ల బలిపశువుగా మారిన వ్యక్తి, విలువైన జీవితాన్ని కోల్పోయినప్పుడు పరిహారం అందించేందుకు ఒక పటిష్ఠమైన విధానాన్ని రూపొందించే అవకాశాలను పరిశీలిస్తోంది. ఈ ప్రక్రియలో ఉన్న చట్టపరమైన సంక్లిష్టతలను అధిగమించేందుకు తమకు సహాయం చేయాల్సిందిగా అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్‌లను కోరింది.

జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. మైనర్ బాలికపై అత్యాచారం, హత్య కేసులో తప్పుడు ఆరోపణలతో 12 ఏళ్ల జైలు జీవితం గడిపిన ఓ నిరుపేద వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ అంశం చర్చకు వచ్చింది. ఈ కేసులో థానే కోర్టు అతనికి 2019లో మరణశిక్ష విధించింది. అయితే, సుదీర్ఘ విచారణ అనంతరం సుప్రీంకోర్టు అతన్ని నిర్దోషిగా తేల్చి ఇటీవల విడుదల చేసింది. ఈ నేపథ్యంలో తాను కోల్పోయిన 12 ఏళ్ల జీవితానికి పరిహారం ఇప్పించాలని కోరుతూ బాధితుడు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. బాధితుడి తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ సుబ్రహ్మణ్యం వాదనలు వినిపించారు. ఇలాంటి కేసుల్లో బాధితులకు నష్టపరిహారం చెల్లించాల్సిన అవసరం ఉంది. జైలు జీవితం వారి ప్రాథమిక హక్కులను కాలరాయడమే. దీనిపై కోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని ఆయన కోరారు. ఈ అంశంపై ఒక స్థిరమైన ఏర్పాటు అవసరమని గతంలో లా కమిషన్ కూడా సిఫార్సు చేసిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.

ఈ సందర్భంగా ధర్మాసనం దేశంలో శిక్షలు పడుతున్న కేసుల శాతం కేవలం 54గా ఉండటాన్ని గుర్తుచేసింది.

తప్పుడు సాక్ష్యాలు సృష్టించడం లేదా వ్యవస్థ బాధితుడిని బలిపశువును చేయడం వంటి సందర్భాల్లో పరిహారం అంశాన్ని పరిగణించాలని భావిస్తున్నట్లు ధర్మాసనం సూచనప్రాయంగా తెలిపింది.

ఇదే ధర్మాసనం, మానసిక వైద్య చట్టం 2017 అమలుపై దాఖలైన మరో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)కి బదిలీ చేసింది.

# సంక్షిప్తంగా..

## కర్ణాటక పోలీసులకు కొత్త టోపీలు



**బెంగళూరు, అక్టోబరు 29:** రాష్ట్రంలో పోలీసులు వాడుతున్న క్యాప్‌ను మార్చాలని నేనే సూచించానని సీఎం సిద్ధరామయ్య అన్నారు. విధానసౌధలో కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లకు కొత్త టోపీల పంపిణీకి ఆయన శ్రీకారం చుట్టారు. పీక్ క్యాప్‌ను కానిస్టేబుళ్లకు ధరింపచేసి ఎలా ఉన్నాయంటూ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ 1956 నుంచి స్లోచ్ క్యాప్‌లను వాడుతున్నారన్నారు. 70ఏళ్లుగా ఉన్న విధానంలో మార్పు తీసుకొచ్చామన్నారు. అధికారులు, పోలీసులు ఒకే విధమైన క్యాప్ ధరించడం సంతోషంగా ఉందని చెప్పారు. రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చాలనేది తన ఆశయమని సీఎం సిద్ధరామయ్య అన్నారు.

## బిజెపి నేత హత్యకేసులో నిందితుల అరెస్టు

**భోపాల్, అక్టోబర్ 29:** బీజేపీ నేతను హత్య చేసిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నాటకీయ ఎన్‌కౌంటర్ తర్వాత వారిని అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ కాల్పుల్లో గాయపడిన హంతకులను హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో కాట్ని జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బీజేపీ జిల్లా పిచ్డా మోర్చా మండల అధ్యక్షుడు నీలేష్ రజక్ మంగళవారం హత్యకు గురయ్యారు. కైమోర్‌లోని మార్కెట్ వద్ద బైక్‌పై వెళ్తుండగా ఈ సంఘటన జరిగింది. బైక్‌పై వచ్చిన ముసుగు ధరించిన ఇద్దరు వ్యక్తులు గన్‌తో కాల్పులు జరిపి రజక్‌ను హత్య చేశారు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలించారు. అక్రమ్ ఖాన్, ప్రిన్స్ జోసెఫ్‌లను నిందితులుగా గుర్తించారు. కాట్నిలోని కజ్రావారా సమీపంలో హైస్పీడ్ ఛేజింగ్ తర్వాత పోలీసులు వారిని చుట్టుముట్టారు. నిందితులు కాల్పులు జరుపగా ప్రతిగా కాల్పులు జరిపారు.

## భారత్, పాక్ ఘర్షణల్లో కూలిపోయిన ఏడు కొత్త విమానాలు

**టోక్యో, అక్టోబరు 29:** భారత్, పాకిస్థాన్ మధ్య ఘర్షణల్లో ఏడు కొత్త విమానాలు కూలిపోయినట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. అయితే ఆ విమానాలు ఏ దేశానికి చెందినవో ఆయన స్పష్టం చేయలేదు. రెండు న్యూక్లియర్ పవర్ దేశాల మధ్య రగిలిన చిచ్చును వాణిజ్యంతో ఆపేసినట్లు ట్రంప్ మరో సారి పేర్కొన్నారు. టోక్యోలో వ్యాపారవేత్తలతో జరిగిన డిన్నర్ పార్టీలో ట్రంప్ ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఏడు విమానాలను కూల్చేశారని, ఏడు విమానాలు కొత్తవే అని, అందమైన ఆ విమానాలను నేలకూల్చారని, రెండు అణ్వాయుధ దేశాలు ఆ ఫైట్‌లో నిమగ్నమైనట్లు ట్రంప్ చెప్పారు. అయితే పాకిస్థాన్, భారత్ మధ్య మొదలైన యుద్ధానికి వాణిజ్యంతో బ్రేక్ వేసినట్లు ట్రంప్ తెలిపారు. భారత్‌తో ట్రేడ్ డీల్ చేస్తున్నానని, ప్రధాని మోదీ పట్ల తనకు ప్రేమ, గౌరవం ఉందన్నారు. తమ మధ్య మంచి రిలేషన్ ఉందన్నారు.

## రజనీకాంత్ రిటైర్మెంట్ ప్రకటిస్తున్నారా?



**చెన్నై, అక్టోబరు 29:** భారతీయ సినీ పరిశ్రమలో సూపర్‌స్టార్ అనే పదానికి చిరునామాగా నిలిచిన రజనీకాంత్ సినిమాల నుంచి తప్పుకోనున్నారంటూ ఆయన రిటైర్మెంట్‌పై కోలీవుడ్ వర్గాల్లో మరోసారి జోరుగా చర్చ జరుగుతోంది.

75 ఏళ్ల వయసులోనూ యువ హీరోలతో పోటీపడుతూ బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్న తలైవా, త్వరలోనే నటనకు స్వస్తి పలకనున్నారనే వార్తలు ఆయన అభిమానులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రస్తుతం రజినీకాంత్ జైలర్ చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న జైలర్ 2 షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా తర్వాత గతంలో అరుణాచలం వంటి బ్లాక్‌బస్టర్ అందించిన దర్శకుడు సుందర్ సి దర్శకత్వంలో ఓ ప్రాజెక్టుకు అంగీకరించినట్లు సమాచారం.

## కాంగ్రెస్ సమావేశంలో బంగ్లా జాతీయ గీతం ఆలాపన!

**గువాహతి, అక్టోబరు 29:** అసోంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆ పార్టీ నేత బంగ్లాదేశ్ జాతీయ గీతాన్ని ఆలపించడం తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. కరీంగంజ్ జిల్లాలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో, భారతీయ జనతా పార్టీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తోంది. కరీంగంజ్‌లో జరిగిన కాంగ్రెస్ సేవాదళ్ సమావేశంలో పార్టీ నేత బిదు భూషణ్ దాస్ బంగ్లాదేశ్ జాతీయ గీతమైన అమర్ సోనార్ బంగ్లాను పాడారు. ఈ దృశ్యాలు వీడియో రూపంలో సోషల్ మీడియాలో విస్తృతంగా వ్యాపించాయి. దీనిపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఇది చొరబాటుదారుల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న ప్రేమను తెలియజేస్తోందని ఘాటుగా విమర్శించింది. ఈ ఘటనపై అసోం మంత్రి కృష్ణేందు పాల్ స్పందిస్తూ, ఇది చాలా వింతైన సంఘటన అన్నారు.

# అబద్ధాలు, అభివృద్ధి మధ్య జూబ్లీహిల్స్‌లో పోరు

## ప్రయాణించే బండి కావాలా? మూలనపడ్డ కారుకావాలా?: మంత్రి పొన్నం ప్రభాకర్




బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, అక్టోబరు 29,ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ అభివృద్ధి అధికార కాంగ్రెస్‌తోనే సాధ్యమని, త్వరలో జరుగబోయే ఉప ఎన్నిక ఇద్దరు వ్యక్తుల మధ్య కాదని కాంగ్రెస్ అభివృద్ధికి,బిఆర్ఎస్ అబద్దాలకు మధ్య జరుగుతుందని మీకు అభివృద్ధి కావాలా? అబద్దాలు కావాలా ?తేల్చుకోవాలని తెలంగాణ రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం గాంధీ భవన్‌లో కాంగ్రెస్ నేతలు వరంజ్ కౌశిక్ యాదవ్ ,బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, భాస్కర్‌లతో కలిసి మంత్రి మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. ప్రజా పాలన ప్రభుత్వం లో సంక్షేమం అభివృద్ధికి ప్రజలు పట్టం కడుతున్నారని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. అధికారంలో కాంగ్రెస్ పార్టీ ఉందనీ బిఆర్ఎస్ కేంద్రంలో కానీ, రాష్ట్రంలోగానీ అధికారంలేని ఆ పార్టీకి ఓటేస్తే ఉపయోగం లేదని హితవు పలికారు. ప్రయాణించే బండి ఎక్కాలి,కానీ మూలనపడ్డ కారు ఎక్కితే మీరు ముందుకు పోలేరని సలహా ఇచ్చారు. జూబ్లీహిల్స్ లో బండలను కరిగించి పేదలకి ఇండ్ల పట్టాలు, ఇండ్లు కట్టించి ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయే అని ఆయన గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 2.40లక్షల మందికి సన్న బియ్యం పంపిణీ జరుగుతోందని 200 యూనిట్ల ఉచిత విద్యుత్ 500 కి గ్యాస్ అందిస్తున్నామనీ చెప్పారు. యువతకు 80 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు.బిఆర్ఎస్ 10 సంవత్సరాలుగా చేసిన అభివృద్ధి చెప్పకుండా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. ఓటు చోరీ అంశాన్ని లేవనెత్తింది రాహుల్ గాంధీ ఇక్కడ బిఆర్ఎస్ బిజెపి కలిసి డైవర్షన్ పాలిటిక్స్ ఓటు చోరీ పై మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మా అభ్యర్థి బిసి బిడ్డ విద్యావంతుడు నిత్యం ప్రజల్లో ఉండే నవీన్ యాదవ్ ను రౌడీ అంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బిఆర్ఎస్‌వాళ్ళుబుట్టలో ప్రయాణం చేస్తూ రాజకీయ డ్రామాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

2012 తరువాత నగరంలో ఒక్క ఆటోకి పర్మిట్ ఇవ్వలేదని అప్పుడు బొత్స సత్యనారాయణ ఇచ్చినవి తప్ప మళ్ళీ ఇవ్వలేదని ఆయన వివరించారు. మేము 20 వేల ఎలక్ట్రిక్ ఆటో లకు అనుమతి ఇచ్చామని10 వేల సిఎన్‌జి 10 వేలు ఎల్‌పిజి ఆటో లకు అనుమతి ఇచ్చామని ఆయన వివరించారు. బిఆర్ఎస్ పార్టీ బహిష్కృత నేత కవిత అడుగుతున్న ప్రశ్నలకు జవాబులు చెప్పి ఓట్లు అడగాలని మంత్రి సూచించారు.10 సంవత్సరాల్లో మీ పార్టీ,2 సంవత్సరాల్లో మేము ఏం చేశామో చర్చిద్దామని సవాల్ విసిరారు. బలహీన వర్గాల అభ్యర్థి నవీన్ యాదవ్ కు భవిష్యత్ లో కూడా మద్దతుగా ఉంటామని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉన్న కేంద్ర మంత్రి 10 ఏళ్లలో ఈ నియోజకవర్గానికి ఏం చేశారని ప్రశ్నించారు.

రామచంద్రరావు రాష్ట్ర బిజెపి అధ్యక్షుడా? యూసుఫ్ గూడ డివిజన్ అధ్యక్షుడా? అని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీ అన్నట్లు బిఆర్ఎస్ బిజెపి కలిసి పని చేస్తున్నాయనీ విమర్శించారు.

## లో కాజ్‌వేలు, కల్వర్టులు వద్ద వాహనదారులను అప్రమత్తం చేయండి

### ఆర్అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**హైదరాబాద్, అక్టోబరు 29,ప్రభాతవార్త:** మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలో కురుస్తున్న భారీవర్షాలకు అనేక చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయని లోకాజ్‌వే, కల్వర్టులపై వెళ్ళే వాహనదారులను అప్రమత్తంగా ఉండేలా రోడ్లు భవనాల శాఖ అధికారులు చర్యలు తీసుకొని ప్రమాదాల నివారణకు పూను కోవాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి వెంకట్ రెడ్డి ఆదేశించారు. బుధవారం ఆర్ అండ్ బి ఇఎన్‌సి లు,సి.ఇ.లు,ఎస్ఇ లతో మంత్రి ఫోన్లో సమీక్ష నిర్వహించారు. ఆర్ అండ్ బి అధికారులు ప్రతి ఒక్కరు ఫీల్డ్ లెవెల్‌లో హై అలెర్ట్‌గా ఉండాలని ఆదేశించారు. అత్యవసరం అయితే తప్పా ఎవరూ సెలవుపై వెళ్లొద్దని మంత్రి స్పష్టం చేశారు. లో కాజ్ వేలు,కల్వర్టుల వద్ద ప్రమాద హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేయాలనీ కోరారు.ప్రజలను అప్రమత్తం చేయడానికి పోలీసు,రెవెన్యూ, విద్యుత్, ఇరిగేషన్, పిఆర్ శాఖ లతో సమన్వయం చేసుకోవాల న్నారు.ఆర్ అండ్ బి ప్రధాన కార్యాలయంలో ఇప్పటికే ఏర్పాటు చేసిన కంట్రోల్ సెంటర్ అన్ని జిల్లాలతో అనుసంధానం చేయాలని సూచించారు. ఎమర్జెన్సీ ప్రజా రవాణాకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయమార్గాలు చూపాలని,అందుకు తగ్గ చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. మొంథా తుఫాను కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అత్యవసరమైతేనే ప్రజలు రోడ్లపైకి రావాలనీ, అధికారులు సూచించే జాగ్రత్తలు పాటించాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## జూబ్లీహిల్స్‌లో అభివృద్ధి అజెండాతోనే ప్రచారం

### అక్కడ లక్ష మందిని మించిన లబ్ధిదారులు

### ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కార్యాలయ ప్రకటన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,అక్టోబరు29:** డెవెలప్‌మెంట్ నినాదంతో ప్రజా ప్రభుత్వం జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ముందంజలో ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కార్యాలయం తెలిపింది. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ నియోజకవర్గంలో మొత్తం 3.98 లక్షల మంది ఓటర్లున్నారు.నియోజకవర్గంలోని దాదాపు లక్ష కుటుంబాలు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందుతున్నారు.ఆరు గ్యారంటీలతో పాటు సన్న బియ్యం పథకాలు, ప్రభుత్వం అమలు చేసిన పథకాలన్నీ ఇక్కడ అధికార పార్టీకి నమ్మకమైన ఓటు బ్యాంకుగా మారాయి. నియోజకవర్గంలో 200 యూనిట్లలోపు ఉచిత గృహ విద్యుత్తు లబ్ధిదారులు 25,925 కుటుంబాలు.రూ.500 లకు గ్యాస్ సిలిండర్ లబ్ధిదారులు 19,658 కుటుంబాలు. ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణంతో 2023 డిసెంబర్ 9 నుంచి ఇప్పటివరకు హైదరాబాద్‌లో కోటి మందికిపైగా జీరో టికెట్‌పై ప్రయాణించారు. దాదాపు రూ.2410 కోట్లు ఆదా చేసుకున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధి లోని మహిళలు దాదాపు రూ.120 కోట్లు ఆదా చేసుకున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 14,197 కొత్తరేషన్ కార్డులు జారీ చేసింది. ఇప్పటికే ఉన్న రేషన్ కార్డుల్లో అదనంగా 8,123 మంది పేర్లను నమోదు చేసింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రజా ప్రభుత్వం స్పెషల్ డెవెలప్ మెంట్ ఫండ్ (ఎస్‌డిఎఫ్) కింద రూ. 5.51 కోట్లతో చేపట్టిన రోడ్ల నిర్మాణం, మౌలిక వసతుల అభివృద్ధి పనులు నిర్మాణంలో ఉన్నాయి. కొత్తగా పవర్ ట్రాన్స్ ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు, 11 కేవీ ఫీడర్లు, దాదాపు 13 కిలోమీటర్ల మేరకు ఎల్ టీ లైన్ అధునీకరణ పనులను రూ.11 కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ నియోజకవర్గంలో రూ.162 కోట్లతో అండర్ గ్రౌండ్ విద్యుత్తు లైన్ వేయాలని జీహెచ్‌ఎంసీ ప్రతిపాదనలను సిద్ధం చేసింది.

## విలువలతో కూడిన విద్యను అందించాలి

### గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



బుధవారం హబ్సిగూడలో జరిగిన కౌన్సిల్ ఆఫ్ బోర్డ్స్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ 54వ వార్షిక సమావేశాన్ని ప్రారంభిస్తున్న గవర్నర్ బిష్ణుదేవ్ వర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి యోగితా రాణా తదితరులు

**హైదరాబాద్ (ఉప్పల్), అక్టోబరు 29 ప్రభాతవార్త :** సాంకేతికతను, కాలానుగుణ మానవ సూత్రాలతో సమన్వయం చేసే విలువలతో కూడిన విద్యా వ్యవస్థను రూపొందించాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ కోరారు. భారతదేశంలో సాంస్కృతిక సుసంపన్నమైన విలువతో కూడిన విద్యను అందిం చాలని ఆయన సూచించారు. ఈ మేరకు బుధవారం కౌన్సిల్ ఆఫ్ బోర్డ్స్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ 54వ వార్షిక సమావేశాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కౌన్సిల్ ఫర్ ది ఇండియన్ స్కూల్ సర్టిఫికేట్ ఎగ్జామినేషన్స్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన మూడు రోజుల జాతీయ సదస్సులో కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్, ఇంటర్నేషనల్ బాకలారియేట్ ప్రతినిధులు సహా దేశ, విదేశాలకు చెందిన పాఠశాల బోర్డుల నుంచి వంద మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థ, భౌగోళిక రాజకీయాలలో మాత్రమే కాకుండా, నాగరికతలో కూడా ప్రపంచాన్ని నడిపిస్తుందని అన్నారు. భారతదేశ సాంస్కృతిక పునాదుల చుట్టూ విద్యను వలస రాజ్యం నుండి తొలగించి తిరిగి దిశానిర్దేశం చేయవలసిన అవసరాన్ని గవర్నర్ నొక్కి చెప్పారు. విద్య భవిష్యత్తును రూపొందిస్తుందని, పిల్లలపై ప్రభావం ఉంటుందన్నారు. పాఠశాల కేవలం నేర్చుకునే ప్రదేశం కాదని, మన దేశం యొక్క రేపటికి పుట్టినిల్లు అని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ మార్పుకు విద్య ఎంతో అవసరం అన్నారు.

తెలంగాణ ప్రభుత్వ కార్యదర్శి డా. యోగితా రాణా మాట్లాడుతూ సహకారం, ధైర్యం వారి భవిష్యత్‌ను నిర్ణయిస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు నాయకత్వ లక్షణాలు పెంచు కోవాలని, మంచి విద్య విధానం ద్వారానే వారి భవిష్యత్ రూపొందుతుందన్నారు. ఈ కార్యక్ర మంలో సిఐబిఎస్ఇ చైర్మన్ డా.జోసెఫ్ ఇమ్మా న్యుయేల్, ప్రధాన కార్యదర్శి ఎంసి శర్మ, ఐఎఎస్ అధికారి కృష్ణ అదిత్య, డా.షమీమ్ చౌదరి, మహేష్ బాలకృష్ణన్, డాక్టర్ సోనా అహుజా, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గుడ్‌నెస్ వ్యవస్థాప కుడు, డైరెక్టర్ రవిశర్మ, స్కంద్ శుక్లా, దేశ విదేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

## చెరకు రైతుల సమస్యలు పరిష్కరించని ప్రభుత్వాలు

### సంఘం అఖిలభారత అధ్యక్షుడు డి.రవీంద్రన్

**హైదరాబాద్, అక్టోబరు 29 ప్రభాతవార్త:** చెరుకు రైతుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని చెరుకు రైతుల సంఘం అఖిలభారత అధ్యక్షులు డి రవీంద్రన్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ లు అన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణలో వ్యవసాయ సీజన్, సీజన్‌కు చెరుకు సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోతుందన్నారు. 2014-15 ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పుడు తెలంగాణలో 1,25,000ఎకరాల విస్తీర్ణంలో సాగు కాగా, 2025-26 వ సీజన్లో కేవలం 50 వేల ఎకరాల లోపు మాత్రమే సాగు అవుతుంది. తెలంగాణ రాష్ట్రం లో మొత్తం సాగు విస్తీర్ణం 1కోటి 32 లక్షల ఎకరాల్లో చెరుకు 0.5 శాతం కూడా లేదు. కేంద్ర ప్రభుత్వం ప్రతి చెరుకు క్రషింగ్ సీజన్ కంటే ముందు ప్రకటించే ఎఫ్‌ఆర్పి లో మార్పులు చేసిన ఫలితం చెరకు సాగు నుంచి రైతులు




ప్రసంగిస్తున్న చెరుకు రైతుల సంఘం అఖిలభారత అధ్యక్షులు డి రవీంద్రన్

దూరమయ్యారు. గతంలో చెరుకు టన్నుకి 8.5 పంచదార రికవరీ పై ధర నిర్ణయించగా మొదట 9.5 కు నేడు 10.5 రికవరీ బేస్ పై ధర నిర్ణయం మూలంగా రైతులకు 8.5 పైన ఉన్న రికవరీ కి అదనంగా డబ్బులు చక్కర పరిశ్రమ చెల్లించాల్సి ఉండగా 10.5 కు పెంచడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిజాం షుగర్ పరిశ్రమలు పునరుద్ధరణ ప్రయత్నాలు జరిగినా ఆశించిన స్థాయిలో సాగు లేదన్నారు. చెరుకు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ...రాష్ట్ర, దేశ అవసరాలకు అనుగుణంగా చెరుకు సాగు ఆశించిన స్థాయిలో ఉండాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అనుకూలమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, చెరుకు రైతు సంఘం రాష్ట్ర నాయకులు రచ్చ నర్సింహ్మా రావు, తోటకూర రాజు, ఎనమద్ది రామకృష్ణ నెల్లూరు నాగేశ్వరరావు, లక్ష్మీ మనారా యణ, ఎనమద్ది లెనిన్ సంగన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ మహిళా కాంగ్రెస్ జాతీయ పరిశీలకురాలిగా అదితా స్వప్న



అదితా స్వప్నకు నియామక పత్రం అందిస్తున్న అల్కా లాంబా

**హైదరాబాద్,అక్టోబరు 29,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ మహిళా కాంగ్రెస్ జాతీయ పరిశీలకురాలిగా అదితా స్వప్న నియమితుల య్యారు. ఈమేరకు అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా ఆంధ్రప్రదేశ్ మహిళా కాంగ్రెస్ జాతీయ పరిశీ లకురాలిగా బి.అదితా స్వప్నను నియమిస్తూ బుధవారం ఉత్త ర్వులు అందించారు.గతంలో అదితా స్వప్న బీహార్, పుదుచ్చేరి ,అండమాన్,నికోబార్ దీవులకు జాతీయ పరిశీలకురాలిగా విజయవంతంగా పని చేశారు. ఆమె అంకిత భావం, సామర్థ్యంను కాంగ్రెస్ అగ్రనేతల రాహుల్ గాంధీ గుర్తించి, ఆంధ్రప్రదేశ్ బాధ్యతను ఇప్పుడు ఆమెకు అదనంగా అప్పగిం చాలని సూచించడంతో ఈ నియామకం జరిగింది. అదితా స్వప్న మాట్లాడుతూ నాపై విశ్వాసం ఉంచి నూతన బాధ్యతను అప్పగిం చినందుకు రాహుల్ గాంధీకి, అల్కా లాంబాకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఆమె నాయకత్వంలో, ఆంధ్రప్రదేశ్‌లో మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయడానికి, రాహుల్ గాంధీ దార్శనికత, నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు.

## తెలుగు వర్సిటీ విస్తృతదిశగా ముందడుగు

### పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఎపి ఉపాధ్యక్షుడు ఆచార్య డా. మునిరత్నంనాయుడు



పురస్కారగ్రహీతలతో మునిరత్నంనాయుడు, నిత్యానందరావు, హనుమంతరావు, రమేష్, రామమూర్తి తదితర అతిథులు

**ఉత్తమ గ్రంథాలకు సాహితీ పురస్కారాల ప్రదానం**

**హైదరాబాద్ (నాంపల్లి), అక్టోబరు 29 ప్రభాతవార్త :** తెలుగు విశ్వవిద్యాలయం కేవలం ఇరు తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాకుండా విశ్వవ్యాప్త విస్తృతదిశగా అడుగులు వేసేందుకు కృషిచేస్తున్నట్లు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం,ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.మునిరత్నం నాయుడు అన్నారు. సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత విభజన చట్టం ప్రకారం ఉభయ తెలుగురాష్ట్రాల్లో వేర్వేరు పేర్లతో తెలుగు విశ్వవిద్యాలయం పూర్తిస్థాయిలో ఏర్పడడం శుభసూచకమన్నారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో బుధవారం సాయంత్రం 2023 సంవత్సరానికిగాను తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలకు సాహితీ పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆచార్య డి.మునిరత్నం నాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేసి విశిష్ట అతిథులు ఎస్. రమేష్, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, విస్తరణ సేవావిభాగం అసిస్టెంట్ డైరెక్టర్ రింగు రామమూర్తి తదితరులతో కలిసి 2023 సంవత్సరానికిగాను తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఎంపికైన ఉత్తమ గ్రంథ రచయితలను ఘనంగా సత్కరించి సాహితీ పురస్కారాలు, ఒక్కొక్కరికి రూ.20,116 నగదు పారితోషికం ప్రదానంచేసి అభినందించి ప్రసంగించారు. ముందుగా హనుమంతరావు పురస్కార గ్రహీతలను సభకు పరిచయం చేయగా రామమూర్తి సమన్వయకర్తగా వ్యవహరించారు. చివరిగా ఈ నెల 31న ఉద్యోగ విరమణ పొందుతున్న రింగు రామమూర్తిని ఉపాధ్యక్షుడు ఘనంగా సత్క రించారు.సాహితీ పురస్కార గ్రహీతలలో పద్యకవిత ప్రక్రియలోని ఉత్తమ గ్రంథం ధర్మపురీ వైభవం రచయిత ఒజ్జల నరహరిశర్మ; వచన కవిత నేను యౌగిక కావ్యం విశ్వర్షి వాసిలి; గేయకవిత తెలంగాణ రుబాయిలు డా. ఏనుగు నరసింహారెడ్డి; బాలసాహిత్యం చందమామ చెప్పిన కథలు డా. ఎం.హరికిషన్; కథ నా నుండి మన వరకు డా. టి.సం పత్‌కుమార్; నవల మాదిగ కొలుపు ఆచార్య పులికొండ సుబ్బాచారి; సాహిత్య విమర్శ ద్విక్చక్రం ఆదెపు లక్ష్మీపతి; నాటకం రచ్చబండ రావుల పుల్లాచారి; అనువాదం మృత్యుంజయుడు డా. టి.సి.వసంత; వచన రచన తిరుపతి కథలు ఆచార్య వేట శ్రీనివాసులురెడ్డి; రచయిత్రి ఉత్తమ గ్రంథం స్వతంత్రత నుండి స్వాతంత్ర్యానికి డా. జంధ్యాల కనకదుర్గలు ఉన్నారు.

## డిజిపి కార్యాలయంలో రక్తదాన శిబిరం

### దానం చేసిన డిజిపి శివధర్ రెడ్డి సహా సీనియర్ ఐపిఎస్‌లు

**హైదరాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త:** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా బుధవారం నాడు డిజిపి కార్యాలయంలో రక్త దాన



పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా డిజిపి కార్యాలయంలో జరిగిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేస్తున్న డిజిపి శివధర్ రెడ్డి, శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్ తదితరులు

శిబిరం ఏర్పాటు చేశారు. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ శిబిరంలో డిజిపి శివధర్ రెడ్డి, శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్, ఐజిపిలు చంద్రశేఖర్ రెడ్డి, రమేష్ నాయుడు, రమేష్ సహా డిజిపి కార్యాలయ అధికారులు, సిబ్బంది మొత్తం 164 మంది పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా డిజిపి శివధర్ రెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలను కాపాడిన వారవుతామని తెలిపారు. రక్తదానం చేసేందు కు అందరు ముందుకు రావాలని ఆయన కోరారు. రెండు రోజుల క్రితం హైదరాబాద్ సిటీ పోలీసు విభాగం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 450 0 యూనిట్ల రక్తాన్ని దానం చేశామని ఆయన తెలిపారు. ఏడాదిలో ప్రతీ ఒక్కరు నాలుగుసార్లు రక్తదానం చేయవచ్చని ఆయన వెల్లడించారు. దీనివ ల్ల రక్తదానం చేసిన వారు మరింత చురుకుగా వుంటారని ఆయన అన్నారు. రోడ్డు ప్రమాదాలలో గాయపడుతున్న వారిలో అనేక మంది సరైన సమ యంలో రక్తం అందుబాటులో లేకపోవడం వల్ల మరణిస్తున్నారని డిజిపి తెలిపారు. డిజిపి కార్యాలయంలో తొలిసారిగా జరిగిన రక్తదాన శిబిరంలో పెద్ద ఎత్తున అధికారులు, సిబ్బంది పాల్గొనడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐజి రమణకుమార్, నాగరాజుతో పాటు రెడ్ క్రాస్ తరపున డాక్టర్ పిచ్చిరెడ్డి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి శాతవాహనకు జనగామలో హాల్టింగ్

### కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 29,ప్రభాతవార్త:** జనగామలో గురువారం నుంచి శాతవాహన ఎక్స్‌ప్రెస్ ప్రజల ప్రయాణ సౌకర్యాలు మెరుగు పరచడానికి రెండు నిమిషాలు నిలుపుటకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్‌శ్రీవాత్సవ ఉత్తర్వులు జారీచేశారు. భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు ప్రయోగాత్మకంగా విజయవాడ - సికింద్రాబాద్ 12713ఎగువ, సికింద్రాబాద్ -విజయవాడ12714 దిగువ శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలుకు జనగాం రైల్వే స్టేషన్‌లో అదనపు స్టాపేజ్ మంజూరు చేసినట్లు ప్రకటించారు. శాతవాహన ఎక్స్‌ప్రెస్‌కు జనగాం స్టేషన్‌లో స్టాపేజ్ కల్పించడం వలన ప్రజలకు ప్రయాణ సౌలభ్యం పెరుగుతుంది. ఈ ప్రజా విజ్ఞప్తిని గౌరవించి తక్షణం స్పందించిన దక్షిణ మధ్య రైల్వే యాజమాన్యానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నాను అని భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు.అలాగే, ఆయన ఈ నిర్ణయం జనగాం మరియు పరిసర ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉం టుందని ఎంపి చామల పేర్కొన్నారు.

## బిఆర్ఎస్‌తో నాకు సంబంధం లేదు

### నేను ఎవరికీ ఎ,బి టీం కాదు

### సామాజిక తెలంగాణే లక్ష్యం

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత


**మహబూబ్‌నగర్‌బ్యూరో, అక్టోబరు 29,ప్రభాతవార్త:** 'నాకు బిఆర్ఎస్‌తో సంబంధం లేదు. బీఆర్ఎస్ ద్వారా వచ్చిన ఎమ్మెల్సీ పదవీ నాకొద్దు.. నా రాజీనామా ఆమోదించమని కోరుతున్నా' అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ జాగృతి ఉద్యమ సంస్థ అని, గతంలో అనేక ఉద్యమాలు చేశామని, తెలంగాణ ఉద్యమంలో తమకంటూ ఓ పేజీనే క్రియేట్ చేసుకున్నామని గర్వంగా చెప్పగలనని తెలిపారు. సాధించుకున్న తెలంగాణలోను తమ వంతు పాత్ర పోషించామని, తెలంగాణ వచ్చిన తర్వాత స్కిల్ డెవలప్ మెంట్ కార్యక్రమాలు పెట్టి ఎంతో మంది యువతకు ఉద్యోగాలు వచ్చేలా చేశామన్నారు. ఎంపీగా, ఎమ్మెల్సీ గాను తన దృష్టికి వచ్చిన ఎన్నో సమస్యలను పరిష్కరించానని తెలిపారు.

**నా వెనక ఎవరూ లేరు:** తాను ఇండిపెండెంట్ అని, తన వెనుక ఎవరు లేరని, ముందు మాత్రం ప్రజలు ఉన్నారని ఎమ్మెల్సీ కవిత అన్నారు. దగాపడ్డ ఉద్యకారుల్లో తానూ బాధితురాలినే అన్నారు. కాంగ్రెస్ వాళ్లు నేను బీజేపీ బీ టీమ్ అని, బీజేపీ వాళ్లు కాంగ్రెస్ బీ టీమ్ అని అంటారని, బీఆర్ఎస్ వాళ్లు ఏదేదో ఆరోపణలు చేస్తూనే ఉన్నారు. అయితే తన నడక ద్వారా నా స్టాండ్ ఏంటో ప్రజలకు అర్థమవుతుందన్నారు. నీళ్లు,నిధులు, నియామకాలు విషయంలో రేవంత్ రెడ్డినిరక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

**సామాజిక తెలంగాణ లక్ష్యం:** మనం భౌగోళిక తెలంగాణ మాత్రమే సాధించామని, సామాజిక తెలంగాణ విషయంలో ఇంకా ఒక్క అడుగు వెనుకే ఉన్నామని కవిత అన్నారు. మొన్న జడ్చర్లలోని ప్రభుత్వ హాస్పిటల్ లో వైద్యం అందక ఒక యువ రైతు చనిపో యాడని, ఎంతో ఆశతో, ఆకాంక్షలతో తెచ్చుకున్న తెలంగాణలో వైద్యం అందిం చలేని దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య విషయంలో అదే పరిస్థితి ఉందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవటంతో పేద విద్యార్థులు ఇంటి దగ్గరే ఉంటున్నారని చెప్పుకొచ్చారు. ప్రభుత్వం మీద ఆధారపడి చదవుకునే వారికి విద్య దొరకకుండా చేస్తున్నారని పేర్కొన్నారు.

## తుఫాను ప్రభావంపై మంత్రి సీతక్క ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,అక్టోబరు29:** మొంథా తుఫాను నేపథ్యంలో తలెత్తే పరిణామాలపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉన్న మహబూబాబాద్, ములుగు జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో ఆమెమాట్లాడారు. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ, అత్యవసర చర్యలకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. చలిగాలులు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, స్వీయ నియంత్రణ పాటించాలని సూచించారు. రైతులు, పశువుల కాపరులు తమపశువులు, పంటల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మత్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని స్పష్టం చేశారు. ప్రజలు వాగులు, చెరువులు దాటే ప్రయత్నం చేయరాదని, నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాలకుదూరంగా ఉండాలని కోరారు. పలు చోట్ల రైళ్లు నిలిచిపోయినట్లు సమాచారంఅందుతున్న నేపథ్యంలో, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణమేసహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావంతగ్గేవరకు ప్రజలు ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని, అత్యవసరమైతేతప్ప ఇళ్లనుంచి బయటకురాకూడదని మంత్రి కోరారు.




సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మహేశ్‌కుమార్

## హరీష్ రావును పరామర్శించిన టిపిసిసి చీఫ్


**హైదరాబాద్, అక్టోబరు 29,ప్రభాతవార్త:** మాజీ మంత్రి హరీష్ రావును బుధవారం టిపిసిసి ప్రసిడెంట్ ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్ కలిసి పరామర్శించారు. మాజీమంత్రి హరీష్ నాన్న సత్యనారాయణ రావు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. హరీష్ రావు తండ్రి సత్యనారాయణ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్, మాజీ ఎంపి మధు యాష్కీ గౌడ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. హరీష్‌రావు తండ్రి చనిపోకముందు ఉన్న ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు.

## వర్షాల నుండి పంటలను కాపాడు కోవాలి: మంత్రి తుమ్మల



**హైదరాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త:** మొంథా తుఫాను తీరం దాటి దిశ మార్చుకున్న నేపథ్యంలో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా రైతులు తమ పంటలను కాపాడుకోవాలని వ్యవసాయ మంత్రి తమ్మల నాగేశ్వరావు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నుండి బుధవారం వివిధ జిల్లాల కలెక్టర్లతో ఫోన్లో మాట్లాడి పలు సూచనలు చేశారు. పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు తమ పంటలను భారీ వర్షాల నుండి కాపాడుకోవాలని ముఖ్యంగా వరి కోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు. తొందరపడి పంటలను అమ్ముకోవొద్దన్నారు. ఇదే సమయంలో లోతట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని, ప్రజలను వాగులు వంకలు దాటకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అందుకోసం పోలీసు సిబ్బంది సేవలను వినియోగించుకోవాలన్నారు. అలాగే ఈ వర్ష ప్రభావంతో వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్న దృష్ట్యా చెరువుల వద్ద నీటిపారుదల శాఖ అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ చేయాలని తెలిపారు.

# ముంచేసిన మొంథా



బుధవారం తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను ఏరియల్ సర్వే చేస్తున్న ఎపి సిఎం చంద్రబాబు

- ముందస్తు చర్యలతో వేలకోట్ల నష్టాన్ని నివారించగలిగాం
- ముంపు ప్రాంతాలను ఏరియల్ సర్వేద్వారా పరిశీలించిన ఎపి సిఎం చంద్రబాబు
- నష్టం అంచనాలు త్వరగా సిద్ధం చేయాలని అధికారులకు సూచన
- బాధితులకు తక్షణ సాయం అందించాలని ఆదేశం
- మొత్తం 249 మండలాలు, 1434 గ్రామాలు, 48 మునిసిపాలిటీల్లో 18 లక్షల మందిపై తుఫాన్ ప్రభావం

**విజయవాడ,అక్టోబరు 29, ప్రభాతవార్త ప్రతినిధి:** మొంథా తుపాను పెనువిపత్తు అని, రాష్ట్రానికి తీవ్రమైన నష్టం జరిగిందని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. గతంలో తుఫాన్‌ల సమయంలో పనిచేసిన అనుభవం నాకుందని తెలిపారు. ఈ మొంథా తుపానుపై ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకున్నామని అందువల్ల ముందు జాగ్రత్తలు తీసుకుని ఎటువంటి ప్రాణనష్టం లేకుండా చూశామని అన్నారు. ఆస్తి నష్టం కూడా చాలావరకు తగ్గేలా చర్యలు తీసుకున్నామన్నారు. పలుజిల్లాల్లో వరి, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని వివరించారు. నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో భారీవర్షం నమోదైందని అన్నారు. ఆస్తి నష్టంపై నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటామని అలానే కౌలురైతులకు పరిహారం అందిస్తామని వెల్లడించారు. తుపాను సమయంలో అధికారులు బాగా పనిచేశారని సిఎం చంద్రబాబు కొనియాడారు. జిల్లా కలెక్టర్లు,అధికారులు,మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమా వేశంలో మాట్లాడుతూ ముందస్తు చర్యలతో తుఫాను ప్రభావం నుంచి రూ.వేల కోట్ల నష్టాన్ని నివారించగలిగామని తెలిపారు. గత నాలుగైదు రోజుల నుంచి మొంథా తుఫాన్ విషయంలో సమర్థవంతంగా వ్యవహరించి నష్టనివారణ చర్యలు చేపట్టామన్నారు.సిఎం నుంచి సచివాలయ సిబ్బంది వరకు జిల్లా అడ్మినిస్ట్రేషన్‌తో సహా అంతా కలిసి టీంగా పనిచేశామన్నారు. కష్టకాలంలో భాధితుల కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు.మరో రెండు రోజులు ఇదే విధంగా పనిచేస్తే. బాధిత ప్రజలకు మరింత ఊరట ఇవ్వగలం.తుఫాను వెలిసింది.కాబట్టి వీలైనంత త్వరగా సాధారణ పరిస్థితులు నెలకొల్పేలా అధికారులు పని చేయాలి. మంత్రులు,అధికారులు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలి. ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలి. వారికేమైనా సమస్యలు ఉంటే అడిగి తెలుసుకోవాలి. మొంథా తుఫాను వల్ల వివిధ విభాగాల్లో కలిగిన నష్టాన్ని అంచనా వేయాలి. కేంద్రానికి నివేదిక అందివ్వాలి. తుఫాన్ భాధితులకు నిత్యావసర సరుకులు వెంటనే అందించాలి. నిర్వాసితులను ఆదేకోవాలి అన్నారు. ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల నష్టాన్ని చాలా వరకు నివారించగలిగాం. సచివాలయాలపై మైక్ అనౌన్స్‌మెంట్ సిస్టంను ఏర్పాటు చేసి కింది స్థాయి వరకూ ప్రభుత్వం ఇచ్చే సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాం. ఇదొక నూతన విధానం తీసుకొచ్చాం. తుఫాన్‌ను ఎవరూ నివారించలేరు. కానీ ముందు జాగ్రత్తలతో నష్టాలను నివారించ గలుగుతాం. కలెక్టర్లు, అధికారులు కంట్రోల్ రూంలో కూర్చుని రియల్ టైం సమాచారం తెప్పించుకుని జాగ్రత్తలు తీసుకున్నారు. ఎన్డీఆర్ఎఫ్, పోలీస్, ఫైర్ సిబ్బంది బాగా పనిచేశారు. చెట్లు కూలినా, విద్యుత్ వైర్లు తెగిపడినా యుద్ధప్రాతి పదికన తొలగించారు. అన్ని మున్సిపాలిటీలో డ్రెయిన్లు క్లీన్ చేయడం వల్ల కాలనీలను ముంపు బారిన పడకుండా చేశామన్నారు. దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను కూడా పునరుద్దరించేందుకు 10 వేల మందిని అందు బాటులో పెట్టుకున్నామన్నారు. నేడు మధ్యాహ్నానికి సాధారణ పరిస్థితి ఏర్పడుతుందన్నారు. తుఫాన్ కారణంగా ఇద్దరు చనిపో యారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు అందుబాటులో ఉంటే ప్రభుత్వంపై నమ్మకం కల్గుతుంది. మన చర్యలతో ప్రభుత్వంపై భరోసా పెరుగుతుందన్నారు.తుఫాను ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు నిత్యావసర సరుకులు అందించాలని చంద్రబాబు ఆదేశించారు. కలెక్టర్లు, అధికారులు, మంత్రులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. తుఫాను నష్టం అంచనాలను త్వరితగతిన సిద్ధం చేయాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సినచర్యలపై అధికారులు, మంత్రులకు సూచనలు చేశారు. ఎస్డీఆర్ఎఫ్, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది బాగా పనిచేశారు. చెట్లు కూలినా,విద్యుత్ తీగలు తెగి పడినా యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. మున్సిపాలిటీల్లో డ్రెయిన్‌ల శుభ్రం వల్ల ముంపుబారిన పడకుండా చేశాం. దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణకు 10 వేల మందిని అందుబాటులో ఉంచాం. ఇవాళ మధ్యాహ్నానికి సాధారణ స్థితి ఏర్పడుతుంది. తుఫాను కారణంగా ఇద్దరు చనిపోయారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు అందుబాటులో ఉంటే ప్రభుత్వంపై నమ్మకం కల్గుతుంది. మన చర్యలతో ప్రభుత్వంపై ప్రజలకు భరోసా పెరిగింది'అని చంద్రబాబు తెలిపారు.ఈ నేపథ్యంలో మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన ముగించుకుని రాష్ట్ర సచివాలయానికి సిఎం చంద్రబాబు నాయుడు చేరుకున్నారు. తిరిగి తుఫాన్ వల్ల వచ్చిన నష్టంపైనా, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపైనా ఆర్టీజీఎస్ నుంచి అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షనిర్వహించారు. జనహాయక చర్యలు ఏ విధంగా కొనసాగుతున్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు.విద్యుత్ సరఫరా, రహదారుల పునరుద్ధరణ తక్షణం జరగాలని స్పష్టం చేసారు.ఎక్కడా వర్షం నీరు నిలిచిపోకుండా డ్రైనేజీలను పటిష్ట పరచాలని, పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని సిఎం ఆదేశించారు. పునరావాసకేంద్రాల్లోని కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాల పంపిణీవేగంగా జరగాలన్నారు. తుఫాన్ తీరం దాటడంతో రాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో 1,209 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి.1.16 లక్షల మందికి ఆశ్రయం కల్పించామన్నారు.రాష్ట్రంలో మొత్తం 249మండలాలు, 1,434 గ్రామాలు, 48 మున్సిపాలిటీల్లో 18 లక్షల మందిపై తుఫాన్ ప్రభావం ఉన్నట్లు గుర్తించారు. తుఫాన్ నష్టంపై తాజావివరాలను సీఎంకు అధికారులు వివరించారు. రాష్ట్రంలోని 304 మండలాల్లోని 1,825 గ్రామాల్లో 87 వేలహెక్టార్లలో పంటకు నష్టం జరిగిందన్నారు. 59 వేలకుపైగా హెక్టార్లలో నీటమునిగిన వరిపంట, పత్తి, మొక్కజొన్న, మినుము పంట లకు నష్టం కలిగిందన్నారు. భారీవర్షాలతో నష్టపోయిన 78,796 మంది రైతులు.రాష్ట్ర వ్యాప్తంగా చనిపోయిన 42 పశువులు...రాష్ట్రంలో దెబ్బతిన్న పంచాయతీరాజ్ రోడ్లు, 14బ్రిడ్జిలు, కల్వర్టులుదెబ్బతిన్న 2,294 కి.మీ. పొడవున ఆర్ అండ్ బీ రహదారులు.. రూ.1,424 కోట్ల నష్టం రూరల్ వాటర్ సప్లయ్‌కు సంబంధించి రూ.36 కోట్లు వరకు, ఇరిగేషన్ పనుల్లో రూ.16.45 కోట్ల మేర నష్టం కలిగిందన్నారు. సురక్షి త ప్రాంతాలకు 3,175 మంది గర్భిణీల తరలింపు.. 2,130 మెడికల్ క్యాంపుల నిర్వహణ297 రహదారులపై వరద నీరు పొంగి ప్రవహిస్తుండగా, వాటిని దారి మళ్లించేలా చర్యలురాష్ట్రంలో మొత్తం 380 చెట్లు రహదారులపై విరిగిపడగా, అన్నింటినీ తొలిగించామని ప్రభుత్వ యంత్రాంగం వివరించింది.

## క్యూఆర్‌కోడ్‌తో రోడ్లకు సంబంధించిన సమాచారం

### కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



**న్యూఢిల్లీ, అక్టోబరు 29:** దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రధాన రహదారులపై క్యూఆర్‌కోడ్ స్కానర్‌లను ప్రవేశపెట్టాలని కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రతిపాదించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచడానికి ఇవి ఉపయోగపడతాయన్నారు. పౌరులు ఈ క్యూఆర్‌కోడ్ స్కాన్ చేస్తే ఆ ప్రాజెక్టు కోసం పనిచేసిన కాంట్రాక్టర్లు, ఇంజినీర్లు, నిర్మాణానికి మంజూరుచేసిన బడ్జెట్, గడువు, నిర్వహణ వంటి కీలక వివరాలు వెల్లడవుతాయని పేర్కొన్నారు. స్మార్ట్ రోడ్ల భద్రత అనే అంశంపై ఢిల్లీలో నిర్వహించిన ఓ సమావేశంలో ప్రసంగించిన గడ్కరీ ఈ వ్యాఖ్యలు చేశారు. రోడ్లు బాగా లేకపోతే అందరూ తననే నిందిస్తారని, మొత్తం వ్యవస్థ చేసిన తప్పుకు తాను మాత్రమే ఎందుకు తిట్లు తినాలని, సోషల్ మీడియాలో ఆరోపణలపై ఎందుకు స్పందించాలని నితిన్ గడ్కరీ చమత్కరించారు. అందుకే రోడ్లకు సంబంధించిన సమాచారమంతా ప్రజలకు బహిర్గతం చేయాలనే ఉద్దేశంతో ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అప్పుడే రోడ్ల నిర్మాణంలో అవినీతికి పాల్పడే అధికారులకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. రోడ్లపై క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేయడం వల్ల దానిని మంజూరు చేసిన మంత్రి ఎవరు, దాని నిర్మాణం కోసం పనిచేసిన కార్యదర్శులు, కాంట్రాక్టర్లు, ఇంజినీర్లు వాటి ఫోన్ నంబర్లు, ఫొటోతో సహా అన్ని వివరాలు ప్రజలకు, విలేకరులకు అందుబాటులో ఉంటాయి. ఆయా రోడ్లపై ఏదైనా సమస్య వస్తే వారు నేరుగా ఆ అధికారులనే ప్రశ్నించే అవకాశం ఉంటుంది అని అన్నారు.

## పుష్కర్ పశుజాతరలో 'పుంగనూరు' ఆవులే ప్రధాన ఆకర్షణ



**జైపూర్, అక్టోబరు 29:** ప్రపంచ ప్రసిద్ధి చెందిన రాజస్థాన్ పుష్కర్ అంతర్జాతీయ పశువుల జాతర 2025లో ఈసారి ఓ పొట్టి ఆవు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అంతరించిపోతున్న జాతి పుంగనూరు ఆవు ఇప్పుడు ఈ జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దాని చిన్న పరిమాణం, తక్కువ నిర్వహణ ఖర్చు, అధిక పాల దిగుబడి పశుప్రేమికులను, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. జైపూర్‌కు చెందిన అభిరామ్ బ్రీడింగ్ ఫామ్ యజమాని అభినవ్ తివారీ ఈ పుంగనూరు ఆవులను జాతరకు తీసుకువచ్చారు. ఆయన మాట్లాడుతూ, ఆయన ఈ జాతి ప్రత్యేకతలను వివరించారు. పుంగనూరు ఆవు కేవలం 28 నుంచి 36 అంగుళాల ఎత్తు, 150 నుంచి 200 కిలోల బరువు మాత్రమే ఉంటుందని తెలిపారు. చూడటానికి చిన్నగా ఉన్నప్పటికీ, రోజుకు కేవలం 3 కిలోల పశుగ్రాసం తీసుకుని 3 నుంచి 5 లీటర్ల పాలు ఇస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ జాతి అంతరించిపోయే ప్రమాదంలో ఉందని అభినవ్ తివారీ ఆవేదన వ్యక్తం చేశారు. పుంగనూరు ఆవు పాలలో ఎన్నో ఔషధ గుణాలున్నాయని, ఆరోగ్యానికి మేలు చేసే ఏ2 ప్రొటీన్ పుష్కలంగా ఉంటుందని వివరించారు. ముఖ్యంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఈ జాతి ఆవులను పెంచుతుండటంతో దేశవ్యాప్తంగా వీటిపై ఆసక్తి ఒక్కసారిగా పెరిగింది. అయితే, తాము ఈ ఆవులను అమ్మడానికి తీసుకురాలేదని, కేవలం దేశీయ జాతుల పరిరక్షణపై అవగాహన కల్పించేందుకే ప్రదర్శిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. పుంగనూరు ఆవులతో పాటు ఆయన తీసుకొచ్చిన చిన్న గుర్రాలు కూడా సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. పుష్కర్ ఎడారి ఇసుక తిన్నెలపై మన ఆంధ్రా ఆవు తన ప్రత్యేకతలతో అందరినీ మంత్రముగ్ధులను చేస్తోంది. దేశ, విదేశాల నుంచి వచ్చిన పర్యాటకులు, రైతులు ఈ ఆవును చూసేందుకు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. దానితో ఫోటోలు దిగుతూ, దాని విశేషాలు తెలుసుకుంటున్నారు. పొడి వాతావరణానికి సులువుగా అలవాటు పడటం, తక్కువ మేతతో ఎక్కువ ప్రయోజనం ఉండటంతో ఇది భారతీయ రైతులకు ఎంతో అనువైనదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పుంగనూరు ఆవుకు లభిస్తున్న ఈ ప్రాచుర్యం, దేశీయ పశుజాతుల పరిరక్షణ ఆవశ్యకతను మరోసారి గుర్తు చేస్తోంది.

## రియోనగరంలో డ్రగ్స్ స్మగ్లర్ల ఏరివేత

### రెడ్‌కమాండ్ స్మగర్లలో 60 మందిమృతి, 81 మంది అరెస్టు



**రియోడిజెనీరో, అక్టోబరు 29:** బ్రెజిల్‌లోని రియో డి జెనీరో నగరం యుద్ధ క్షేత్రాన్ని తలపించింది. డ్రగ్స్ రవాణా చేసే ఓ ప్రమాదకర ముఠాను లక్ష్యంగా చేసుకుని పోలీసులు, సైనికులు చేపట్టిన భారీ ఆపరేషన్ హింసాత్మకంగా మారింది. ఈ భీకర కాల్పుల్లో 60 మంది అనుమానిత స్మగ్లర్లు, నలుగురు పోలీసు అధికారులు మరణించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ ఘటనలో మరో 81 మందిని అరెస్ట్ చేశారు. రియోలోని మురికివాడలైన కాంప్లెక్సో డి అలెమావో, పెన్హా ప్రాంతాల్లో క్రియాశీలకంగా ఉన్న "రెడ్ కమాండ్" అనే డ్రగ్స్ ముఠాను ఏరివేసేందుకు సుమారు 2,500 మంది పోలీసులు, సైనికులు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. హెలికాప్టర్లు, సాయుధ వాహనాలతో మురికివాడలను చుట్టుముట్టి దాడులు నిర్వహించారు. పోలీసుల చర్యను ప్రతిఘటించడం వల్లే అనుమానితులు మరణించారని రియో రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఆపరేషన్‌లో 93 రైఫిళ్లు, అర టన్నుకు పైగా మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది. నగర చరిత్రలోనే ఇది అతిపెద్ద ఆపరేషన్ అని గవర్నర్ క్లాడియో కాస్ట్రో తెలిపారు. ఈ భారీ ఆపరేషన్‌పై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంత పెద్ద సంఖ్యలో మరణాలు సంభవించడంపై ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల విభాగం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఇది ఒక మహా విషాదం అని హ్యూమన్ రైట్స్ వాచ్ అభివర్ణించింది. ప్రతీ మరణంపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేసింది. ఈ దాడి కారణంగా రియో నగరంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఆపరేషన్‌కు నిరసనగా ముఠా సభ్యులు నగరంలోని పలు ప్రధాన రహదారులను దిగ్బంధించారు. సుమారు 70 బస్సులను అపహరించి, వాటిని అడ్డంగా పెట్టి నిప్పంటించారు. దీంతో నగరంలో రవాణా వ్యవస్థ స్తంభించింది. కాల్పుల మోతతో రెండు ప్రాంతాల్లోని 46 పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. ఈ తరహా ఆపరేషన్లు డ్రగ్స్ ముఠాల నాయకులను పట్టుకోవడంలో విఫలమవుతున్నాయని, కింది స్థాయి సభ్యులను చంపడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇవి యుద్ధంలో జరిగే మరణాల్లా ఉన్నాయి. కేవలం కాల్పులు జరిపి వెళ్లిపోవడం సరైన వ్యూహం కాదని సామాజిక శాస్త్రవేత్త లూయిస్ ఫ్లేవియో సపోరి వ్యాఖ్యానించారు. ఇది ప్రజా భద్రతా విధానం కాదని, పేదలను నిర్మూలించే చర్య అని మరియెల్ ఫ్రాంకో ఇన్‌స్టిట్యూట్ వంటి స్థానిక హక్కుల సంస్థలు ఆరోపించాయి.

## ప్రైవేట్ కాలేజీల్లో విజిలెన్స్ తనిఖీలకు ప్రభుత్వం ఆదేశం

### పోలీస్,విద్యాశాఖ సహకారంతో తనిఖీల నిర్వహణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, అక్టోబరు29:** తెలంగాణలో ఉన్నత ప్రైవేట్ విద్యాసంస్థలు వర్సెస్ విజిలెన్స్ అధికారుల పంచాయితీ నడుస్తోంది. తమకు చెల్లించాల్సిన రూ.600 కోట్ల బకాయిలను తక్షణమే విడుల చేయాలని,లేదంటే విద్యా సంస్థల సంపూర్ణ బంద్ ప్రకటిస్తామని హెచ్చరించారు. ఇదిలా ఉంటే మరోవైపు ప్రైవేట్ ఉన్నత విద్యా సంస్థలు,ప్రొఫెషనల్ కాలేజీల్లో విద్యార్థుల సంఖ్య, సౌకర్యాలపై తనిఖీలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా విజిలెన్స్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఫీజు రీయంబర్స్‌మెంట్ పొందే ప్రైవేట్ కాలేజీల్లో విజిలెన్స్ తనిఖీలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. కాలేజీల్లో సౌకర్యాలు,విద్యార్థుల నమోదుపై నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. పోలీస్, విద్యా శాఖ సహకారంతో ఈ తనిఖీలు చేపట్టనుంది. మరోవైపు బకాయిలు చెల్లించాకే తనిఖీలు చేయాలని కాలేజీల యాజమాన్యాలు కోరుతున్నాయి.

## ఢిల్లీలో స్వేచ్ఛగా జీవిస్తున్నా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా

**న్యూఢిల్లీ, అక్టోబరు 29:** భారత్‌లో స్వేచ్ఛగా ఉండగలుగుతున్నానని, అయితే తన కుటుంబానికి ఎదురయ్యే హింసాత్మక ఘటనల చరిత్రకారణంగా కొంత అప్రమత్తంగా ఉంటున్నట్లు బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా అన్నారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో తన పార్టీని నిషేధిస్తే మిలియన్లకొద్దీ బంగ్లాజనాభా ఎన్నికలను బహిష్కరిస్తారని ఆమె హెచ్చరించారు. అంతర్జాతీయ మీడియా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ తనవల్లనే బంగ్లాదేశ్‌లో అశాంతి పెరిగిందన్న ఆరోపణలను కొట్టిపారేసారు. 2024 జులై, ఆగస్టునెలల్లో ఎగిసిన నిరసనలకు క్షమాపణలు చెప్పాల్సిన పనిలేదని, ఇదంతా జాతివ్యతిరేక కుట్రలని ఆమె ఆరోపించారు. ఢిల్లీలో తాను స్వేచ్ఛగా నివసిస్తున్నానని, కుటుంబ గత ఘటనల చరిత్రకారణంగా బయటకు వెళ్లలేకపోతున్నట్లు చెప్పారు. ఆనాటి బంగ్లాదేశ్ ఆర్మీచీఫ్ వకార్‌ఉజ్‌జమాన్ సలహా మేరకు షేక్ హసీనా బంగ్లాను వీడి భారత్‌కు వచ్చేసారు. తాను బంగ్లాదేశ్‌కు వెళ్లబోనని, తన పార్టీని నిషేధించి అధికారంలోకి వచ్చిన ఏపా లనలో అయినా కూడా తాను బంగ్లాదేశ్‌కువెళ్లనని భారత్‌లోనే ఉంటానని ఆమె స్పష్టంచేసారు. అయితే తాను స్వదేశానికి వెళ్లాలని ఎంతగానో తపిస్తున్నట్లు ఆమె చెప్పారు. సహేతుకమైన ప్రభుత్వం అన్ని పార్టీలను గౌరవించేప్రభుత్వం, రాజ్యాంగ నిబద్ధతను కాపాడే ప్రభుత్వం ఉన్నట్లయితే కచ్చితంగా తాను బంగ్లాదేశ్‌కు వెళతానని చెప్పారు. శాంతిభద్రతలు సజావుగా కొనసాగుతున్న తరుణంలో ఆదేశానికి వెళ్లడానికే ప్రాధాన్యతనిస్తానని షేక్ హసీనా అన్నారు.

## తమిళనాడులో భారీ జాబ్‌స్కామ్

### దర్యాప్తుచేయాలని ఇడి చెన్నై పోలీసులకు లేఖలు




**చెన్నై అక్టోబరు 29:** తమిళనాడు భారీ జాబ్ స్కామ్ బయటపడింది. రూ.35 లక్షలు లంచం చొప్పున తీసుకుని ప్రభుత్వ ఉద్యోగాలు అమ్మేస్తున్న వైనం తాజాగా వెలుగుచూసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చేపట్టిన సోదాల్లో ఈ భారీ కుంభకోణం బట్టబయలు అయ్యింది. తమిళనాడు రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై విభాగంలో ఉద్యోగాల కోసం రూ.25 లక్షల నుంచి రూ.35 లక్షలు వరకు ముడుపులు తీసుకుంటున్నారు. ఓ మనీలాండరింగ్ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చేపట్టిన సోదాల్లో ఈ జాబ్ స్కామ్ బయటపడింది. తమిళనాడు రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై విభాగానికి సంబంధించి 2024లో రిక్రూట్‌మెంట్ చేపట్టారు. ఇందులో అసిస్టెంట్ ఇంజినీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, జూనియర్ ఇంజినీర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితర పోస్టులు ఉన్నాయి. ఈ ఉద్యోగాల కోసం దాదాపు 1.12 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే రిక్రూట్‌మెంట్ పరీక్షను నిర్వహించి 2,538 మందిని జాబ్స్ కోసం ఎంపిక చేశారు. ఈ ఏడాది ఆగస్టులో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్వయంగా వీరికి నియామక పత్రాలు అందజేశారు. దాదాపు 150 మంది అభ్య ర్థులకు అనుకూలంగా పరీక్షలో రిగ్గింగ్ జరిగిందని తెలిపింది. ఇందుకోసం ఆయా అభ్యర్థుల నుంచి ఏకంగా రూ.25 లక్షల నుంచి రూ.35 లక్షలు చొప్పున లంచాలు తీసుకున్నట్లు గుర్తించామని చెప్పింది.దీనిపై దర్యాప్తు చేయాలని కోరుతూ తమిళనాడు హెడ్ ఆఫ్ పోలీస్ ఫోర్స్‌కు ఈడీ లేఖ రాసింది. ఈ కుంభకోణానికి సంబంధించి 232 పేజీల ఆధారాలను సమర్పించింది. ఈ పరీక్ష నిర్వహించిన అన్నా యూనివర్సిటీపై కూడా దర్యాప్తు చేయాలని ఈడీ కోరినట్లు తెలుస్తోంది. ఈ జాబ్ స్కామ్ వెలుగులోకి రావడంతో తమిళనాడులో రాజకీయ దుమారం చెలరేగింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో, ఈ కుంభకోణం వెలుగులోకి రావడంతో స్టాలిన్ సర్కార్ ఇరకాటంలో పడింది. ఇంతకుముందు కేంద్ర ప్రభుత్వంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధ్వజమెత్తారు. అవినీతిపరులు బీజేపీలో చేరగానే కడిగిన ఆణిముత్యాల్లా వైట్ వాష్ ఎలా అవుతున్నారని ఆయన ప్రశ్నించారు. తమిళనాడు ఆర్థిక మంత్రి తంగం తెన్నరసుతో పాటు యావత్ దేశ ప్రజల మనసుల్లో ఇంకా చాలా ప్రశ్నలు మెదులుతున్నాయని అన్నారు. వాటిలో కొన్ని ప్రశ్నలను తాను ఇప్పుడు కేంద్ర ప్రభుత్వాన్ని అడుగుతున్నానని చెప్పారు. బీజేపీ కూటమి అనే వాషింగ్ మెషీన్ అవినీతిపరులు, లంచగొండు లను మరక లేని తెలుపు రంగులోకి ఎలా మారుస్తోందో చెప్పాలని మోదీ సర్కారును సీఎం నిలదీశారు.

# బిసిల హక్కుల రక్షణకు ముందుంటా

### సగరకులాన్ని బిసి-డి నుండి బిసి-ఎలోకి మార్చేందుకు సంఘటితం కావాలి: మంత్రి వాకిటి శ్రీహరి

### బిసిలుగా ఐక్యమత్యంతో ఉద్యమిస్తేనే రిజర్వేషన్లు సాధించగలరు : ఎంపి ఈటల రాజేందర్

### సగరుల జీవన స్థితిగతుల దృష్ట్యా బిసి-ఎలోకి మార్చాలి : మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్



ఉత్తమ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి, ఉప్పరి శేఖర సగర, హరికిషన్, సత్యం, కుమారస్వామి, స్రవంతి, మారుతి తదితర సగర నాయకులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), అక్టోబరు 29 ప్రభాతవార్త :** సమగ్ర సర్వే నిర్వహించి సగర కులాన్ని బిసి-డి నుండి బిసి-ఎలోకి మార్చే విషయమై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డితో చర్చించి తనవంతు కృషిచేస్తానని హామీనిచ్చిన తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి వారి బతుకులు బాగుపడాలంటే బిసి-ఏలోకి మార్పు అనివార్యమని అభిప్రాయపడ్డారు. సగరులు స్థానిక సంస్థల నుండి చట్టసభల వరకు రాజకీయంగా ఎదగాలని అప్పుడే సమస్యలు పరిష్కారమౌతాయన్నారు. అయితే సగరులంతా సంఘటితం కావాలని పిలుపునిస్తూ బిసిల హక్కుల రక్షణకు ఎల్లవేళలా ముందుంటానని హామీనిచ్చారు. అనాదికాలం నుండి అన్నివిధాలా అణగదొక్కబడుతున్న వర్గాలను ఆర్థికంగా, రాజకీయంగా ఆదుకొని చేయూతనిచ్చేందుకు తమ ప్రజాప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. కోకాపేటలో గత ప్రభుత్వం కేటాయించిన రెండెకరాల స్థలం యాజమాన్య హక్కులు కల్పిస్తూ ఆత్మగౌరవ భవన నిర్మాణానికి కావాల్సిన నిధుల మంజూరుకు సంపూర్ణ కృషిచేస్తానని భరోసానిచ్చారు. తెలంగాణ సగర సంఘం, రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో సగర ఉత్తమ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి విశిష్ట అతిథులు పార్లమెంటు సభ్యుడు, మాజీమంత్రి ఈటల రాజేందర్, మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, బిసి సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ముత్యాల హరికిషన్, కుమారస్వామి, ఆంజనేయులు, మహేందర్, స్రవంతి, సతీష్ తదితర ప్రముఖ సగర నాయకులతో కలిసి జాతీయ రాష్ట్రస్థాయిల్లో 270మంది సగర ఉత్తమ విద్యా ర్థులను ఘనంగా సన్మానించి ప్రతిభా పురస్కా రాలను ప్రదానంచేసి మున్ముందు అత్యున్నత విద్యలో కూడా గొప్పగా రాణించి అవార్డులు, రివార్డులు అందుకుని దేశానికి భావిభవిష్యత్ నిర్మాతలుగా సేవలందించాలని సూచించారు.

ఈ సందర్భంగా పార్లమెం టు సభ్యుడు ఈటల రాజేందర్ బిసిలు కులాల వారీగాకాకుండా బిసిలంతా ఐకమత్యంతో ఉద్యమిస్తేనే రిజర్వేషన్లు సాధించగలరని స్పష్టం చేశారు. దేశంలో వివిధ రాష్ట్రాల్లో రిజర్వేషన్ల శాతంలో తేడాలున్నాయని, తెలంగాణలో జనాభా ప్రాతిపదికన 42శాతం రిజర్వేషన్లు సాధించేం దుకు జెండాలు, పార్టీలను పక్కకుపెట్టి ఐక్య ఎజెండాతో ముందుకుసాగాలన్నారు.

మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ సగరుల జీవన స్థితిగతులను దృష్టిలో పెట్టుకుని వారిని వెంటనే బిసి-ఏలోకి మార్చాలన్నారు. ఈ విషయంలో ఉద్యమిస్తే తమ పూర్తిసహకారం ఉంటుందని తెలిపారు. ఏదియే మైనా నేటి పోటీ ప్రపంచంలో విద్యతోనే అన్నిరంగాల్లో పురోగతితో దేనైనా సాధించగల మని, సగర చిన్నారులు విద్యలో ప్రతిభావం తులుగా రాణించడం హర్షదా యక మని పురస్కారగ్రహీతలను, వారి తల్లిదండ్రులను వక్తలంతా అభినందించారు.

## కెనడాలో పంజాబ్ వ్యాపారవేత్తను కాల్చి చంపిన బిష్ణోయ్ గ్యాంగ్

**టొరంటో, అక్టోబరు 29:** లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ కెనడాలో భారత సంతతికి చెందిన వ్యాపారవేత్త దర్శన్ సింగ్ సహాసిని హత్య చేసింది, పంజాబీ గాయకుడి ఇంట్లో కాల్పులు జరిపింది తామేనని తాజాగా ఆ గ్యాంగ్ ప్రకటించింది. అమెరికాలోని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌లో కీలక సభ్యుడైన జగదీప్ సింగ్ అలియాస్ జగ్గాను రాజస్థాన్ పోలీసులు అరెస్టు చేసిన ఒక రోజు తర్వాత ఈ రెండు ఘటనలు జరిగాయి. దర్శన్ సింగ్ సహాసిని హత్య చేసింది తామేనని బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యుడు గోల్డీ ధిల్లాన్ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు పెట్టాడు. "దర్శన్ పెద్ద స్థాయిలో మాదక ద్రవ్యాల వ్యాపారం చేశాడు. అయితే మేము డిమాండ్ చేసినంత డబ్బు అతను మాకు ఇవ్వలేదు. అందుకే అతనిని కాల్చి చంపామని అందులో పేర్కొన్నాడు. పోలీసు రిపోర్టు ప్రకారం, సోమవారం ఉదయం బ్రిటీష్ కొలంబియాలోని అబోట్స్‌ఫోర్డులోని సొంత ఇంటి ముందే దర్శన్ సహాసిని కాల్చి చంపారు. దర్శన్ సింగ్ సహాసి పంజాబ్‌లోని రాజ్‌గఢ్ గ్రామానికి చెందినవారు. ఆయన 1991లో కెనడా వెళ్లారు. అక్కడే కనెమ్ అనే టెక్స్‌టైల్ రీసైక్లింగ్ కంపెనీ పెట్టి, వందల కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని స్థాపించారు. అయినప్పటికీ ఎల్లప్పుడూ తన గ్రామానికి ఆర్థికంగా సాయం చేస్తూనే ఉండేవారు. అందుకే ఆయన మరణవార్తతో ఆ గ్రామం మొత్తం విషాధ ఛాయలు అలముకున్నాయి. దర్శన్ విదేశాల్లో వ్యాపారవేత్తగా రాణించినప్పటికీ, ఎప్పుడూ తన మూలాలను, సొంత ఊరుని విస్మరించలేదని గ్రామస్థులు చెబుతున్నారు. ఆయన అందరికీ సహాయం చేసేవాడని గుర్తు చేసుకుంటున్నారు. దర్శన్ పూర్వీకుల ఇంటి వద్ద గుమిగూడిన స్థానికులు, ఆయన కుటుంబాన్ని ఓదార్చారు. భారతదేశానికి వచ్చినప్పుడల్లా ఆయన రాజ్‌గఢ్‌లోని కార్యాలయాన్ని సందర్శించేవారు. గ్రామస్థులతో సఖ్యంగా ఉండేవారు. ఆయన అందరిలో ఒకరిగా తిరిగేవారు. అహంకారం ఏమాత్రం లేదు. ఆయన తన స్వగ్రామంలో చాలా మందికి ఉపాధి అవకాశాలను సృష్టించాలని అనుకున్నారని దర్శన్ కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు.

# ఘనంగా 'మాస్ జాతర' ప్రి రిలీజ్ వేడుక



**మాస్ మహారాజా** రవితేజ అభిమానులతో పాటు తెలుగు సినీ ప్రియులంతా ఎంతగానో ఎదురుచూస్తున్న చిత్రం 'మాస్ జాతర'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. తెలుగులో ఎన్నో విజయవంతమైన చిత్రాలకు రచయితగా పనిచేసిన భాను భోగవరపు ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రవితేజ, శ్రీలీల, నవీన్ చంద్ర ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. అక్టోబర్ 31వ తేదీ సాయంత్రం ప్రత్యేక ప్రదర్శనలతో థియేటర్లలో అడుగుపెట్టనున్న 'మాస్ జాతర' చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని జె.ఆర్.సి కన్వెన్షన్‌లో ప్రీ రిలీజ్ వేడుకను చిత్ర బృందం ఘనంగా నిర్వహించింది. అభిమానుల కోలాహలం నడుమ వైభవంగా జరిగిన ఈ వేడుకకు తమిళ అగ్ర కథానాయకుడు సూర్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రముఖ కథానాయకుడు సూర్య మాట్లాడుతూ.. 'అభిమానుల మధ్యలో జరిగే ఇలాంటి వేడుకకు హాజరవ్వడం నాకిష్టం. నన్ను ఆహ్వానించిన నాగవంశీ గారికి కృతజ్ఞతలు. రవితేజ గారితో నాది 20 ఏళ్ల అనుబంధం. చాలాఏళ్లుగా రవితేజ గారిపై అభిమానులు ఎంతో ప్రేమని కురిపిస్తున్నారు. తన సహజ నటనతో పాత్రకు ప్రాణం పోస్తారు. ఇడియట్, కిక్ సహా రవితేజ గారు నటించిన పలు సినిమాలు తమిళ్‌లోనూ మంచి ఆదరణ పొందాయి. రవితేజ గారు ఇలాగే వినోదాన్ని పంచుతూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. అక్టోబర్ 31న మాస్ జాతర రూపంలో రవితేజ గారి జాతర చూడబోతున్నాం. నాగవంశీ గారు వరుస సినిమాలు చేస్తున్నారు. ఆయన బ్యానర్‌లో నేను ఒక సినిమా చేస్తుండటం సంతోషంగా ఉంది. అక్టోబర్ 31 విడుదలవుతున్న మాస్ జాతర సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటూ, టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్" అన్నారు.

మాస్ మహారాజా రవితేజ మాట్లాడుతూ.. 'నాకిష్టమైన వ్యక్తుల్లో ప్రొడక్షన్ డిజైనర్ నాగేంద్ర గారు ఒకరు. ఆయన వేసిన సెట్స్ అద్భుతంగా ఉంటాయి. ఈ చిత్రంలో యాక్షన్ బాగుందంటే ఆ క్రెడిట్ మా ఫైట్ మాస్టర్స్ వెంకట్, పృథ్వీకి వెళ్తుంది. మా సంగీత దర్శకుడు భీమ్స్ ఇంకో చార్ట్ బస్టర్ ఇచ్చాడు. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కూడా అద్భుతంగా ఇచ్చాడు. శివుడు పాత్ర చేసిన నవీన్ గురించి మాట్లాడాలి. నవీన్ ఇలా కూడా చేయగలడా అని ఆశ్చర్యపోయేలా చేశాడు. రాజేంద్రప్రసాద్ గారి పాత్ర అద్భుతంగా ఉంటుంది. నాది, శ్రీలీలది సూపర్ హిట్ జోడి. ఈ సినిమాలో కొత్త శ్రీలీలను చూడబోతున్నారు. ఈరోజు గెస్ట్ గా విచ్చేసిన సూర్య గారికి థాంక్యూ సో మచ్. భాను రూపంలో మన పరిశ్రమకి మరో మంచి దర్శకుడు వస్తున్నాడు. మాస్ మాత్రమే కాదు, అన్ని రకాల సినిమాలు చేయగలడు. రచయిత నందుకి మంచి భవిష్యత్తు ఉంది. మాస్ జాతర చిత్రం మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను'అన్నారు. కథానాయిక శ్రీలీల మాట్లాడుతూ.. 'పెళ్లి సందడి విడుదలకు ముందు రవితేజ గారితో ధమాకా సినిమా చేశాను. భాను గారు అద్భుతంగా సినిమాని తెరకెక్కించారు. నాకు, రవితేజ గారి మధ్య వచ్చే సన్నివేశాలు, అలాగే రాజేంద్ర ప్రసాద్ గారి సన్నివేశాలు చాలా బాగుంటాయి. నాకు ఈ అవకాశం ఇచ్చిన నాగవంశీ గారికి, సితార బ్యానర్‌కి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. ఈ సినిమా చూసి ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేస్తారు" అన్నారు. నటకిరీటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. "అన్ని మసాలాలు సరిగ్గా ఉన్న మాస్ సినిమా ఈ మధ్య కాలంలో రాలేదు. ఆ లోటుని తీర్చే సినిమా ఈ మాస్ జాతర. ఇప్పటిదాకా ఎందరో హీరోలతో కలిసి నటించాను. కానీ, రవితేజతో నటించలేదు. 'మాస్ జాతర' లాంటి మంచి సినిమా చేయాలనే ఇంత సమయంపట్టినట్టుంది. దర్శకుడు భాను అద్భుతమైనసినిమాని రూపొం దించాడు. సినిమా ఎలా ఉంటుంది? నా పాత్ర ఎలా ఉంటుంది? అనేది ఇప్పుడు చెప్పను. మీరు ఖచ్చితంగా థియేటర్ లోచూసి ఆనందించాల్సిన చిత్రమిది. అద్భుతమైన మాస్ సినిమా ఇది. 'మాస్ జాతర' సినిమా చూసిన తర్వాత తెలుగు ప్రేక్షకులంతా మమ్మల్ని మెచ్చుకుంటారు." అన్నారు.

నటుడు నవీన్ చంద్ర మాట్లాడుతూ.. "చాలారోజుల తర్వాత మాస్ జాతర రూపంలో శక్తివంతమైన పాత్ర లభించింది. రవితేజ గారు నా లాంటి ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు. శివుడు అనే అద్భుతమైన పాత్రను నాకు ఇచ్చిన దర్శకుడు భాను గారికి ధన్యవాదాలు. 'అరవింద సమేత'లో బాలరెడ్డి పాత్ర తర్వాత నా కెరీర్ లో గుర్తిండిపోయే పాత్ర ఇది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌కి నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను. అక్టోబర్ 31న విడుదలవుతున్న ఈ సినిమా అసలు నిరాశ పరచదు. ముఖ్యంగా రవితేజ గారి అభిమానులు ఈ సినిమాని బాగా ఎంజాయ్ చేస్తారు." అన్నారు.నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ.. 'వెంకీ, విక్రమార్కుడు, కిక్ చిత్రాల్లాగా రవితేజ గారి సినిమా అంటే ఏమి ఆశించి థియేటర్‌కి వస్తారో.. అన్ని అంశాలు మాస్ జాతరలో ఉంటాయి.ఈ వేడుకకు విచ్చేసిన సూర్య గారికి ధన్యవాదాలు' అన్నారు.దర్శకుడు భాను భోగవరపు మాట్లాడుతూ.. "రవితేజ గారు దర్శకులను పరిచయం చేసే ఒక యూనివర్సిటీ నెలకొల్పారు. ఆ యూనివర్సిటీలో సీట్ ఇచ్చిన రవితేజ గారికి ధన్యవాదాలు.నా దగ్గర ఉన్న ఒకే ఒక అర్హత నా కథ. ఆ కథ నచ్చి రవితేజ గారు నాకు అవకాశమిచ్చారు. ఇందులో తులసి అనే పాత్ర శ్రీలీల పోషించారు. భీమ్స్ గారు అద్భుతమైన సంగీతం అందించారు. నటీనటులు, సాంకేతిక బృందం ఇచ్చిన మద్దతుని ఎప్పటికీ మరిచిపోలేను. నా దృష్టిలో నాగవంశీ గారి కంటే గొప్ప క్రిటిక్ లేరు. ఆయనకు సినిమా నచ్చిందంటే అది హిట్టే. వంశీ గారు ఈ సినిమా చూసి చాలా బాగుంది అన్నారు. అక్టోబర్ 31 కోసం మీ అందరిలాగే నేను కూడా ఎంతగానో ఎదురుచూస్తున్నాను." అన్నారు. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో మాట్లాడుతూ.. "ధమాకా తర్వాత చిరంజీవి గారి సినిమాకి పనిచేసే అవకాశాన్ని దక్కించుకున్నాను. ఈరోజు నేను ఇక్కడ ఇలా నిలబడి ఉన్నానంటే దానికి కారణం రవితేజ గారు. ఈ అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు, ఈ సినిమాలో భాగమైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు" అన్నారు.

# హీరోయిన్‌గా 'జాన్వి ఘట్టమనేని' ఎంట్రీ



**సూపర్‌స్టార్ కృష్ణ** ఘట్టమనేని వారసత్వం తెలుగు సినీ పరిశ్రమలో విశిష్టమైనది. ఇప్పుడు ఘట్టమనేని లెగసీ నుంచి తొలిసారిగా హీరోయిన్‌గా వెలుగులోకి రానున్నది జాన్వి ఘట్టమనేని. ఆమె తన తాత కృష్ణగారి గ్రేస్, తన మామ మహేష్ బాబుగారి మాగ్నటిజం, తల్లి మంజుల ఘట్టమనేని గారి ఆత్మీయతను తనలో కలుపుకుని గొప్ప వ్యక్తిత్వంగా రూపుదిద్దుకుంది. జాన్వి ఘట్టమనేని క్లాసిక్ బ్యూటీ. ఇటీవల వెలుగుచూసిన ఆమె ఫొటోలు సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందన తెచ్చుకున్నాయి. ఇండస్ట్రీ వర్గాలు ఆమెను 'ఇటీవలి తెరపై కనిపించే అత్యంత అందమైన అమ్మాయి'గా అభివర్ణిస్తున్నాయి. దర్శకులు ఆమె నటనను చూసి 'మాటలకన్నా కళ్ళతోనే భావాలను చెప్పగల సహజ నటిగా' వర్ణించారు. ఆమె ప్రతిభతో పాటు క్రమశిక్షణ కూడా ప్రత్యేకం. పెయింటింగ్, డ్యాన్స్, ఫిట్‌నెస్, డ్రైవింగ్, గేమింగ్ ప్రతి విషయంలోనూ సమాన ఆసక్తి చూపిస్తుంది. జిమ్‌లో ట్రైనింగ్ తో మొదలై తన డే, నైట్ తన ఆర్ట్ కార్నర్‌లో ముగుస్తుంది. కొత్తగా సినీ రంగంలోకి వచ్చే వాళ్లు సాధారణంగా ఒకే గుణంతో గుర్తింపుపొందుతారు. కానీ జాన్వి ఘట్టమనేని మాత్రం అందం, మాధుర్యం, ప్రతిభ, వారసత్వం.. ఈ నాలుగింటినీ కలగలిపిన ప్రత్యేక వ్యక్తిత్వం. బ్రాండ్ నిపుణులు ఆమెను 'దక్షిణాది శైలి, పాన్‌ఇండియా అప్పీల్ కలిగిన ఫేస్' అని పేర్కొంటున్నారు. సూపర్ స్టార్ కృష్ణగారు, మహేష్ బాబు కుటుంబం నుండి వస్తున్న జాన్వి ఎంట్రీ ఒక విధంగా విధి నెరవేరుతున్న క్షణం. జాన్వి సంప్రదాయలుక్ నుంచి మోడరన్ గ్లామర్ వరకు సునాయాసంగా మెరిసిపోతుంది. ఇంకా సినిమా రిలీజ్ కాకముందే ఆమెకు గుర్తింపు వచ్చేసింది. ఒక అద్భుతమైన జ్యువెలరీ క్యాంపెయిన్ తర్వాత, జాతీయ స్థాయి బ్రాండ్లు, దర్శకులు ఆమెను సంప్రదించారు. నిర్మాతలు ఆమెను 'దశాబ్దంలో ఒక్కసారి దొరికే ఆర్టిస్ట్, మాట్లాడకముందే స్క్రీన్‌ను ఆక్రమించే ప్రెజెన్స్' అని చెబుతున్నారు. యాక్టింగ్ ట్రైనింగ్స్, డాన్స్ రిహార్సల్స్, ఫిట్‌నెస్ సెషన్‌లతో ఆమె షెడ్యూల్ ఇప్పటికే ఒక స్టార్ లా వుంటుంది. సినిమా కుటుంబంలో పుట్టినా, ఆమె నటనపైఉన్న ప్రేమ మాత్రం వారసత్వం కాదు ..సహజ స్వభావం. పదేళ్ల వయసులోనే తల్లి మంజుల ఘట్టమనేని దర్శకత్వం వహించిన 'మనసుకు నచ్చింది' సినిమాలో కెమెరా ముందు కొచ్చిన జాన్వి తన సహజమైన నటనతో అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆమె నటించదు, ఫీల్ అవుతుంది. మంజులకి ఇది ప్రత్యేకమైన క్షణం. ఎన్నేళ్ల క్రితం ఆమెకూ నటనపై కలలు ఉండేవి, కానీ ఆ కాలం మహిళలకు అంత అనుకూలంగా ఉండేది కాదు. ఇప్పుడు మాత్రం ప్రపంచం సిద్ధంగా ఉంది, ప్రేమతోఉంది, ఎదురుచూస్తోంది. 'నన్ను అడ్డుకున్న వారే ఇప్పుడు జాన్వి కోసం ప్రార్థిస్తున్నారు. జాన్వి చిరునవ్వు నా ప్రార్థనలకు సమాధానం'అన్నారు మంజుల.



## 'చైనా పీస్' నుంచి సాంగ్ రిలీజ్

**నిహాల్ కోధాటి,** సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాథ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న యూనిక్ స్పై డ్రామా 'చైనా పీస్'. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌లో తెరకెక్కిన ఈ చిత్రంలో కమల్ కామరాజు, రఘుబాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్ర పోషించారు. యూనిక్ కాన్సెప్ట్, ప్రెజెంటేషన్, యాక్షన్, థ్రిల్, హ్యూమర్ ఎలిమెంట్స్‌తో టీజర్ సినిమాపై అంచనాలు పెంచింది. తాజాగా మేకర్స్ ఈ సినిమా నుంచి ఇదేంటో జేమ్స్ బాండ్ సాంగ్ రిలీజ్ చేశారు. కార్తీక్ రోడ్రిగ్జ్ ఈ సాంగ్‌ని ఎనర్జిటిక్‌గా కంపోజ్ చేశారు. స్ఫూర్తి జితేందర్, హారిక నారాయణ్ వోకల్స్ ఆకట్టుకున్నాయి. దినేష్ కాకర్ల లిరిక్స్ కాన్సెప్ట్‌ని చాలా ఫన్ ఫుల్ గా ప్రజెంట్ చేశాయి. ఈ చిత్రానికి సురేష్ రగుతు కెమెరామ్యాన్. మార్తాండ్ కె. వెంకటేష్ ఎడిటర్. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

## 'రాజు వెడ్స్ రాంబాయి' తెలుగు ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమా అవుతుంది: నిర్మాత వేణు ఊడుగుల

**అఖిల్, తేజస్విని** జంటగా నటిస్తున్న సినిమా 'రాజు వెడ్స్ రాంబాయి'. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్స్ ప్రొడక్షన్ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రాన్ని డా.నాగేశ్వరరావు పూజారి సమర్పణలో డోలాముఖి సుబల్టర్న్ ఫిలింస్, మాన్ సూన్స్ టేల్స్ బ్యానర్స్ పై వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మిస్తున్నారు. సాయిలు కంపాటి దర్శకత్వం వహిస్తున్నారు. నవంబర్ 21న 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమాను వంశీ నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై వంశీ నందిపాటి, బన్నీవాస్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నారు. ఈ రోజు హైదరాబాద్‌లో ఈ చిత్ర రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నిర్మాత బన్నీ వాస్ మాట్లాడుతూ రాజు వెడ్స్ రాంబాయి సినిమా చూశాను. ఇది నా మనసుకు హత్తుకుంది. కొందరి లైఫ్‌లో జరిగిన ఘటనల ఆధారంగా ఈ సినిమా చేశారు. ఇది కాల్పనిక కథ అయితే మనం ఆ దర్శకుడి ఊహకు ఆశ్చర్యపోయేవాళ్లం. ఈ సినిమా చూసి బయటకు వచ్చే ప్రేక్షకులు ఒక ఎమోషనల్ ఫీల్ తో వస్తారు. అఖిల్ రాజు పాత్రలో బాగా నటించాడు. తేజస్విని తెలుగు అమ్మాయి. ఈ సినిమాలో తన స్క్రీన్ ప్రెజెన్స్, పర్ ఫార్మెన్స్ తో ఆకట్టుకుంది. హీరో సిద్ధు జొన్నలగడ్డ బ్రదర్ చైతన్య ఒక మంచి రోల్ చేశాడు. వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నారు అన్నారు. నటుడు చైతు జొన్నలగడ్డ మాట్లాడుతూ ఇది పక్కా తెలంగాణ సినిమా. తెలంగాణ నేటివిటీని, ఇక్కడి ప్రజల జీవితాలను



ఈ చిత్రంలో చూస్తాం. తెలంగాణ నేటివిటీని ఇంత పర్ఫెక్ట్ గా చూపించిన సినిమా మరొకటి లేదు. ఈ చిత్రంలో ఒక ఇంపార్టెంట్ రోల్ చేయడం హ్యాపీగా ఉంది. అన్నారు. డైరెక్టర్ సాయిలు కంపాటి మాట్లాడుతూ '2016 నుంచి ఈ కథ పట్టుకుని తిరుగుతూ ఉన్నాను. ఒకే ఒక నెరేషన్‌లో వేణు ఊడుగులగారు మనం సినిమా చేస్తున్నాంరా తమ్ముడు అన్నారు. ఈటీవీ విన్ వారిని అప్రోచ్ అయితే వాళ్లకూ కథ నచ్చింది. సాయికృష్ణ, నితిన్ నాకు బ్రదర్స్‌లా సపోర్ట్‌చేశారు. సురేష్ బొబ్బిలి అన్న మ్యూజిక్ ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది'అన్నారు. ప్రొడ్యూసర్ వేణు ఊడుగుల మాట్లాడుతూ ఖమ్మం, వరంగల్ మధ్య జరిగిన ఓ రియల్ ఇన్సిడెంట్ ఆధారంగా ఈ చిత్ర కథను దర్శకుడు సాయిలు రాసుకున్నాడు. ప్రేమతో కూడిన విషాదభరితమైన ఈ సంఘటన ఆ ఊర్లోనే జరిగి అక్కడే సమాధి అయ్యింది. దాన్ని బేస్ చేసుకుని సాయిలు ఒక మంచి స్క్రిప్ట్ రాశాడు. ఈటీవీ విన్ వారి వల్లే నేను ప్రొడ్యూసర్ ను అయ్యాను. నవంబర్ 21న రాజు వెడ్స్ రాంబాయి రిలీజ్ అవుతుంది. నా డైరెక్షన్‌లో యూవీ క్రియేషన్స్‌లో ఓసినిమా చేయబోతున్నాను' అన్నారు. హీరోయిన్ తేజస్వినీ మాట్లాడుతూ రాజు వెడ్స్ రాంబాయి సినిమాలో రాంబాయి క్యారెక్టర్‌తో మీ ముందుకు రాబోతున్నాను. ఈ సినిమా, ఈ క్యారెక్టర్ నా మనసుకు ఎంతో దగ్గరయ్యాయి. సినిమా చూస్తున్నంత సేపు మీరు ఒక ఎమోషన్ కు గురవుతారు.తెలుగు ఆడియెన్స్ కు మా మూవీ బాగా నచ్చుతుంది'అన్నారు. హీరో అఖిల్ మాట్లాడుతూ 'నన్ను హీరోగా పరిచయం చేస్తున్న వేణు గారికి, ఈటీవీ విన్ వారికి థ్యాంక్స్'అన్నారు. ఈటీవీ విన్ నితిన్ మాట్లాడుతూ 'మన ప్రాంతంలో జరిగిన ఒక నిజమైన ఘటన నేపథ్యంగా ఈ సినిమా ఉంటుంది. రాజు వెడ్స్ రాంబాయి సినిమా రిలీజ్ అయ్యాక తెలుగు ఆడియెన్స్ అంతా ఒకసారి మా మూవీ గురించి మాట్లాడుకుంటారు' అన్నారు. ఈటీవీ విన్ సాయికృష్ణ మాట్లాడుతూ 'ఈ సినిమా గ్రేటెస్ట్ లవ్ స్టోరీ అని మేము అంటున్నాం. చిన్న సినిమా పెద్ద సినిమా అని చూడకుండా మంచి సినిమాలను రిలీజ్ చేస్తున్న వంశీ నందిపాటి, బన్నీ వాస్ గారికి థ్యాంక్స్' అన్నారు. నిర్మాత వంశీ నందిపాటి మాట్లాడుతూ లిటిల్ హార్ట్స్ మూవీ చేసిన వెంటనే మేము రిలీజ్ చేస్తున్న ప్రాజెక్ట్ ఇది. ఈ సినిమా రిలీజ్ తర్వాత ఇందులోని చాలా మందిని తెలుగు ఫిలిం ఇండస్ట్రీ గుర్తుపెట్టుకుంటుంది' అన్నారు.



## 'ఆర్యన్' తెలుగులో నవంబర్ 7న రిలీజ్

**విష్ణు విశాల్** మోస్ట్ ఎవైటెడ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'ఆర్యన్', ప్రవీణ్ కె దర్శకత్వంలో విష్ణు విశాల్ స్టూడియోజ్, శుభ్రా, ఆర్యన్ రమేష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అక్టోబర్ 31న విడుదల చేయాలని ముందుగా అనుకున్న ఈ సినిమా నవంబర్ 7కి వాయిదా పడింది. అయితే, తమిళ వెర్షన్ షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 31న విడుదల కానుంది. శ్రేష్ట్ మూవీస్ అధినేత సుధాకర్ రెడ్డి ఈ సినిమాను ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో విడుదలచేయనున్నారు. టీజర్, ట్రైలర్, ఫస్ట్ సింగిల్ అద్భుతమైన స్పందనను పొంది సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. వాయిదాకు గల కారణాలను స్పష్టం చేస్తూ విష్ణు విశాల్ ఒక అనౌన్స్‌మెంట్ విడుదల చేశారు. సినిమా అనేది రేస్ కాదు, అది ఒక వేడుకని నేను ఎప్పుడూ నమ్ముతాను. ప్రతి వేడుకకీ తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానం, వెలుగు ఉండాలి. మా చిత్రం 'ఆర్యన్' అక్టోబర్ 31న విడుదల కావలసి ఉంది. ఈ ప్రత్యేక తేదీ మాస్ మహారాజా రవితేజ గారి 'మాస్ జాతర', పవర్ ఫుల్ 'బాహుబలి ది ఎపిక్' మీ అందరినీ అలరించడానికి రావడంతో మరింత ప్రత్యేకమైనది. నేను ఎప్పటినుంచో రవితేజ గారిని గాఢంగా ఆరాధిస్తాను. స్క్రీన్‌పైన ఆయన ఎనర్జీకి మాత్రమే కాకుండా, మాకు ఆయన మద్దతు కూడా వుంది. అలాగే, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి గారికి నేను లైఫ్ టైం ఫ్యాన్‌ని. ఈ వారం వారి సినిమాలని సెలబ్రేట్ చేసుకోవడం సరైనదని భావిస్తున్నాను. 'ఆర్యన్' సినిమా తమిళ్ విడుదలైన ఒక వారం తర్వాత అదే పాషన్, థ్రిల్‌తో నవంబర్ 7న తెలుగులోకి వస్తుంది. మీ మద్దతుకు నేను హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.నా నిర్ణయానికి అండగానిలిచిన మా డిస్ట్రిబ్యూటర్లు శ్రీ సుధాకర్ రెడ్డి గారు, మహేశ్వర్ రెడ్డి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. నా సినిమా తనకంటూ ఒక మంచిస్థానం సంపాదించుకోవాలని నేను కోరుకుంటున్నాను. తెలుగు ప్రేక్షకుల కోసం విభిన్నమైన సినిమాలు అందించాలనే నా ప్రయత్నంలో ఇది ఒక మంచి ప్రారంభం అవుతుందని నేను నమ్ముతున్నాను అన్నారు.

## మాస్ అంశాలతో కూడిన చిత్రం 'మాస్ జాతర'

### - చిత్ర దర్శకుడు భాను భోగవరపు

**మాస్ మహారాజా** రవితేజ 75వ చిత్రం 'మాస్ జాతర'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార=ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. తెలుగులో ఎన్నో విజయవంతమైన చిత్రాలకు రచయితగా పనిచేసిన భాను భోగవరపు ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రవితేజ, శ్రీలీల, నవీన్ చంద్ర ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. అక్టోబరు 31వ తేదీ సాయంత్రం ప్రత్యేక ప్రదర్శనలతో థియేటర్లలో అడుగుపెట్టనున్న 'మాస్ జాతర' చిత్రం కోసం మాస్ మహారాజా అభిమానులతో పాటు తెలుగు సినీ ప్రియులంతా ఎంతగానో ఎదురుచూస్తున్నారు. తాజాగా మీడియాతో ముచ్చటించిన దర్శకుడు భానుభోగవరపు, సినిమాకి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.



**మాస్ జాతర ఎలా ఉండబోతుంది? ఏమైనా ప్రత్యేకతలు ఉన్నాయా?** ఇందులో మాస్ అంశాలు ఉంటాయి. అదే సమయంలో ఒక కొత్త పాయింట్ కూడా ఉంటుంది. రైల్వే పోలీస్ నేపథ్యంలో ఈ కథ జరుగుతుంది. ఆ నేపథ్యంలో జరిగే క్రైమ్ కొత్తగా ఉంటుంది. సన్నివేశాలు కూడా కొత్తగా ఉంటాయి. 'మాస్ జాతర' అనే టైటిల్ రవితేజ గారే చెప్పారు. కథ విన్న తర్వాత వినోదంతో పాటు అన్ని అంశాలు బాగున్నాయి అంటూ ఆయన ఈ టైటిల్ సూచించారు. ఆ టైటిల్ తర్వాత నాపై బాధ్యత మరింత పెరిగింది. మాస్ అంశాలు మరిన్ని జోడించాను. థియేటర్ లో ప్రేక్షకులు కొన్ని సర్ ప్రైజ్ లు చూడబోతున్నారు. **ఏదైనా ప్రేరణతో ఈ రైల్వే పోలీస్ కథను రాసుకున్నారా?** ఇది కల్పిత కథే. అయితే ఈ కథ కోసం ఎంతో రీసెర్చ్ చేశాను. పలువురు రైల్వే పోలీస్ అధికారులను కలిసి వారి అధికారాల గురించి, వారు ఎదుర్కొన్న సంఘటల గురించి తెలుసుకున్నాను. వాటి స్ఫూర్తితో ఈ కథకుతగ్గట్టుగా కొన్ని సన్నివేశాలు రాసుకోవడం జరిగింది. **రవితేజ గారి 75వ చిత్రానికి దర్శకత్వం వహించడం ఎలా అనిపించింది?** ఇది రవితేజ గారి 75వ చిత్రమని మాకు ముందు తెలియదు. రవితేజ గారికి కథ నచ్చి, సినిమా ఓకే అయిన తర్వాత.. అప్పుడు లెక్కేస్తే 75వ సినిమా అని తెలిసింది. కథ బాగుంది, ఈ నెంబర్ల గురించి ఆలోచించకుండా ప్రశాంతంగా సినిమా చేయమని రవితేజగారు నన్ను ఎంతో ప్రోత్సహించారు. **నవీన్ చంద్ర గారి పాత్ర గురించి?** శివుడు అనే శక్తివంతమైన ప్రతినాయక పాత్ర పోషించారు. ఈ పాత్ర కోసం మొదట వేరే ఇద్దరు ముగ్గురు నటుల పేర్లు కూడా పరిశీలించాము. కానీ, సంతృప్తి లేదు. అలాంటి సమయంలో నవీన్ చంద్ర గారిని కలిసి కథ వినిపించాను. ఆయనకు కథ నచ్చి సినిమా చేయడానికి అంగీకరించారు. శివుడు పాత్రకు నవీన్ చంద్ర గారు పూర్తి న్యాయం చేశారు. సినిమా విడుదలైన తర్వాత శివుడు పాత్ర గురించి అందరూ ప్రత్యేకంగా మాట్లాడుకుంటారు. **శ్రీలీల పాత్ర గురించి ఏం చెబుతారు ?** ఇందులో తులసి పాత్ర కోసం వేరే ఏ హీరోయిన్ పేరు మేము అనుకోలేదు. కథ రాస్తున్నప్పుడు నేను, కథ వింటున్నప్పుడు హీరో గారు, నిర్మాతలు మాకు తెలియకుండానే.. హీరోయిన్ శ్రీలీల గారు అని అనుకున్నాం. ధమాకా జోడి కాబట్టి శ్రీలీల గారిని తీసుకోవాలనే ఆలోచనమాకులేదు. ఆమెపాత్రకు సినిమాలో ఎంతో ప్రాధాన్యముంది. గ్యాంగ్ లీడర్‌లో చిరంజీవి గారువిజయశాంతి గారి మధ్య సన్నివేశాలు ఎలాగైతే కామెడీ టచ్ తో మాసీగా ఉంటాయో.. ఇందులో రవితేజ గారుశ్రీలీల గారి మధ్య సన్నివేశాలు అలా ఉంటాయి. **రచయితగా కామెడీలో మంచి ముద్ర వేసిన మీరు, దర్శకుడిగా మాస్ సినిమాతో పరిచయమవ్వడానికి కారణం?** మాస్ జాతరలో కూడా వినోదానికి పెద్ద పీట వేశాము. అదేవిధంగా మాస్ అంశాలు కూడా పుష్కలంగా ఉంటాయి. నిజానికి 'సామజవరగమన' లాంటి రొమాంటిక్ కామెడీ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవ్వాలనుకున్నాను. అయితే ఎక్కువమంది మంచి మాస్ కథ ఉంటే చెప్పు అనేవారు. అలా 'మాస్ జాతర' కథ రాయడం జరిగింది. మాస్ కథ అంటే మొదట గుర్తుకొచ్చే పేరు రవితేజ గారు. ఆయనను దృష్టిలో పెట్టుకునే ఈ కథ రాశాను. రవితేజ గారు పోలీస్ సినిమాలు కొన్ని చేశారు. అందుకే కొత్తగా ఉండేలా ఈ రైల్వే పోలీస్ కథని రాసుకున్నాను. **భీమ్స్ గారి సంగీతం గురించి?** భీమ్స్ గారి పేరుని రవితేజ గారు సూచించారు. వారి కాంబినేషన్‌లో ధమాకా లాంటి చార్ట్ బస్టర్ వచ్చింది. అందుకే నేను కూడా భీమ్స్ గారు సంగీత దర్శకుడు అయితే బాగుంటుంది అనుకున్నాను. 'తు మేరా లవర్' అంటూ ఆయన స్వరపరిచిన మొదటి గీతమే నాకు ఎంతగానో నచ్చింది. **నిర్మాత నాగవంశీ గారి గురించి?** దర్శకుడిగా నాకిది మొదటి సినిమా అయినప్పటికీ నాగవంశీ గారు ఎంతో మద్దతుగా నిలిచారు. నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. ఖర్చుకి ఎక్కడా వెనకాడకుండా ఆరున్నర కోట్లతో స్టేషన్ సెట్ వేయించారు. ఓ కొత్త దర్శకుడికి ఎక్కడ రాజీపడకుండా ఇంతటి సహకారం అందించడం మామూలు విషయం కాదు.

## 'ప్రెడేటర్: బ్యాడ్‌లాండ్స్' అన్ని జోన్లతో కలిపిన హాలీవుడ్ చిత్రం!



**హాలీవుడ్ యాక్షన్ ప్రపంచాన్ని** షేక్ చేయడానికి 'ప్రెడేటర్: బ్యాడ్‌లాండ్స్' సిద్ధమైంది. దర్శకుడు డాన్ ట్రాచెన్‌బర్గ్ నుంచి వస్తున్న ఈ సినిమా అంచనాలకు మించి ఉందని ఫస్ట్ స్క్రీనింగ్ రిపోర్ట్స్ తెలియజేస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ చిత్రం ఒక సూపర్ హార్ట్ టచింగ్ ఎంటర్టైనింగ్, యాక్షన్ అడ్వెంచర్ అని రిపోర్టులు చెబుతున్నాయి.'బ్యాడ్‌లాండ్స్' కేవలం రక్తపాతం, వేట గురించి మాత్రమే కాకుండా యాక్షన్, సైఫై, మానవ సంబంధాలతో కూడిన ఒక మాస్టర్‌పీస్ అని క్రిటిక్స్ కొనియాడుతున్నారు. ఇది ఫన్, ఎమోషన్ నిండిన గెలాక్సీ రోడ్ మూవీ అని రివ్యూలు దూసుకుపోతున్నాయి. ట్రాచెన్‌బర్గ్ ఈసారి ప్రెడేటర్ యూనివర్స్‌ను మునుపెన్నడూ లేని విధంగా విస్తరించారు. కేవలం సర్వైవల్ గేమ్‌కు పరిమితం కాకుండా, ప్రెడేటర్ హంట్ వెనుక ఉన్న లెజెండ్, యాట్జుజా కల్చర్, వారి కోడ్ ఆఫ్ హానర్ లాంటి లోతైన కథాంశాలను డీల్ చేయడం ఫ్యాన్స్‌కు కొత్త అనుభూతిని ఇస్తోంది. ఈ విస్తృత కథనం సిరీస్‌కు కొత్త జీవితాన్ని ఇచ్చింది. ఇక డిమిత్రియస్ షస్టర్‌కొలోమాటాంగీ ఎల్లెఫ్యానింగ్ జోడీ తెరపై అద్భుతమైన కెమిస్ట్రీని పండించనుంది. ఏలియన్ హంట్ ఉద్రిక్తత మధ్యలో కూడా వారి మధ్య కనిపించే మానవత్వం, ఫ్రెండ్‌షిప్, హ్యూమర్ సినిమాకు సరికొత్త ఫీల్‌ను తెచ్చి, ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా చేస్తుందని రివ్యూల్లో హైలైట్ అవుతోంది. ఈ అసాధారణమైన బజ్ మధ్య 'ప్రెడేటర్: బ్యాడ్‌లాండ్స్' భారతీయ అభిమానుల కోసం నవంబర్ 7న థియేటర్స్‌లోకి అడుగుపెట్టబోతోంది. ఈసినిమా ఇంగ్లీష్, హిందీ, తెలుగు, తమిళం భాషల్లో విడుదలవుతుంది. డాన్ ట్రాచెన్‌బర్గ్ సృష్టించిన ఈ 'ఎమోషనల్ అడ్వెంచర్ హంట్' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సునామీ సృష్టిస్తుందో చూడాలంటే నవంబర్ 7 వరకు వేచి చూడాల్సిందే.

## అందాలతో ఆకట్టుకుంటున్న మృణాల్!

**సౌత్ నుంచి నార్త్** వరకు చాలామంది హీరోయిన్స్ సోషల్ మీడియాను వేదికగా చేసుకొని.. పలు రకాల ఫోటోలు షేర్ చేస్తూ.. ఫాలోవర్స్‌లో పెంచుకుంటున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా గ్లామర్ ఫోటోలుమాత్రమే కాకుండా సినిమాలకు సంబంధించి, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు అంశాలను షేర్ చేస్తూ నిత్యం అభిమానులకు టచ్ లో ఉంటున్నారు. ఇకపోతే అలా కొన్ని విషయాలను అభిమానులతో పంచుకుంటూ ఇటు గ్లామర్‌తో ఆకట్టుకుంటున్న హీరోయిన్స్‌లో మృణాల్ ఠాకూర్ కూడా ఒకరు. ఈమధ్య సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటున్న ఈమె.. తాజాగా చీర కట్టులో కనిపించి సాంప్రదాయంగా అభిమానులను అలరించింది. ప్రస్తుతం మృణాల్ ఠాకూర్ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. అమ్మడి అందానికి అభిమానులు ఫిదా అవ్వడమే కాకుండా పలు రకాల లవ్, ఫైర్ ఎమోజీలను షేర్ చేస్తూ ఆమెపై తమ ప్రేమను కురిపిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈమె ప్రస్తుత సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం అడవి శేషు హీరోగా నటిస్తున్న డెకాయిట్ సినిమాలో హీరోయిన్గా అవకాశాన్ని దక్కించుకుంది.. నిజానికి ఈ పాత్రలో శృతిహాసన్ ఎంపికైంది. కొంత భాగం షూటింగ్ కూడా కంప్లీట్ చేశారు. కానీ శృతిహాసన్‌కి చిత్ర బృందంతో విభేదాలు ఏర్పడ్డాయని.. అందుకే ఆమె తప్పుకోవడంతో ఆమె స్థానంలో మృణాల్‌ను తీసుకున్నారు అంటూ వార్తలు వచ్చాయి. అయితే ఈ విషయంపై అడవి శేషు స్పందిస్తూ.. శృతిహాసన్ బిజీ షెడ్యూల్ వల్ల ఈ సినిమాకు ఎక్కువ రోజులు కేటాయించలేకపోతు ఇబ్బంది పడుతున్నారు అందుకే ఆమె తప్పుకోవడం తోనే మృణాల్‌ను తీసుకున్నామని ఆయన క్లారిటీ కూడా ఇచ్చారు.





# అన్నదాత... గుండెకోత

పంటల సాగుపై మొంథా తుపాను ప్రభావం



## అన్నదాతలకు అపారనష్టం

వేల హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు

శ్రీకాకుళం, అక్టోబరు 29 ప్రభాతవార్త: మొంథా తుపాను కారణంగా జిల్లా వ్యాప్తంగా వరి పంటకు భారీ నష్టం వాటిల్లింది. తుఫాను వల్ల పొలాల్లో నీరు నిలవడం, ఈదురు గాలుల కారణంగా మొత్తం 2,025 హెక్టార్లలోని పంట దెబ్బతింది. ఈ విపత్తు కారణంగా సుమారు 4,801 మంది రైతులు ప్రభావితమైనట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా నివేదికలో వెల్లడించింది. ఈ మేరకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కోరాడ త్రినాథ స్వామి వివరాలు వెల్లడించారు. ప్రాథమిక నివేదిక ప్రకారం, జిల్లాలోని 13 మండలాల్లోని 120 గ్రామాల్లో పంట నష్టం సంభవించింది. నీట మునిగిన/ దెబ్బతిన్న పంటల్లో ప్రధానంగా వరి పంటకే అధిక నష్టం జరిగింది. మొత్తం దెబ్బతిన్న 2,025 హెక్టార్లలో 2,021 హెక్టార్లు వరి పంట కాగా, కేవలం 5 హెక్టార్లు మాత్రమే ఇతర పంటలు ఉన్నాయి. ఇచ్ఛాపురం మండలంలో 1,118 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. పాతపట్నంలో 168 హెక్టార్లలో పంట నష్టం జరిగి, 320 మంది రైతులు ప్రభావితమయ్యారు. నందిగాంలో 150 హెక్టార్లలో పంట నష్టం జరిగి 302 మంది రైతులు ప్రభావితమయ్యారు. వజ్రపుకొత్తూరులో 213 హెక్టార్లలో పంట దెబ్బతిని, 372 మంది రైతులు నష్టపోయారు. ఎచ్చెర్లలో 6 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. దెబ్బతిన్న పంటల్లో అధిక శాతం గింజ పడుతున్న దశలో ఉండడం వలన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ప్రాథమిక నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తున్నట్లు, తుది నష్ట అంచనా తర్వాత రైతులను ఆదుకునేందుకు అవసరమైన సహాయక చర్యలు చేపడతామని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. అలాగే జిల్లాలో ఉద్యాన పంటలకు స్వల్పంగా నష్టం వాటిల్లింది. జిల్లా ఉద్యానవన శాఖాధికారి రత్నాల వి. వరప్రసాద్ అందించిన నివేదిక ప్రకారం, ప్రధానంగా వాణిజ్య పంటలు దెబ్బతిన్నాయి. మొత్తం 11.39 హెక్టార్లలోని జీడి మామిడి పంట, 0.40 హెక్టార్లలోని బొప్పాయి, 0.45 హెక్టార్లలోని అరటి తోటలు, 2 హెక్టార్లలోని కూర గాయల సాగుకు నష్టం వాటిల్లింది. ముఖ్యంగా మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లో జీడి మామిడి, పలాసలో కూరగాయల సాగు తీవ్రంగా ప్రభావితమైంది. కవిటి, కంచిలి, వజ్రపుకొత్తూరు మండలాల్లో కలిపి సుమారు 278 కొబ్బరి మొక్కలు నేలకూలి దెబ్బతిన్నాయి. తుపాను ప్రభావం జిల్లాలోని 10 మండలాల్లోని 53 గ్రామాల్లో తీవ్రంగా ఉంది.

## నేలనంటిన వరి పంట

రూ.90 కోట్ల మేర నష్టం రైతుల్లో కలవరం

తణుకు, అక్టోబరు 29 ప్రభాతవార్త: మొంథా తుపాను తీరం దాటింది... తీరం దాటిన సమయంలో భారీ ఎత్తున గాలులు వీచాయి... ఇదే సమయంలో వరి పంటపై విరుచుకుపడిన తుపాను ఇప్పుడు రైతులను కలవరపాటుకు గురిచేస్తోంది. తణుకు పరిసర ప్రాంతాల్లో ఖరీఫ్ పంట ప్రస్తుతం చివరి దశకు చేరింది. మరో వారం పది రోజుల్లో కోతకు వచ్చే దశలో తుపాను ప్రభావంతో నేలనంటింది. ఎకరాకు రూ.20 నుంచి రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులు చేతికి అందివచ్చిన పంట వర్షార్పణం కావడంతో అన్నదాత కన్నీటి పర్యంతమవుతున్నారు. తణుకు నియోజకవర్గ పరిధిలోని ఆయకట్టుపై ఇప్పటికే సుమారు రూ.90 కోట్ల మేర పెట్టుబడి పెట్టారు. తణుకు నియోజకవర్గ పరిధిలోని ఇరగవరం, అత్తిలి, తణుకు మండలాల్లో 40,100 ఎకరాల విస్తీర్ణంలో 22,500 మంది రైతులు ఖరీఫ్ సాగు చేపట్టారు. సాధారణంగా 145 రోజులకు పంట కోతకు వస్తుంది. ఈదురు గాలులకు తట్టుకుంటుందనే ఉద్దేశంతో ఎక్కువ ఆయకట్టు పరిధిలో స్వర్ణ రకం విత్తనం సాగు చేశారు. ప్రస్తుతం పంట పాలు పోసుకునే దశలో, కొంత మేర గింజ గట్టిపడే దశలో ఉంది. ఇప్పటి వరకు సగటున ఎకరాకు రూ.20 నుంచి రూ.25 వేల వరకు ఖర్చు చేసినట్లు రైతులు చెబుతున్నారు. ఇప్పటికే బలమైన ఈదురు గాలులకు చేలలో కొంత భాగం వరి నేలకొరిగింది. దీంతోపాటు చేలల్లో నీరు వచ్చి చేరింది. 10 సెంట్ల భూమిలో పడిన వరిని నిలబెట్టి కట్టాలంటే నలుగురు కూలీలు అవసరమవుతున్నారని, రూ.3 వేలకు పైగా అదనపు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. గింజ పాలు పోసుకునే దశలో పడిన వరిని అంచనా ప్రకారం నిలబెట్టి కట్టలు కట్టినా పెద్దగా ప్రయోజనం ఉండదని పైగా వాపోతున్నారు. గింజ నాణ్యత కోల్పోవడం, తాలు గింజలు వంటి సమస్యల కారణంగా దిగుబడి బాగా తగ్గుతుందని ఈ చెబుతున్నారు. సొంత భూమి కొంత ఉండే మరో నాలుగైదు ఎకరాలు కౌలుకి తీసుకొని సాగు చేస్తున్న రైతులే 80 శాతం మంది ఉన్నారు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టారు. తుపాను ప్రభావం చూపితే ఇప్పటికే చర్యలతో పెట్టిన పెట్టుబడితో పాటు కౌలు చెల్లింపు మరింత భారమవుతుందని రైతులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

## నీళ్లలో టిడ్కో అపార్ట్మెంట్ ఇళ్లు

కావలి (నెల్లూరు), అక్టోబరు 29 ప్రభాతవార్త: ఇటీవల వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు ముంథా తుఫాను వలన భారీ వర్షాలు కురవడంతో కావలి పట్టణంలో ఉన్న టిట్కో ఇళ్ల చుట్టూ నీళ్ల చేరి నందున అక్కడ ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకునేందుకు బుధవారం సిపిఎం పార్టీ నాయకులు అక్కడ పర్యటించి ప్రజల ఇబ్బందులను తెలుసుకోవడం జరిగింది. అనంతరం వారు మాట్లాడారు ఇళ్ల చుట్టూ నీళ్లు చేరడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. ఇళ్ల నుంచి రోడ్లలో నడవలేని పరిస్థితి ఉన్నదని ఇళ్లలోనే ఉన్నందున జనజీవన పరిస్థితుల్లో కూడా ఇబ్బందిగా ఉన్నదని తెలియజేశారు. ఇప్పటికీ సుమారు వారం రోజుల నుండి వర్షాలు కురుస్తున్నందున తుఫాను వలన పనులు చేసుకునేటువంటి పేదలు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే సహాయాన్ని అందించి ఆదుకోవాలని వర్షపు నీళ్లు బయటకు వెళ్లేందుకు తగు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతి సంవత్సరం వర్షాలు కురిసినప్పుడు ఇదే పరిస్థితి ప్రజలు ఎదుర్కొంటున్నారని, ఇది చాలా అన్యాయమని ఎంతోమంది పేదలు ఈ నీళ్లల్లో ఇబ్బందులు పడుతున్నారని వెంటనే టిట్కో ఇళ్ల చుట్టూ రిటర్నింగ్ వాల్ నిర్మాణం చేపట్టాలని కోరారు. అక్కడ నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య, నాయకులు వై. కృష్ణమోహన్, భోగిశెట్టి కృష్ణయ్య, కె. చెన్నయ్య, ఎస్ కే ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.



## తాటిచెట్టు పడి మహిళ మృతి

మామిడికుదురు, అక్టోబరు 29 ప్రభాతవార్త: మొంథా తుపాను ప్రభావంతో వీచిన పెనుగాలుల కారణంగా తాటిచెట్టు మీద పడడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. మామిడికుదురు మండలం మాకనపాలెం గ్రామానికి చెందిన గూడపల్లి వీరవేణి (49) అనే మహిళపై తాటిచెట్టు పడి మృత్యువాత పడింది. సమాచారం తెలిసిన వెంటనే పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అప్పటి వరకు కళ్లముందు తిరిగిన వీరవేణి ఆకస్మాతుగా విగతజీవిగా మారడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలేపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

## ప్రమాదపుటంచున చెరువులు



వింజమూరు (నెల్లూరు), అక్టోబర్ 29, ప్రభాతవార్త: మొంథా తుపాన్ ప్రభావంతో వింజమూరు మండలంలో ఉన్న 31 చెరువులకు గాను 17 చెరువులు పూర్తిగా నిండినట్లు 12 చెరువులకు 75 శాతం నీరు చేరినట్లు, మరో రెండు చెరువులకు 25 శాతం నీరు చేరినట్లు ఇరిగేషన్ డీఈ రమణారావు తెలిపారు. బుధవారం ఇరిగేషన్ డీఈ రమణారావు, ఏఈలు మహేంద్ర, శ్రీనివాసరావు, మండల కన్వీనర్ గూడా నరసారెడ్డితో కలిసి చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊటుకూరు, జువ్విగుంటపాలెం చెరువులు, ప్రమాదపుటంచున ఉన్నాయని, జువ్విగుంటపాలెం చెరువు అలుగు సమీపంలో బండ్ల బాట వద్ద నీరు బయటకు వస్తుందన్నారు. యుద్ధ ప్రాతిపదికన చెరువు కట్టకు మరమ్మత్తులు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఊటుకూరు చెరువు కట్ట బలహీనంగా ఉందని తొమ్మిది లక్షల రూపాయలతో ప్రతిపాదనలను పంపించడం జరిగిందన్నారు. ప్రస్తుతానికి కట్ట బలహీనంగా ఉన్న ప్రాంతంలో మట్టిని తోలి చదును చేసేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. నల్లగొండ బొడ్డు వాగు చెరువు, చంద్రపడియ చెరువు, బుక్కాపురం చెరువు, మలపరాజు వాగు చెరువు, శంఖవరం చెరువు, ఊటుకూరు ఊర చెరువు, తక్కెళ్ళపాడు చెరువు, రావిపాడు పెద్ద చెరువు, కాటేపల్లి పెద్ద చెరువు, తమీద పాడు వద్ద చెరువు, బాడవ చెరువు, ఇర్ల చెరువు, నల్లగొండ ఊర చెరువు, కాటేపల్లి ఊర చెరువు, రావిపాడు ఊర చెరువు, బత్తిన వారిపల్లి పెద్ద చెరువు, బొమ్మరాజు చెరువులు పూర్తిగా నిండాయన్నారు. ఎర్రబల్లి పాలెం పెద్ద చెరువు, వింజమూరు పాత చెరువు, రామలింగారెడ్డి పెద్ద చెరువు, ఎర్ర చెరువు, అంకాలమ్మ చెరువు, గుండె మడగల, ఏకమ్మ చెరువు, జువ్వగుంటపాలెం, మిట్ట చెరువు నంది గుంట, ఏకిస్తిపురం పెద్ద చెరువు, ఏకిస్తీపురం గ్రామ చెరువు, నందిగుడి వాగు ఊటుకూరు పెద్ద చెరువు, చింతలపాలెం చెరువు, చాకలి కొండ చెరువులు 75 శాతం నిండాయని తెలిపారు. మోట చింతలపాలెం చెరువు, ఓబులమ్మ చెరువులకు 25శాతం నీరు చేరినట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు. వారి వెంట ఏగినేని శ్రీనివాసులు రైతులు ఉన్నారు.

## నష్టం కలిగించిన మొంథా



తిరుపతి (జిల్లా డెస్క్), అక్టోబరు 29 ప్రభాతవార్త: మొంథా తుపాన్ బలహీనపడి తీరం దాటినా తిరుపతి జిల్లాలో భారీ నష్టం కలిగించింది. మొంథా తుఫాన్‌తో గత మూడురోజులు విడవకుండా భారీ వర్షాలు కురిశాయి. ఈ వర్షాలకు తిరుపతిజిల్లాలో తిరుపతి రూరల్ మండలం, చంద్రగిరి, రామచంద్రాపురం, రేణిగుంట, ఏర్పేడు ,శ్రీకాళహస్తి, వెంకటగిరి, నారాయణవనం, తుంబూరు, సత్యవేడు, బిఎన్ కండ్రిగ, గూడూరు, తడ, సూళ్ళూరుపేట మండలాల్లో పంటలు నీటమునిగాయి. ప్రధాన రహదారులపై వరదనీరు నిలిచి దెబ్బతిన్నాయి. బుధవారం ఉదయం వాన ఆగడంతో అనేక మండలాల్లో వరద పరిస్థితులు, పంట నష్టంపై

### నీటమునిగిన పంటలు... బాధితులకు సహాయం

జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, డిఆర్ఓ నరసింహులు, ఆర్‌డిఓ రామ్మోహన్, జిల్లా సివిఎస్ఓ శేషాచలంరాజుతో కలసి పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో వరదలకు నిరాశ్రయులైన, పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలతో మాట్లాడారు. వారికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఒక్కో కుటుంబానికి 3వేల రూపాయలు నగదు, 25 కిలోల బియ్యం, కేజీ కందిపప్పు, చక్కెర, నూనెలు, ఉల్లిగడ్డలు, ఉల్లిపాయలు అందజేశారు. పునరావాస కేంద్రాల నుండి వారి నివాసానికి వెళ్ళే వారికి ప్రతికుటుంబానికి నగదు సాయం అందించారు. ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని యుద్ధప్రాతిపదికన అంచనా వేయాలని కలెక్టర్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ వెంకటేశ్వరు నారాయణవనం మండలం తుంబూరు. శ్రీకాళహస్తి, బిఎన్‌కండ్రిగ, కారనిమిట్టరప్రాంతాల్లో వద్ద కాజ్‌వేలను తనిఖీ చేశారు. ప్రజలు చెరువులు, నదీకాలువల వద్ద జాగ్రత్తగా ఉండాలని సూచించారు. భారీ వరదలతో పంటపోలాల్లోకి నీరు చేరిందని, నీరు పొలాలకు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులందరికీ సకాలంలో యూరియా సరఫరా చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

## ఆర్టిజిఎస్ కేంద్రం నుంచి మంత్రి లోకేష్ సమీక్ష



సచివాలయం, అక్టోబరు 29 ప్రభాతవార్త: వివిధ జిల్లాల్లో మొంథా తుఫాను తీవ్రత, ఇప్పటివరకు జరిగిన నష్టంపై ఉన్నతాధికారులతో ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సమీక్షించారు. మొంథా తుఫాన్ వల్ల కలిగిన నష్టంపై ప్రాథమిక అంచనాలు త్వరితగతిన రూపొందించాలని అధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణపై అధికారులను ఆరా తీశారు. ప్రధానంగా కోనసీమ, కృష్ణా, బాపట్ల, ఎన్టీఆర్, ప్రకాశం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉండి బాధితులకు అవసరమైన సహాయక చర్యలు చేట్టాలని అది పార్టీ కర్తవ్యంగా ప్రతి ఒక్కరూ భావించాలని కోరారు. నష్టపరిహారం అంచనా తర్వాత కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి పూర్తిగా పరిహారం అందేలా కృషిచేస్తామన్నారు. నష్టపోయిన ప్రతి ఒక్కరిని గుర్తించేలా అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని కోరారు. త్రాగునీరు వైద్యసేవలు అందరికి సకాలంలో అందాలని అధికారులను ఆదేశించారు.



## ప్రమాదకరంగా కలుజులు

నెల్లూరు అగ్రికల్చర్, అక్టోబరు 29 ప్రభాతవార్త: పాలకుల అశ్రద్ధ ప్రజలకు శాపంగా మారింది. తుఫాన్లు భారీ వర్షాలు సంభవించిన ప్రతి ఏటా కలుజుల్లో రాకపోకలు సాగించలేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇది ఎక్కడో కాదు నెల్లూరు- తాటిపర్తి మార్గంలో ఉన్న పొట్టేపాలెం కలుజు, ములుమూడి చెరవుఉ కలుజు. ఈ రెండు కలుజుల్లో వర్షాల సీజన్లో రాకపోకలు సాగించే ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలు, వామపక్ష పార్టీలు ఈ కలుజులపై బ్రిడ్జిలు నిర్మించమని ధర్నాలు కూడా చేపట్టారు. అయినా పాలకులకు కనువిప్పు కలగలేదు. ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రజలకు మరో సారి అవస్థలు ఏర్పడ్డాయి. రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డ సందర్భాల్లో అధికారంలో ఉన్న నేతలు కలుజు వద్దకు వచ్చి మట్టి కట్టను మరో మారు పటిష్టం చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప శాశ్వత పరిష్కారానికి మార్గం చూపలేకపోతున్నారు. ఈ మార్గంలో రెండు పుణ్య క్షేత్రాలను వేలాదిగా ప్రజలు నిత్యం సందర్శిస్తుంటారు. ఒకటి వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కాగా, రెండోది జొన్నవాడ కామాక్షితాయి ఆలయం ఉన్నాయి. అంతే కాక ఈ మార్గంలో ఉండే అనేక గ్రామాల నుంచి వేలాదిగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అనేక మంది నెల్లూరులో చిరు ఉద్యోగాలు చేసుకునే వారు సైతం ప్రతి రోజు ద్విచక్ర వాహనాల్లో ప్రయాణాలు సాగిస్తుంటారు. వీరందరికి వర్షాకాలం వచ్చిందంటే గుండెల్లో గుబులు పుట్టుకుంటుంది. నీళ్ల దాటే క్రమంలో ఏమవుతుందో ఏమో నన్న బెంగతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణాలు సాగిస్తుంటారు. ఇకనైనా అధికారులు, నేతలు ఈ ప్రాంతాలను మరో మారు పరిశీలించి ఈ రెండు కలుజులపై శాశ్వతంగా బ్రిడ్జిలు నిర్మించి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆ ప్రాంత ప్రజలంతా కోరుతున్నారు.



కోత గురైన రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు, టిడిపి నాయకులు

## ధ్వంసమైన రోడ్లు... రాకపోకలు బంద్

వెంకటగిరి, అక్టోబరు 29 ప్రభాతవార్త: మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా వెంకటగిరి మండల పరిధిలోని పలు రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆదేశాల మేరకు, మండల పార్టీ అధ్యక్షులు పప్పు చంద్రమోళి రెడ్డి ఆధ్వర్యంలో బృందం మంగళవారం పలు ప్రాంతాలను సందర్శించింది. మొదటగా పాలకొండ సత్రం వరవ కాలువ సమీపంలోని టీబీ పల్లి రహదారిని పరిశీలించారు. వరద నీరు ఎక్కువగా రావడంతో రహదారి పూర్తిగా అధ్వాన్నస్థితికి చేరిందని, తక్షణమే మరమ్మతు పనులు చేపట్టాల్సిన అవసరముందని చంద్రమోళి రెడ్డి తెలిపారు. తదుపరి పాలెంకోట కల్వర్టును పరిశీలించి, డ్యామ్‌లోని వరద నీటి స్థితిగతులను సమీక్షించారు. డ్యామ్ గేట్ల వద్ద వాల్వులు తుప్పు పట్టి పనిచేయకుండా స్టక్ అయినట్లు గుర్తించడంతో, వెంటనే మరమ్మతులు చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాథం, పట్టణ అధ్యక్షులు అవ్వారు సత్యనారాయణ, ఏఎంసీ వైస్ చైర్మన్ సూరి, లాలాపేట సొసైటీ అధ్యక్షులు గొల్లగుంట వెంకటముని, యాతులూరి సొసైటీ అధ్యక్షులు గుత్తికొండ బాబురావు, యూనిట్ ఇంచార్జ్ చాట్ల రాజా, ఆయకట్ట అధ్యక్షులు శ్రీనివాసులు, మండల తెలుగుయువత అధ్యక్షులు పి.ఎం.శివనారాయణ, బూత్ కన్వీనర్ చాట శేఖర్, అక్కుపల్లి వెంకటేశ్వర్లు, తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆవుల మురళి, పాలెంకోట ఆయకట్ట అధ్యక్షులు ముదిముక్కల దనయ్య, పార్టీ నాయకులు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న సత్యవేడు టీడీపీ పార్టీ కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి

## వరద బాధిత రైతులకు పరామర్శ

బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబరు 29 ప్రభాతవార్త: మొంథా తుఫాను ప్రభావంతో పంటలు నష్టపోయిన వరద బాధిత రైతులను సత్యవేడు టీడీపీ పార్టీ కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి పరామర్శించి అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, వెంటనే మొంథా తుఫాను ప్రభావం వలన మండలంలో వివిధ ప్రాంతాల్లో దెబ్బతిన్న పంట పొలాలను, బొగడలు పడిన చెరువు కట్టలను, కాజ్‌వేలను పరిశీలించారు. కుక్కంబాకం పంచాయతీ బైరవారిగుంట తూముకి బొగడపడి గ్రామంపైకి వస్తున్న నీటి ప్రవాహాన్ని గమనించి గ్రామస్తుల సమక్షంలోనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పునరుద్ధరణ చర్యలు చేపట్టామని ఆదేశించారు. కారణి పంచాయతీలో దెబ్బతిన్న పంట పొలాలను సందర్శించి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తరపున తక్షణ సహాయం అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎక్స్‌గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుమ్మల కన్నయ్య నాయుడు, మునిచంద్రనాయుడు, మధు నాయుడు, కార్తీక్‌చౌదరి, మనోహర్‌నాయుడు, రవి నాయుడు, పీఏసీఎస్ చైర్మన్ భాస్కర్ యాదవ్, మండల ఐటీడీపీ రమేష్, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పంప్‌హౌస్‌లో ఇరుక్కుపోయిన ముగ్గురు సిబ్బంది

సురక్షితంగా బయటకు తెచ్చిన యంత్రాంగం

అద్దంకి, అక్టోబరు 29 ప్రభాతవార్త: గుండ్లకమ్మ నీటిలో చిక్కుకున్న ముగ్గురు రక్షిత మంచినీటి పథక విభాగంలో పనిచేస్తున్న కార్మికులను ఎట్టకేలకు అధికారులు బుధవారం సాయంత్రం బయటకు తీసుకొచ్చారు. అందిన వివరాలు ప్రకారం గుండ్లకమ్మ నది ప్రక్కన ఫారెస్టు సమీపంలో రక్షిత మంచినీటి పథకం పంప్‌హౌస్‌లో మంగళవారం రాత్రి విధులు నిర్వహించేందుకు ఇరువురు సిబ్బంది, నరేంద్ర, బాబురావులను ఊటబావి వద్దకు వెళ్ళారు. కరెంటు లేకపోవడంతో మోటార్ సహాయంతో పంప్‌హౌస్‌ను రన్ చేశారు. ఉదయం డ్యూటీలు మారే సమయంలో వీరి వద్దకు మరో కార్మికుడు చేరుకున్నారు. అయితే కొద్ది సమయానికే గుండ్లకమ్మ నదిలోనే వరద ఉధృతి పెరిగి, పంప్‌హౌస్ చుట్టూ వరదనీరు చేరి, వీరు బయటకు రాలేక పోయారు. ఫోన్ ద్వారా వీరు మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది సహాయంతో పడవ తీసుకొని, అక్కడికి చేరుకున్నారు. అయితే పడవలో వీరిని తీసుకొని ప్రయాణించే సమయంలో బరువు ఎక్కువై పడవ ఒరిగిపోవడంతో చెట్లను పట్టుకొని వదరలో వుండిపోయారు. వెంటనే ఫిష్ రీస్ యూనియన్ నాయకుడు కుమార్‌కు సమాచారం ఇవ్వడంతో కొందరు జాలర్లు తీసుకొని పడవతో అక్కడికి చేరుకున్నారు. ఆ పడవ సహాయంతో జాలర్లు వీరిని క్షేమంగా ఒడ్డుకు చేర్చినట్లు చీరాల డిఎస్‌పి ఎండి మొయిన్ వెల్లడించారు. ఈ రిస్క్ ఆపరేషన్‌లో మున్సిపల్ కమీషనర్ రవీంద్ర, సి.ఐ. సుబ్బారావు, ఫైర్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు, తహాశీల్దార్ శ్రీచరణ్, పట్టణ టిడిపి నేతలు ఆయా శాఖల అధికారులు పాల్గొన్ని సిబ్బందిని క్షేమంగా బయటకు తేవడంపై డిఎస్‌పి అభినందించారు. జాలర్ల యూనియన్ నాయకుడు కుమార్‌ను జాలర్లను డిఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు. ఈ రిస్క్ ఆపరేషన్‌లో సహకరించిన ప్రతి ఒక్కరిని డిఎస్‌పి అభినందించారు.

# మహిళల వన్డే వరల్డ్ కప్‌లో
# భారత్ ఫైనల్ చేరేనా?

## వర్షం ఎఫెక్ట్: ఆసిస్‌తో నేటి సెమీస్ సందిగ్ధం!





**న్యూఢిల్లీ:** మహిళల వన్డే వరల్డ్ కప్-2025 ఫైనల్‌కు చేరుకునే విషయంలో టీమిండియా క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. నేడు ఆస్ట్రేలియాతో సెమీఫైనల్ మ్యాచ్ జరగాల్సి ఉండగా, వర్షం కారణంగా అది జరగడంపై సందిగ్ధత నెలకొంది. మర్నాడు రిజర్వ్ డే రోజున కూడా వర్షం పడే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. మహిళల వన్డే ప్రపంచ కప్‌లో భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా మధ్య రెండవ సెమీఫైనల్ మ్యాచ్ ఈ నెల 30న జరుగుతుంది. నవీ ముంబైలోని డీవై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీలో జరిగే ఈ మ్యాచ్ కోసం రెండు జట్లు మైదానంలో తీవ్రంగా కృషి చేస్తున్నాయి. ఇంతలో, ఈ మ్యాచ్ గురించి వాతావరణ శాఖ కీలక సమాచారం అందించింది. వర్షం మ్యాచ్‌కు అంతరాయం కలిగించే అవకాశాలు ఉన్నట్లు సంకేతాలు ఇచ్చింది. కొంకణ్‌కు దక్షిణంగా ఉన్న అల్పపీడన ప్రాంతం కారణంగా ముంబైలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. రాబోయే 48-72 గంటల్లో ముంబైలో బలమైన గాలులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఇది భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా మధ్య జరిగే రెండవ సెమీఫైనల్‌ను ప్రభావితం చేసే వీలుంది. ఈ నెల 30న మ్యాచ్ జరిగే సమయంలో నవీ ముంబైలో మధ్యాహ్నం వర్షం పడే అవకాశం 69 శాతం ఉంది. ఈ రోజు మొత్తం 3.8 మి.మీ. వర్షం పడే వీలుంది. అయితే సెమీఫైనల్స్, ఫైనల్స్ కోసం నిర్వాహకులు రిజర్వ్ డేలు కేటాయించారు. కానీ, అక్టోబర్ 31న నవీ ముంబైలో కూడా వర్షం పడే అవకాశం ఉంది. దీని వలన మ్యాచ్‌రద్దు అయ్యే అవకాశం ఉంది. రిజర్వ్‌డే రోజున వర్షం కారణంగా భారత్, ఆస్ట్రేలియా మధ్య మ్యాచ్ జరగకపోతే, అది ఆస్ట్రేలియాకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుస్తుంది. ఎందుకంటే, ఈ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు వారు ఒక్క మ్యాచ్‌కూడా ఓడిపోలేదు. వర్షంకారణంగా మ్యాచ్‌రద్దు అయితే, పాయింట్ల పట్టిక ఆధారంగా ఫైనల్ నిర్ణయించబడుతుంది. అంటే, అత్యధిక పాయింట్లు సాధించిన జట్టు ఫైనల్‌కు చేరుకుంటుంది. ఈ విధంగా, ఆస్ట్రేలియా 13 పాయింట్లతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉండగా, భారతదేశం 6 పాయింట్లతో నాల్గవ స్థానంలో ఉంది. ఈ సందర్భంలో, ఆస్ట్రేలియా ఫైనల్‌కు చేరుకుంటుంది. ఈ నేపథ్యంలో సెమీఫైనల్ జరిగే రోజున వర్షం రాకుండా ఉండాలని క్రికెట్ అభిమానులు కోరుకుంటున్నారు.

## ఆసియా యూత్ గేమ్స్‌లో ఫైనల్స్‌కు ఆరుగురు బాక్సర్లు

**న్యూఢిల్లీ:** ఆసియా యూత్ గేమ్స్-2025లో భారత యువ బాక్సర్లు సత్తా చాటారు. ఐదుగురు బాలికలు మరియు ఒక బాలుడు సహా ఆరుగురు బాక్సర్లు ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. అలాగే పురుషుల విభాగంలో అనంత్ దేశ్‌ముఖ్ బలమైన సెమీఫైనల్ పరుగు తర్వాత భారత్ ఒక కాంస్య పతకాన్ని కూడా నిర్ధారించింది. బహ్రెయిన్‌లోని మనామాలో జరిగిన బాలికల సెమీఫైనల్స్‌లో, ఖుషీ చంద్ (46 కిలోలు) మంగోలియాపై 5:0 తేడాతో విజయం సాధించి భారత ఆధిపత్య పరుగును ప్రారంభించింది. ఆ తర్వాత చంద్రిక భోరేషి పూజారి (54 కిలోలు) తన ప్రత్యర్థి కజకిస్తాన్‌పై 5:0 తేడాతో విజయం సాధించగా, హర్నూర్ కౌర్ (66 కిలోలు) అద్భుతమైన సంయమనం, ఎదురుదాడి ప్రదర్శించి చైనీస్ తైపీని (5:0) ఓడించగా, అన్షిక (+80 కిలోలు) మరో క్లీన్ స్వీప్‌లో చైనాను చిత్తు చేసింది. ఇక సెషన్ 2లో, అహానా (50 కిలోలు) ఉజ్బెకిస్తాన్ నుండి వచ్చిన కఠినమైన సవాలును అధిగమించి పట్టుదలను ప్రదర్శించి 3:2 తేడాతో గెలిచింది. అలాగే బాలుర విభాగంలో లాంచెన్‌బా సింగ్ మోయిబుంగ్‌ఖోంగ్‌బామ్ (50 కిలోలు) పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియాపై 5:0 ఏకగ్రీవ విజయంతో తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించి ఫైనల్స్‌లోకి ప్రవేశించాడు.




అలాగే అనంత్ దేశ్‌ముఖ్ (66 కిలోలు) కజకిస్తాన్‌కు చెందిన బలమైన ప్రత్యర్థిపై పోరాడినా సెమీఫైనల్‌లో ఓడి కాంస్య పతకంతో సరిపెట్టుకోవలసి వచ్చింది. దీంతో ఆరుగురు ఫైనలిస్టులతో పాటు, ఒక కాంస్య పతకంతో భారత్ అత్యంత విజయవంతమైన యూత్ బాక్సింగ్ ప్రచారంలో ఒకటిగా నమోదు చేసింది.



## కెనడియన్ మహిళల ఓపెన్
# అనాహత్ సంచలన విక్టరీ

**న్యూఢిల్లీ:** కెనడియన్ మహిళల ఓపెన్-2025లో భారత్‌కు చెందిన టీనేజ్ సంచలనం అనహాత్ సింగ్ సంచలన విజయం సాధించింది. 2025 కెనడియన్ ఉమెన్స్ ఓపెన్‌లో అనాహత్ సింగ్ ప్రపంచ నం.7 బెల్జియంకు చెందిన టిన్నె గిలిస్‌ను ఓడించి మరో భారీ విజయాన్ని నమోదు చేసింది. 17 ఏళ్ల ఆమె డిఫెండింగ్ ఛాంపియన్ మరియు మాజీ ప్రపంచ క్రీడల ఛాంపియన్ బెల్జియన్ సూపర్ స్టార్‌ను వరుస గేమ్‌లలో 12-10, 11-9, 11-9 తేడాతో ఓడించి తన తొలి పిఎస్ఎ సిల్వర్ సెమీఫైనల్‌కు చేరుకుంది. ఇది అనాహత్ కెరీర్‌లో అతిపెద్ద విజయమే కాకుండా మొదటిసారిగా, ఆమె ప్రపంచంలోనే టాప్10 ర్యాంక్‌లో ఉన్న క్రీడాకారిణిని ఓడించింది. 16వ రౌండ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన మెలిస్సా అల్వ్స్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో టాప్ 20లో ఉన్న క్రీడాకారిణిపై 3-1 తేడాతో విజయం సాధించిన తర్వాత ఈ టోర్నమెంట్‌లో అనాహత్ సాధించిన రెండవ ప్రధాన విజయం ఇది. ఇప్పుడు సెమీఫైనల్‌లో, అనహాత్ ఇంగ్లాండ్‌కు చెందిన 4వ సీడ్ గినా కెన్నెడీతో తలపడనుంది, ఆమె కెనడియన్ నంబర్ 1 హోలీ నాటన్‌పై విజయం తర్వాత ఇంటి ఆశలను తుడిచిపెట్టుకుంది.

## పారిస్ మాస్టర్స్‌లో అల్కరాజ్ ఘోర ఓటమి



**న్యూఢిల్లీ:** పారిస్ మాస్టర్స్‌లో ప్రపంచ నంబర్ 1 కార్లోస్ అల్కరాజ్ ఓటమిపాలయ్యాడు. కామెరాన్ నోరీ చేతిలో ఘోర పరాజయం చెందాడు. బ్రిటన్‌కు చెందిన కామెరాన్ వరల్డ్ టాప్ సీడ్ కార్లోస్ అల్కరాజ్‌ను 4-6, 6-3, 6-4 తేడాతో ఓడించి మూడో రౌండ్‌కు చేరుకుని ఎటిపి మాస్టర్స్ 1000 స్థాయిలో స్పెయిన్ ఆటగాడు 17 మ్యాచ్‌ల విజయ పరంపరకు ముగింపు పలికాడు. టోక్యోలో సీజన్‌లో తన ఎనిమిదో టైటిల్‌ను గెలుచుకున్న తర్వాత, ఆరుసార్లు గ్రాండ్‌స్లామ్ ఛాంపియన్ అయిన అల్కరాజ్ తన ఆటకు దూరంగా ఉన్నాడు. తదుపరి పారిస్ మాస్టర్స్‌లో కామెరాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 54 అనవసర తప్పిదాలు చేశాడు. మొదటి సెట్ గెలిచిన తర్వాత, అల్కరాజ్ జోరును కొనసాగించడంలో విఫలమయ్యాడు. అయితే నోరీ క్రమంగా ఆత్మవిశ్వాసాన్ని పెంచుకున్నాడు. ప్రపంచ 31వ ర్యాంక్ ఆటగాడైన కామెరాన్ చివరి సెట్‌లోని ఏడవ గేమ్‌లో రెండు బ్రేక్ పాయింట్లను కాపాడుకున్నాడు మరియు రెండు గంటల 22 నిమిషాల తర్వాత మ్యాచ్‌ను కైవసం చేసుకోవడానికి సర్వ్‌ను పట్టుకున్నాడు. మార్చి తర్వాత ఫైనల్‌కు ముందు అల్కరాజ్ ఓటమి మొదటిసారి. మయామి ఓపెన్ వరకు సాగిన అతని ఆధిపత్యం మాస్టర్స్ 1000 టోర్నమెంట్‌తో నిలిపివేసాడు, ఈ సమయంలో అతను మోంటే కార్లో, రోమ్ మరియు సిన్సినాటి టైటిళ్లను గెలుచుకున్నాడు. ఈ వారం ఇటలీకి చెందిన జానిక్ సిన్నర్ పారిస్ టైటిల్‌ను కైవసం చేసుకుంటే అల్కరాజ్ సంవత్సరాంతపు ప్రపంచ నంబర్ వన్ స్థానాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది.

### వరుణుడి ఎఫెక్ట్
## ఆసీస్‌తో తొలి టి20 రద్దు
### భారత్ 9.4 ఓవర్ల 97 రన్స్ వద్ద బ్రేక్

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా, భారత్ మధ్య జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తొలి మ్యాచ్ వర్షం కారణంగా అర్ధంతరంగా రద్దు అయ్యింది. కాన్‌బెర్రాలోని మనుకా ఓవల్ వేది కగా బుధవారం జరిగిన తొలి టీ20 మ్యాచ్ వరుణుడు అడ్డుతగలడంతో, రెండు పవర్‌హౌస్ జట్ల మధ్య పోరు అర్ధంతరంగా నిలిచిపోయింది. ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. భారత జట్టు ఇన్నింగ్స్ ప్రారంభమైన కాసేపటికే వర్షం అంతరాయం కలిగించింది. కొంత విరామం తర్వాత ఆటను ఒక్కో జట్టుకు 18 ఓవర్లకు కుదించారు. భారత ఓపెనర్ అభిషేక్ శర్మ (19 పరుగులు) త్వరగా ఔటైనా, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, శుభ్‌మన్ గిల్ అద్భుతమైన బ్యాటింగ్‌తో అలరించారు. వీరిద్దరూ దూకుడుగా ఆడుతూ ఆస్ట్రేలియా బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టారు. ముఖ్యంగా సూర్యకుమార్ యాదవ్ (24 బంతుల్లో 39 పరుగులు) తనదైన శైలిలో సిక్సర్లు, బౌండరీలతో అభిమానులను ఉర్రూతలూగించాడు. గిల్ (20 బంతుల్లో 37 పరుగులు) కూడా అతనికి చక్కటి సహకారం అందించాడు. భారత జట్టు 9.4 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 97 పరుగులు చేసిన తరుణంలో, వర్షం మళ్లీ ప్రారంభమైంది.




ఈసారి వర్షం తీవ్రత ఎక్కువగా ఉండడంతో, ఆట నిలిచిపోయింది. వర్షం తగ్గుముఖం పడుతుందని ఎదురుచూసినప్పటికీ తగ్గకపోవడం అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో రెండవ టీ20 మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో ఈ నెల 31 న జరగనుంది.

## ఐపిఒకు సిద్ధమవుతున్న ఆకాశ ఎయిర్‌లైన్స్

**న్యూఢిల్లీ, అక్టోబరు 29:** దేశీయ విమానయాన సంస్థ ఆకాస ఎయిర్ వచ్చే ఐదేళ్లలో ఐపిఒకు రావాలనినిర్ణయించింది. వచ్చే ఏడాది రెండో అర్ధసంవత్సరంనుంచి కూడా పైలట్లను నియమించుకునేందుకు కసరత్తులు ప్రారంభించినట్లు సంస్థ సిఇఒ వెల్లడించారు. నష్టాల్లో నడుస్తున్న ఆకాశ భారత్‌లో మూడో అతిపెద్ద ఎయిర్‌లైన్‌గా నిలుస్తోంది. బోయింగ్‌నుంచి విమానాల డెలివరీలో ఉన్న జాప్యం కారణంగా పైలట్లకు సరిపడా విధుల్లేవు.
అంతేకాకుండా వారానికి ఏడురోజులప నిపై వర్క్‌ఫోర్స్ సమ్మెకూడా సంస్థకు కొంత సమస్యలు తెచ్చిపెట్టింది. బోయింగ్ జాప్యాలే తమకు ప్రధాన సమస్యగా ఉన్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్‌లు చెపుతున్నారు. వచ్చే 60 రోజుల్లో పైలట్లు నూరుశాతం పనిగంటలు




నిర్వర్తిస్తారని, వారంతా కాక్‌పిట్‌లోకి రాగలరని ఆకాశ సిఇఒ వినయ్‌దూబే వెల్లడించారు. ఐపిఒకు ముందు మూలధన సేకరణ అవసరం లేదని ఇప్పటికే రహస్యమార్గంలో నిధులు కొంతమేర సేకరించినట్లు సిఇఒ వివరించారు. మాకు 30 విమానాలు రావాల్సి ఉందని చెప్పిన సిఇఒ ఈ ఏడాది ఆకాశ ఎన్ని విమానాలు రాబడుతుందనన్నది మాత్రం చెప్పలేదు. 2026 అక్టోబరునాటికి ఆకాశకు మొత్తం 54 విమానాలు ఉంటాయని తెలుస్తోంది. 2027 మార్చి నాటికి అయితే మొత్తం 72 విమానాలు తమ సంస్థపేరిట ఉంటాయన్న ధీమాతో ఉంది.

**వాణిజ్యం**

## ఈక్విటీ సూచీలకు ఎనర్జీ, మెటల్ స్టాక్స్ మద్దతు
### లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, అక్టోబరు 29:** స్టాక్ మార్కెట్లు మరోసారి లాభాల్లోనే ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్‌దోరణులు, ఇన్వెస్టర్ సెంటిమెంట్లు బలపడటంతో కొనుగోళ్లపెరిగాయి. అంతేకాకుండా అమెరికా ఫెడ్‌రిజర్వు నిర్ణయాలపైనా ఇన్వెస్టర్లు ఆసక్తిచూపించారు. వీటితోపాటుగానే అమెరికా చైనా వాణిజ్య ఒప్పందం వంటివి కీలకం అయ్యాయి. నిఫ్టీ 26,050 స్థాయిని దాటింది. ఇంధనం, మెటల్‌స్టాక్స్ లాభాలకు మద్దతిచ్చాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 368.97 పాయింట్లుపెరిగి 84,997.13 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సూచీ 117.70 పాయింట్లుపెరిగి 26,053.90 పాయింట్లవద్ద నిలిచింది. ఆదాని పోర్ట్స్ అండ్ సెజ్ 2.78శాతం, ఆదాని



ఎ ంటర్‌ప్రైజెస్ 1.65శాతం, రిలయన్స్ 1.14శాతం పెరిగి సూచీలకు మద్దతుగా నిలిచాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 0.68శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 0.56శాతం పెరిగింది. బిఎస్ఇలో 2446 స్టాక్స్ పెరిగితే 1727 స్టాక్స్ దిగజారాయి. 162 కంపెనీలు యధాతథంగా నిలిచాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో డాలరుతో రూపాయి మారకం విలువలు 88.29గా నడిచింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు 1.55శాతంపెరిగి 1,21,530కి చేరాయి. అలాగే అమెరికా పదేళ్ల బాండ్లు 0.18శాతంపెరిగి 3.990గా నిలిచాయి. కమోడిటీ మార్కెట్లపరంగా బ్రెంట్ ముడిచమురు డిసెంబరు కాంనరటాక్టుల్లో 11 సెంట్లు లాభపడి 17శాతంపెరిగి బ్యారెల్‌కు 63.94 డాలర్లుగా నడిచింది. వరుణ్ బేవరేజెస్ 9.31శాతం పెరిగితే టాటాక్యాపిటల్ 1.37 శాతం క్షీణించింది. శ్రీసిమెంట్ 2.16శాతం, ఆదాని గ్రీన్ ఎనర్జీ 10.80 శాతం, ఆదాని టోటల్ గ్యాస్ 2.15శాతం, గో డిజిటల్‌జనరల్ ఇన్సూరెన్స్ 1.23శాతం, మహీంద్ర ఫైనాన్షియల్ సర్వీసెస్ 6.07శాతం పెరిగాయి. ఫిషర్ మెడికల్ వెంచర్స్ 7.24శాతం దూసుకువెళ్లింది. డిసిఎం శ్రీరామ్ కూడా 2.17శాతం, పిఎన్‌జిఎస్ గార్గి ఫ్యాషన్ జ్యూవలరీ 20శాతం ఒక్కసారిగాపెరిగాయి. ఐపిఒలపరంగా ఓర్క్లా ఇండియా 1,24,14,260 షేర్లకు బిడ్లు సాధించింది. ఆఫర్‌లో 1,59,99,104 షేర్లను ప్రకటించింది. ఇష్యూలో 0.78రెట్లు కొనుగోళ్లు జరిగాయి.




# డిజిటల్ చెల్లింపుల్లో 'యుపిఐ' రికార్డు

**న్యూఢిల్లీ, అక్టోబరు 29:** భారత డిజిటల్ చెల్లింపుల రంగంలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్‌యూపీఐ తన రికార్డులు సృష్టిస్తోంది. 2025 మొదటి అర్ధభాగంలో యూపీఐ లావాదేవీల సంఖ్య గతేడాదితో పోలిస్తే 35 శాతం పెరిగి 106.36 బిలియన్లకు చేరింది. ఈ లావాదేవీల మొత్తం విలువ రూ. 143.34 లక్షల కోట్లుగా నమోదైంది.
దేశంలో డిజిటల్ చెల్లింపులు ప్రజల దైనందిన జీవితంలో ఎంతగా భాగమయ్యాయో ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ వివరాలను వరల్డ్‌లైన్ సంస్థ తన ఇండియా డిజిటల్ పేమెంట్స్ రిపోర్ట్ (బీ1 2025)ఖిలో బుధవారం వెల్లడించింది. యూపీఐ ద్వారా జరిగే సగటు లావాదేవీ విలువ తగ్గడం గమనార్హం.
2024 ప్రథమార్ధంలో సగటున రూ. 1,478గా ఉన్న లావాదేవీ విలువ, 2025 ఇదే కాలంలో రూ. 1,348కి తగ్గింది. టీ కొట్టు, కిరాణా దుకాణం నుంచి ఆన్‌లైన్ షాపింగ్ వరకు చిన్న చిన్న, రోజువారీ కొనుగోళ్లకు ప్రజలు యూపీఐని ఎక్కువగా ఉపయోగిస్తున్నారని ఇది సూచిస్తోంది. ముఖ్యంగా వ్యక్తి నుంచి వ్యాపారికి (పి2బి) చేసే లావాదేవీలు 37 శాతం వృద్ధితో 67.01 బిలియన్లకు చేరాయి. దేశంలోని చిన్న, సూక్ష్మ వ్యాపారాలు డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మారాయని నివేదిక తెలిపింది. ప్రభుత్వ ప్రోత్సాహకాలతో భారత్‌లో ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద మర్చంట్ నెట్‌వర్క్ ఏర్పడింది. ఈ వృద్ధికి అనుగుణంగా చెల్లింపుల మౌలిక సదుపాయాలు కూడా భారీగా పెరిగాయి. దేశంలో క్యూఆర్ కోడ్‌ల సంఖ్య 2024 జనవరితో పోలిస్తే 111 శాతం పెరిగి 2025 జూన్ నాటికి 678 మిలియన్లకు చేరింది.
అలాగే, పాయింట్‌ఆఫ్‌సేల్ (పీఓఎస్) టెర్మినళ్ల సంఖ్య 29 శాతం వృద్ధితో 11.2 మిలియన్లకు చేరుకుంది. మరోవైపు క్రెడిట్ కార్డుల వాడకం ప్రీమియం ఖర్చులకు సాధనంగా మారుతోంది. యాక్టివ్ క్రెడిట్ కార్డుల సంఖ్య 23 శాతం పెరిగింది.
అయితే, చిన్న చెల్లింపులు యూపీఐ వైపు మళ్లడంతో పీఓఎస్ వద్ద డెబిట్ కార్డుల వాడకం దాదాపు 8 శాతం తగ్గింది. మొత్తం మీద మొబైల్ చెల్లింపులు 30 శాతం వృద్ధితో 98.9 బిలియన్ల లావాదేవీలను నమోదు చేశాయి. వీటి విలువ రూ. 209.7 ట్రిలియన్లుగా ఉంది.

## విదేశీ పసిడినిల్వలను భారత్‌కు తరలిస్తున్న ఆర్బీఐ




**ముంబయి, అక్టోబరు 29:** భారత రిజర్వ్ బ్యాంక్ తన బంగారు నిల్వలను భారీగా స్వదేశానికి తరలిస్తోంది. విదేశీ ఖజానాల్లో దాచిన పసిడిని తిరిగి భారత్‌కు తీసుకు రావడంపై దృష్టి సారించింది. అంతర్జాతీయంగా పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇతర దేశాలు విధిస్తున్న ఆర్థిక ఆంక్షల నుంచి తమ ఆస్తులను కాపాడుకునేందుకే ఆర్‌బీఐ ఈ వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. అధికారిక గణాంకాల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లోనే ఆర్‌బీఐ సుమారు 64 టన్నుల బంగారాన్ని భారత్‌కు తరలించింది. సెప్టెంబర్ చివరి నాటికి భారత్ వద్ద మొత్తం 880.8 టన్నుల బంగారం నిల్వలు ఉండగా, అందులో 575.8 టన్నులు ఇప్పుడు దేశీయ ఖజానాల్లోనే భద్రంగా ఉన్నాయి. మిగిలిన 290.3 టన్నుల పసిడిని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్‌మెంట్స్ వద్ద ఉంచారు. మరో 14 టన్నులు గోల్డ్ డిపాజిట్ స్కీమ్‌లలో ఉన్నాయి. రష్యాఉక్రెయిన్ యుద్ధం, ఆఫ్ఘనిస్థాన్‌ను తాలిబన్లు స్వాధీనం చేసుకున్న తర్వాత జీ7 దేశాలు ఆయా దేశాల విదేశీ మారక నిల్వలను స్తంభింపజేసిన విషయం తెలిసిందే. ఈ పరిణామాల తర్వాత 2023 మార్చి నుంచి ఆర్‌బీఐ విదేశాల నుంచి ఏకంగా 274 టన్నుల బంగారాన్ని స్వదేశానికి తీసుకొచ్చింది. విదేశాల్లోని ఆస్తుల భద్రతపై ఆందోళనల కారణంగానే ఆర్‌బీఐ ఈ చర్యలు చేపట్టింది. బుధవారం భారత మార్కెట్లలో బంగారం ధరలు పెరిగాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై నిర్ణయం వెలువరించనున్న నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లలో పసిడి ధరలు పెరగడం దేశీయ మార్కెట్లపై ప్రభావం చూపింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ లో 10 గ్రాముల బంగారం ధర ఫ్లాట్‌గా రూ.1,19,647 వద్ద ప్రారంభమై, ఆ తర్వాత 0.34 శాతం (రూ.401) పెరిగి రూ.1,20,047 వద్ద ట్రేడ్ అయింది. వెండి ధర కూడా కిలోకు 0.69 శాతం (రూ.989) పెరిగి రూ.1,45,331కి చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ఔన్సుపై 0.2 శాతం పెరిగి 3,957.42 డాలర్ల వద్ద ఉంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు బంగారం ధరలు దాదాపు 52 శాతం పెరిగాయి. అక్టోబర్ 20న ఔన్సుకు 4,381.21 డాలర్ల ఆల్‌టైమ్ గరిష్ఠాన్ని తాకింది. ప్రపంచవ్యాప్త అనిశ్చితి, వడ్డీ రేట్ల కోతపై అంచనాలు, ఆర్‌బీఐ వంటి కేంద్ర బ్యాంకులు కొనుగోళ్లు కొనసాగించడమే ఈ పెరుగుదలకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.

## రూ.1500 కోట్ల ఐపిఒకు బోట్ సిద్ధం!

**ముంబయి, అక్టోబరు 29:** దేశీయ ఎలక్ట్రానిక్స్ కంపెనీ బోట్ రూ.1500 కోట్ల పబ్లిక్ ఆఫరింగ్‌కు సెబీ ఆమోదం సాధించింది. ఐపిఒ తాజా ఇష్యూగారూ.500 కోట్లు సమీకరించేందుకు నిర్ణయించింది. అలాగే ఆఫర్ ఫర్‌సేల్ ద్వారా రూ.1000 కోట్లు ప్రస్తుత ఇన్వెస్టర్లనుంచి సమీకరించనున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఒఎఫ్ఎస్ విభాగంలో సమీర్ అశోక్ మెహతా రూ.75 కోట్లవిలువైన షేర్లను విక్రయిస్తారు.



అలాగే అమన్ గుప్తా రూ.225 కోట్లు, సౌత్‌లేక్ ఇన్వెస్ట్‌మెంట్ రూ.500 కోట్లు షేర్లను విక్రయిస్తుండగా రూ.150 కోట్లు ఫైర్‌సైడ్ వెంచర్స్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఫండ్-1, మరో 50 కోట్లు క్వాల్‌కామ్ వెంచర్స్ ఐపిఒలో విక్రయించనున్నాయి. 2013లో గురుగ్రామ్‌లో స్థాపించిన బోట్ ఆడియోగేర్లు, స్మార్ట్ వేరబుల్స్, వ్యక్తిగత గ్రూమింగ్ ఉత్పత్తులతోపాటు మొబైల్ యాక్సెసరీస్‌ను కూడా తయారీ విక్రయాలుచేపట్టింది. గతంలో రూ.2వేల కోట్ల ఐపిఒకు దరఖాస్తుచేసింది. ఇందులో 900 కోట్లు తాజా ఇష్యూగాను, ఒఎఫ్ఎస్ 1100 కోట్లుగాను ప్రకటించింది. అయితే బోట్ 2025లో లాభదాయకత సంస్థగా మారింది. నష్టాలను తగ్గించుకుంటూ వస్తోంది. రూ.60 కోట్లనుంచి తగ్గూత వస్తోంది. రాబడులు 3098 కోట్లకు పెరిగాయి. ఆడియోవిభాగంలోనే అమ్మకాలు పెరగడంతో విపరీతమైన రాబడులు సాధించగలిగింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.